

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-9-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 217 పేజీలు: 12 వెల: 6.50


**మరింత ఉగ్రరూపంతో ఎల్‌నినో**

ప్రపంచవాతారణ సంస్థ అంచనా

**భారత్ కంపెనీతో రూ.769 కోట్ల ఆయుధ డీల్**

ఎస్తోనియా రణక్షమంత్రి రాజీనామా

9లో



# నిశ్శబ్ద కల్లోలం!



● వేగంగా కరుగుతున్న హిమానీ నదాలు ● భారత్‌కు పెనుముప్పు ఏర్పడే అవకాశం ● ఓ వంక అతివృష్టి, మరో వంక అనావృష్టి ● అప్రమత్తం కాకుంటే తీవ్ర పరిణామాలు ● ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక హెచ్చరిక

**జెనీవా, సెప్టెంబరు 4:** భూమి నిశ్శబ్దంగా రగిలిపోతోంది. ప్రకృతి తన సహనాన్ని కోల్పోతూ మానవాళికి తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తోంది. ఇందుకు తాజాగా జరిగిన నేపాల్-టిబెట్ విపత్తే ఉదాహరణ. పారిశ్రామిక విప్లవానికి ముందు రోజులతో పోలిస్తే ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీలు పెరగడం వల్లే ఇలాంటి విపత్తులకు కారణమని ఐక్యరాజ్య సమితి అంచనా వేస్తోంది. అయితే, ఇది ఇంతటితో ఆగదని, మున్ముందు మరిన్ని విపత్తులను ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్చరించింది. అన్నిటికంటే ముఖ్యంగా, మిగిలిన దేశాలతో పోల్చితే భారతదేశం ఎదుర్కోబోయే విపత్తులకు సంబంధించిన సమాచారం ఆందోళన కలిగిస్తోంది. ఐక్యరాజ్య సమితి పర్యావరణ విభాగం యుఎన్ఇపి 'లిమిటింగ్ ఓవర్‌షూట్' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది ఇందులో అనేక సంచలన విషయాలు దాగి ఉన్నాయి. >>2

## 10, 11 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 8వ కలెక్టర్ల సదస్సు నిర్వహించడానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 10, 11వ తేదీల్లో ఈ సదస్సు జరగనుంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. తొలి రోజు గత సదస్సు నిర్ణయాల అమలుపై సమీక్షించనున్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, జిల్లా వారీ లక్ష్యాలపై కలెక్టర్లు ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. స్వర్ణఆంధ్ర-2047 జిల్లా రోడ్‌మ్యాప్‌లపై ప్రత్యేకంగా సిఎం చంద్రబాబు >>2

# గ'ఘన' విజయం



**జిఎస్ఎల్‌విఎఫ్-17 సూపర్ సక్సెస్**

**కక్షలోకి ఇఒఎస్ 05 ఉపగ్రహం**

**ఈ యేడాదిలో ఆరు ప్రయోగాలు: ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడి**

**ఈ విజయం దేశానికి గర్వకారణం: ప్రధాని నరేంద్రమోడీ**

**సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రి లోకేశ్ అభినందనలు**

**సూళ్లూరుపేట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** గగనతనంలో ఇస్రో మరో ఘన విజయాన్ని సాధించింది. జిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ ద్వారా ఇఒఎస్05 ఉపగ్రహాన్ని నిర్దేశించిన కక్షలోకి ప్రవేశపెట్టి తన సత్తా చాటింది. గత కొంతకాలంగా ఇస్రో చేపడుతున్న ప్రయోగాల్లో ఎదురవుతున్న అవాంతరాలను అధిగమించి అత్యంత ప్రతిష్టాత్మకమైన కీలక ప్రయోగాన్ని సక్సెస్ చేసి ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత దేశ కీర్తి పతాకాను ఎగురువేసింది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలోని రెండవ లాంచ్ ప్యాడ్ నుంచి శుక్రవారం వేకువ జామున పిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ చీకట్లను చీల్చుకుంటూ నిప్పులు చెరుగుతూ నింగికేగిసింది. బుధవారం రాత్రి 11 గంటల 25 నిమిషాలకు ప్రారంభమైన కౌంట్ డౌన్ 27 గంటల 30 నిమిషాల పాటు కొనసాగి, భారత కాలమాన ప్రకారం రెండు గంటల 55 నిమిషాలకు జిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ ఇఒఎస్ 05 భూ పరిశీలన ఉపగ్రహాన్ని జియో సింక్రోనెస్ ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఇస్రో శాస్త్రవేత్తలు నిర్దేశించిన రాకెట్ గమన 19 నిమిషాల సమయాన్ని ఆశించిన రీతిలో పూర్తి చేసింది. 51.70 మీటర్ల పొడవు, 2,367 టన్నుల బరువు గల ఈ రాకెట్ మొదటి దశలో నాలుగు ద్రవ ఇంధన స్ట్రాప్‌న్ బూస్టర్ల సాయంతో నింగికెగిసి 40 టన్నుల ద్రవ ఇంధనంతో మొత్తం 160 టన్నుల ఇంధనంతో పాటు కోర్ అలోన్ దశలో 139 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశను 151.2 సెకండ్లలో పూర్తి చేసింది. 420.5 రాకెట్ శిఖర భాగంలో ఉపగ్రహానికి అమర్చిన హిట్ షీట్స్ మొదటి దశ రెండో >>2




శుక్రవారం సతీష్‌ధావన్ సెంటర్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఇస్రో చైర్మన్ వి నారాయణన్

# విద్యుదుత్పత్తి ఆపండి



**తెలంగాణ ప్రభుత్వానికి కెఆర్ఎంబి ఆదేశం**

● త్రిసభ్య కమిటి భేటీలో కుదరని ఏకాభిప్రాయం ● 66:34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు ఉండాలి: ఎపి ● 50శాతం చొప్పున చెరిసగం పంచాలి: తెలంగాణ ● వాడివేడిగా సమావేశం... నాల్గో వారానికి వాయిదా ● శ్రీశైలం రిజర్వాయర్‌లో తగినంత నీళ్లు లేవు.. పొదుపుగా వాడాలి ● ఇరు రాష్ట్రాలకు బోర్డు సూచన

**హైదరాబాద్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** శ్రీశైలం రిజర్వాయర్‌లో జల విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి తాగునీటికి మాత్రమే వాటిని వినియోగించేందుకు పొదుపు చేయాలని కెఆర్ఎంబి తెలంగాణ ప్రభుత్వంను ఆదేశించింది. కృష్ణా నది యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ శుక్రవారం సమావేశం నీటి పంపకాలపై ఏకాభిప్రాయం కుదరలేదు. సెప్టెంబర్ నాలుగో వారంలో మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సిలు తాగునీటి పంపకాలపై వాడివేడిగా చర్చను సుదీర్ఘంగా జరిపారు. వెలిగొండ, పోతిరెడ్డిపాడు తదితర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జల విద్యుత్ ఉత్పత్తిచేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. తెలంగాణ వెంటనే పోతిరెడ్డిపాడు, నీటి వాటా విషయం తెరపైకి తెచ్చింది. దీనితో ఆంధ్ర, తెలంగాణ అధికారులు వాదోపవాదాలు చేసుకోవడంతో ఏకాభిప్రాయం కుదరలేదు. రెండు రాష్ట్రాలు ఎవరి వాదనలు వారు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది. దీంతో ఈ అంశాలను సెప్టెంబర్ నాలుగో వారంలో నిర్వహించే బోర్డు పూర్తి స్థాయి సమావేశంలో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. తెలంగాణ నుంచి ఇఎన్‌సి రమేష్‌బాబు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇఎన్‌సి నరసింహా మూర్తి హాజరైనారు. తెలంగాణ ప్రభుత్వం అవసరం లేకున్నా కూడా తక్కువగా ఉన్న నీటిని >>2



## గోదావరి కాలుష్యమంతా ఆంధ్రా పేపర్స్‌దే



యథేచ్ఛగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నారు

పుష్కరకాలంగా పన్నులు కట్టడం లేదేంటి?

పన్ను చెల్లించమంటే కోర్టులకెళ్లి కాలయాపన?


తప్పుని సరిదిద్దుకునే అవకాశమిచ్చినా స్పందన లేదు

**ఉప ముఖ్యమంత్రి పవన్ ఆగ్రహం**

తక్షణమే ఆంధ్రా పేపర్స్‌పై చర్యలు తీసుకోండి

కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఆదేశం

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజమండ్రి గోదావరి కాలుష్యంలో సగం ఆంధ్రా పేపర్ లిమిటెడ్‌దే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంచలన ఆరోపణలు చేసారు. ఈ విషయంలో ఆంధ్రా పేపర్ లిమిటెడ్‌దే పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ మేరకు డి.సిఎంఒ పవన్ కల్యాణ్ పేరిట ఒక ప్రకటన విడుదల చేసింది. రాజమహేంద్రవరం ఆంధ్రా పేపర్ లిమిటెడ్ పన్ను ఎగవేతకు దాదాపు పుష్కర కాలం పూర్తి కావస్తోందని డి.సిఎం ఆ ప్రకటనలో పేర్కొన్నారు. 'ఆంధ్రా పేపర్ లిమిటెడ్' వారు యథేచ్ఛగా కాలుష్యాన్ని వెదజల్లు తున్నారు. పన్నులు మాత్రం ఉద్దేశపూర్వకంగా ఎగ్గొడుతున్నారు. 2016తర్వాత కాతేరు గ్రామపంచాయతీకి గానీ, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు గానీ ఒక్క రూపాయి >>2



## ఆ స్థల వివాదం తేల్చండి

గోవా గవర్నర్ భూ వివాదంపై సీరియస్

వారం రోజుల్లో అన్ని వివరాలివ్వండి

అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం

**విజయనగరం, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు స్థలం వివాదంపై విచారణకు కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విజయనగరం మున్సిపల్ పరిధిలోని మహారాజుపేట సౌత్ వార్డులో టౌన్ >>2

ఆధునిక డిజైన్లతో సంస్కృతీ సంప్రదాయాల కళారూపాలు

770 మంది కళాకారులకు శిక్షణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహణ

శిక్షణతో పాటు టూల్ కిట్లు అందజేస్తాం: మంత్రి సవిత

ఆదాయం, ఉపాధే లక్ష్యంగా



## హస్త కళాకారులకు శిక్షణ

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** మారుతున్న అభిరుచులు, హస్త కళలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హస్త కళాకారులకు మెరుగైన జీవనం, ఆర్థిక భరోసా కలిగించేలా చర్యలు చేపట్టాయి. హస్త కళారూపాల తయారీలో మరింత ప్రావీణ్యం పెంపొందించడంతో పాటు ఆధునిక డిజైన్ల తయారీలో శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.35కోట్లను వెచ్చించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళారూపాలను తయారు చేస్తున్న 770మంది హస్త కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టనుంది. ఇందుకోసం శిక్షణా కార్యక్రమాలు ఆయా కళారూపాలను బట్టి నెల, రెండు నెలల పాటు ఇవ్వనున్నారని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన జారీ చేసింది. రాష్ట్రంలో చేతివృత్తులకు అండగా నిలవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేతలకు ఆర్థిక మేలు కలిగించడంతో పాటు చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇప్పుడు హస్త కళాకారులకు కూడా ఆర్థిక భరోసా కలిగేలా ఆయా కళారూపాల తయారీలో మెరుగైన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ >>2

## పుర'పోరు'కు సిద్ధం

వార్డుల పునర్విభజనకు షెడ్యూల్ విడుదల

ఇప్పటి వరకు 11 అభ్యంతరాలు స్వీకరణ

13న డీలిమిటేషన్ వార్డుల ప్రకటన

14న తుది జాబితా గెజిట్‌లో ప్రచురణ

పురపాలక శాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ

2011 జనాభా లెక్కల ఆధారంగానే స్పష్టీకరణ

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజనకు పురపాలక శాఖ షెడ్యూల్ విడుదల చేసింది. నేడే ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలిచ్చింది. ఈనెల 5 నుంచి 11 వరకు అభ్యంతరాలు స్వీకరించి, 13న డీలిమిటేషన్ వార్డులను ప్రకటించి, 14న ఎపి గెజిట్‌లో ప్రచురించనున్నారు. జివిఎంసి, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, కడప, ఏలూరు, అనంతపురం, ఒంగోలు, చిత్తూరు, మచిలీపట్నం కార్పొరేషన్లకు ఆదేశాలందాయి. రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజన ప్రక్రియ ద్వారా జనాభా పెంపుదల ఉంటుంది. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలను పంపాల్సిందిగా కార్పొరేషన్లకు పురపాలకశాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై గురువారం రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు, పిటిషన్లను డిస్మిస్ చేసింది. ఆ తర్వాత పురపాలకశాఖ తన కార్యాచరణను వేగవంతం చేసింది. దీనికి సంబంధించి ప్రతిపాదనలు పంపాల్సిందిగా కార్పొరేషన్లకు పురపాలక శాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతిపాదనలపై రేపటి నుంచి ఈనెల 11 వరకు 7 రోజుల పాటు అభ్యంతరాలు, సూచనల స్వీకరించనున్నట్లు




పురపాలకశాఖ పేర్కొంది. వీటి పరిశీలన తర్వాత మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి వచ్చే తుది ప్రతిపాదనలను ఈనెల 12న పురపాలక శాఖ డైరెక్టరేట్‌కు సమర్పిస్తారు. ఈనెల 13న డీలిమిటేషన్ వార్డుల ప్రకటనకు డైరెక్టర్ పరిశీలన తర్వాత ఆమోదం తెలపనున్నారు. ఈనెల 14న ఎపి గెజిట్‌లో వార్డుల డీలిమిటేషన్ ప్రకటన వెలువడనుంది. 2011జనాభా లెక్కల ఆధారంగా వార్డుల నిర్ణయముంటుంది. ఈమేరకు జీవీఎంసీ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు కార్పొరేషన్లకు పురపాలక శాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం మార్గదర్శకాలను అనుసరించాలని స్పష్టం చేసింది. ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత మున్సిపల్ డైరెక్టరేట్ ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని, హైకోర్టు సూచనలను కూడా ఈ ప్రక్రియలో పాటించాలని వివరించింది.




పోలీస్ స్పోర్ట్స్ అకాడెమీ ఏర్పాటు లోగోను ఆవిష్కరిస్తున్న డిజిపి హరీష్‌కుమార్, ఇతర పోలీసు అధికారులు

## పోలీసు క్రీడలకు ఇక ప్రత్యేక అకాడెమీ

స్పోర్ట్స్ కార్యకలాపాల కోసం విట్‌తో ఎంఒయు

పోలీసు క్రీడా సంబరాల సభలో డిజిపి వెల్లడి

3లో




శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన చిత్రం

# హస్త కళాకారులకు శిక్షణ

>> సహకారం కూడా తీసుకుంటోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ప్రఖ్యాతి గాంచిన హస్త కళారూపాలను తయారీ చేస్తున్న కళాకారులను గుర్తించి మారుతున్న అభిరుచులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని రెండు ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఈ శిక్షణల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ.1,35,16,314లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.1.01 కోటి నిధులు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రంలో ఆయా క్లస్టర్లలో ఉన్న హస్త కళాకారులకు రెండు విధాలుగా శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. గురుశిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ), డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా నెల, రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నామన్నారు. గురుశిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ) రెండు నెలలు, డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) నెల రోజుల పాటు శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ)లోని కొయ్యబొమ్మల తయారీకి కూడా రెండు నెలల పాటు ఇవ్వనున్నామన్నారు.

**200మందికి శిక్షణతోపాటు పనిముట్లు:** డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా చెక్క శిల్పం, టెర్రకోట బొమ్మలు, లేస్/హ్యాండ్‌మేడ్ నిటెడ్ గూడ్స్, అల్లగడ్డ రాతి శిల్పం, శ్రీకాళహస్తి కలంకారి, వెదురుచెరకు కళలు, సవర గిరిజన చిత్రకళ, బొబ్బిలి వీణ, ఇమిటేషన్ జ్యూవెలరీ తదితర కళారూపాల తయారీపై మరో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వారిలో అనంతపురం, పల్నాడు, అనకాపల్లి క్లస్టర్లకు చెందిన 50 మంది చొప్పున 200 మంది అరటి ఫైబర్, చెరకువెదురు, వుడ్ టర్నింగ్, ల్యాకర్‌వేర్, దుర్గిరాతి శిల్ప కళాకారులకు శిక్షణతో పాటు ఇంప్రూవుడ్ టూల్ కిట్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రామ్(ఐటీడీపీ) ద్వారా పనిముట్లు పంపిణీ చేయనున్నామన్నారు. ఈశిక్షణా కార్యక్రమాలు కృష్ణా, గుంటూరు, ఎన్‌టీఆర్, అనకాపల్లి, డా. బీఆర్. అంబేద్కర్ కోనసీమ, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, తూర్పు గోదావరి, నంద్యాల, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనంతపురం, పల్నాడు తదితర జిల్లాల్లోని కళాకారులకు ఉపయోగపడనున్నాయని మంత్రి తెలిపారు.

**కళాకారుల ఆదాయం పెంపే లక్ష్యం:** ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు, కళాకారుల ఆదాయాన్ని పెంచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

# నేడు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. శనివారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలతో సిఎం చంద్రబాబు ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో భేటీ కానున్నారు. పిఆర్సీ కమిషన్ ఏర్పాటుతో పాటు పిఆర్సీ, డిఎ బకాయిలు తదితర సమస్యలపై చర్చించనున్నారు. గురువారం జెఎసి నేతలు ఎ.విద్యాసాగర్, డివి రమణ, భారతీ ప్రసాద్ తదితరులు సిఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ఆందోళనలకు సంబంధించిన అంశాలను విద్యాసాగర్ వివరించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రిని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని సిఎం ఈ సందర్భంగా వారికి చెప్పారు. పరిష్కారంపై చర్చిస్తున్నా.. ఎందుకు తొందర పడుతున్నారని చంద్రబాబు జెఎసి నేతలను ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఉద్యోగులకు న్యాయంగా చేయాల్సిన వాటిని ఒక్కొక్కటిగా చేస్తున్నామని చెప్పినట్టు సమాచారం. చర్చలు జరుపుతున్నా ఓర్పు పట్టలేకపోవటాన్ని ప్రశ్నించినట్టు తెలిసింది. తాము కూడా చర్చలను ఆహ్వానిస్తున్నామని జెఎసి నాయకులు చెప్పారు. ముఖ్యమంత్రి స్థాయిలో చర్చలు జరగాలని కోరుకుంటున్నామన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో వైభవంగా వరలక్ష్మి వ్రతాలు

## కనులపండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం నాడు సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. రెండు విడతలుగా ఆర్జిత సేవ మరియు ఉచిత వ్రతాల నిర్వహణ జరిగాయి. 600 మందికి పైగా మహిళలకు ఉచిత అవకాశంపూజా సామగ్రి, తీర్థప్రసాదాలు దేవస్థానం వారు అందించారు. ఉచిత దర్శన ఏర్పాట్లపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జున మహా మండపంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మి వ్రతాల్ను అత్యంత వైభవంగాజరిగాయి. ఆలయ వేద పండితులు, అర్చకుల మంత్రోచ్చారణల నడుమ ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు మొదటి విడత ఆర్జిత సేవ రూపంలో, అనంతరం ఉదయం 10 గంటల నుండి 11:30 గంటల వరకు రెండవ విడత ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించబడ్డాయి. వ్రతంలో పాల్గొన్న ప్రతి ఒక్క మహిళకు అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే ఉచితంగా సమకూర్చింది. వ్రతం ముగిసిన అనంతరం పసుపుకుంకుమలు, రవికె వస్త్రం, గాజులు, శ్రీ అమ్మవారి ప్రసాదాలను అందజేయడంతో పాటు ప్రత్యేక క్యూ లైన్ ద్వారా శ్రీ దుర్గమ్మ ఉచిత దర్శన భాగ్యాన్ని కల్పించారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ సతీమణి అంజలి సామాన్య మహిళలతో కలిసి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. అనంతరం ఇఓ వి.కె. శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మహామండపంలో నెలకొని వున్న వరలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో శ్రీ వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ ధనిక, పేద అనే తేడా లేకుండా భక్తులందరికీ అమ్మవారి దివ్య సేవలో భాగస్వామ్యం కల్పించాలనే సమున్నత లక్ష్యంతో మొదటి విడత ఆర్జిత సేవగా, రెండో విడతలో 600 మందికి పైగా మహిళలకు ఉచితంగా సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించామని తెలిపారు. సనాతన ధర్మ పరిరక్షణకు, హిందూ ధర్మ ప్రచారానికి, భారతీయ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ఇటువంటి సామూహిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయి"అని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానాచార్య వి శివ ప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు వి.శ్రీధర్ శర్మ, ఫెస్టివల్ సహాయ కార్యనిర్వహణాధికారి డాక్టర్ కె. గంగాధర్, పర్యవేక్షకులు హేమ దుర్గాంబ , సీనియర్ అసిస్టెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

**దుర్గమ్మకు స్వర్ణాభరణాలు:** శ్రీ కనకదుర్గమ్మ వారికి స్వర్ణాభరణాలను విజయవాడకి చెందిన భక్తురాలు గుంటుపల్లి శ్రీ ప్రణవి శుక్రవారం శ్రీ అమ్మవారి మూలవిరాట్ అలంకరణ నిమిత్తం సుమారు 22.800 గ్రాముల బంగారు ఆభరణాలను చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందజేశారు. బంగారు బొట్టు (నవరత్నాలు, డైమండ్స్ పొదిగినది), బంగారు నత్తు (డైమండ్స్, ఎరుపు పచ్చ రాళ్లు పొదిగినది), బంగారు బు లాకి (డైమండ్స్, ఎరుపు పచ్చ రాళ్లు, ముత్యం పొదిగినది). అనంతరం దాతకు శ్రీ అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలు మరియు శేషవస్త్రాలను బహుకరించారు.

**ఇంద్రకీలాద్రిపై ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు:** దుర్గమ్మవారి ఆలయంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఆశీర్వచన మండపంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చిన్న రాజగోపురం వద్ద శాస్త్రోక్తంగా గోపూజను ఇఓ వికె శీనా నాయక్ నిర్వహించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు, అర్చకుల మంత్రోచ్చారణల నడుమ శ్రీకృష్ణ భగవానునికి విశేష పూజలు,పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ స్థానాచార్యులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు బి. శంకర శాండిల్య, డిఇ. కిషోర్ కుమార్, ఏఇఒలు ఎన్. రమేష్ బాబు, డా కె. గంగాధర్ పాలకమండలి సభ్యులు పి.రాఘవరావు, ఎ శ్రీనివాసరావు, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర బాబు, తదితరులు పాల్గొన్నారు.



# నిశ్శబ్ద కల్లోలం

>> భారతదేశ జనాభాలో దాదాపు 80శాతానికి పైగా ప్రజలు విపరీతమైన ఎండలు, అనూహ్య వరదలు, కరువులు, తుఫానుల వంటి వాతావరణ ఆధారిత విపత్తులు పొంచి ఉన్న జిల్లాల్లోనే నివసిస్తున్నారు. 2026 నాటి తాజా పరిశోధనల ప్రకారం, 1981 నుంచి 2020 మధ్యకాలంలో భారతదేశ సగటు వేసవి గరిష్ఠ ఉష్ణోగ్రత సుమారు ఒక డిగ్రీ సెంటిగ్రేడ్ మేర పెరిగింది. హీట్‌వేవ్‌ల సంఖ్య, వాటి తీవ్రత, అవి కొనసాగే సమయం విపరీతంగా పెరిగిపోయాయి. మానవ శరీరం తనంతట తానుగా చల్లబరుచుకోలేని అత్యంత ప్రమాదకరమైన ఉక్కపోత పరిస్థితి ఇప్పుడు దేశమంతటా వ్యాపిస్తోందని మరో నివేదిక వెల్లడించింది. ఇది కేవలం ఎండకాలానికే పరిమితం కాకుండా, వర్షాకాలంలోనూ మానవ సామర్థ్యాన్ని, ఆరోగ్యాన్ని నిర్దాక్షి ణ్యంగా దెబ్బ తీస్తోంది. ఉష్ణోగ్రత పెరుగుదల నేరుగా ఆహార, నీటి భద్రతలను తీవ్ర సంక్షోభంలోకి నెడుతోంది. గ్రీన్‌హౌస్ ఉద్గారాల పెరుగుదల కారణంగా సంభ వించే వాతావరణ మార్పులు ఎల్‌నినో ప్రభావాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయని ఇటీవలి పరిశోధనలు స్పష్టం చేశాయి. ఎల్ నినో ప్రభావం భారత రుతుపవనాలపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చి వర్షపాతాన్ని అస్తవ్యస్తం చేయడం ద్వారా కరువు ముప్పును మరింత పెంచుతోంది. మరోవైపు దేశ జీవనదులైన సింధు, గంగా, బ్రహ్మపుత్ర వంటి నదుల మనుగడ హిందూకుష్ హిమాలయాలపై ఆధారపడి ఉంది.

అయితే, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటైన్ డెవలప్‌మెంట్ 2026 ప్రారంభంలో విడుదల చేసిన డేటా అత్యంత భయానకమైన వాస్తవాన్ని వెల్లడించింది. 2000 సంవత్సరం నుండి ఇప్పటివరకు హిమాలయ ప్రాంతంలో హిమానీనదాలు కరిగిపోయే వేగం రెట్టింపు అయింది. ఈ ఆకస్మిక కరుగుదల నదీ లోయల్లో ఆకస్మిక వరదలకు, కొండచరియలు విరిగిపడటానికి దారితీయడమే కాక, భవిష్యత్తులో కోట్ల మంది ప్రజలను తీవ్రనీటి ఎద్దడిలోకి నెట్టే ప్రమాదం ఉంది. ఈ విపత్తుల వెనుక అభివృద్ధి చెందిన దేశాల అన్యాయం స్పష్టంగా దాగి ఉంది. ఇటీవల పొరుగు దేశమైన నేపాల్‌లో వాతావరణ విలయాల కారణంగా వెయ్యిమందికి పైగా అమా యకులు ప్రాణాలు కోల్పోవడమే దీనికి నిదర్శనం. ప్రపంచ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలలో నేపాల్ వంటి దేశాల పాత్ర నామమాత్రమే. కానీ, అభివృద్ధి చెందిన సంపన్న దేశాలు దశాబ్దాలుగా సాగించిన పారిశ్రామిక విధ్వంసానికి మూల్యం మాత్రం ఏ పాపం ఎరుగని గ్లోబల్ సౌత్ దేశాలే చెల్లించాల్సి వస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు ఉద్గారాల తగ్గించడంతో పాటు నష్టపరిహారం, వాతావరణ ఆర్థిక సహాయం తప్పనిసరిగా చేయాలని బ్రెజిల్‌లో జరిగిన సిఒపి 30 సదస్సులో భారత్ డిమాండ్ చేసింది.

ఈ నేపథ్యంలో, ఈ యేడాది నవంబర్‌లో టర్కీలో జరగనున్న సిఒపి31 సదస్సు కీలకంగా మారింది. ప్రకృతి విసురుతున్న ఈ సవాలును తీరిగ్గా కూర్చుని సరిదిద్దుకునేంత సమయం లేదు. ఒకటిన్నర డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగితేనే, ఈస్థాయిలో ప్రభావం ఉంటుందని అర్థమైనప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన సమయం ఆసన్న మైంది. ఉష్ణోగ్రత పెరుగుదలలో నివారించగలిగే ప్రతి చిన్న అంకె కూడా భవిష్యత్తులో వేలాది ప్రాణాలను, కోట్ల ఎకరాల పంటలను,

# గోదావరి కాలుష్యమంతా ఆంధ్రా పేపర్స్‌దే

>> పన్ను కూడా చెల్లించలేదన్న విషయం మీకు గుర్తుందా? ప్రభుత్వంతో సంబంధం లేకుండా మీకు మీరే పన్ను మినహాయింపు ఇచ్చేసుకున్నారా? ఇది ఎలా సాధ్యం? రూ.21.34 కోట్ల వరకు మీరు స్థానిక సంస్థలకు పన్నులు చెల్లించాల్సి ఉంది. పన్ను చెల్లించమని నోటీసులు ఇచ్చిన ప్రతిసారీ కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేస్తూ మీ బాధ్యత నుంచి తప్పించుకు తిరుగుతున్నారు" అని మండిపడ్డారు. "రాజమహేంద్రవరం నగర కాలుష్యంలో సగం ఆంధ్రా పేపర్స్ లిమిటెడ్ నుంచే వస్తుందని అధికారిక గణాంకాలు సైతం చెబుతున్నాయి. రాజమహేంద్రవరం నగరం మొత్తం దాదాపు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటే, అందులో సుమారు 35 మిలియన్ లీటర్లు మీరు ఉత్పత్తి చేస్తున్నారు. మీరు విడుదల చేస్తున్న వ్యర్థాల్లో పరిమితికి మించి కాలుష్య కారకాలు ఉన్నట్టు నిర్ధారణ కూడా అయ్యింది. మీరు వ్యర్థాలు విడుదల చేసే లగూన్స్ దగ్గర సేకరించిన నమూనాలను పరీక్షించగా, లీటర్ నీటికి 36 మిల్లీగ్రాముల బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బిఒడి) ఉంది. ఇది నిర్ణీత ప్రమాణాల కంటే 20 శాతం అధికం. ఫాస్ఫేట్ 5.3 మిల్లీగ్రాములు 6 శాతం అధికంగా ఉంది. సల్ఫైడ్స్ 3.4 మిల్లీగ్రాములు ఉన్నాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాలతో పోలిస్తే.. ఇది 70 శాతం అధికం. మీరు విడుదల చేసే కాలుష్యం కారణంగా నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గి జలచరాల మనుగడకు ఇబ్బంది కలుగుతుంది. గోదావరి నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోంది. దుర్గంధాలు వెదజల్లుతూ, నీటి నాణ్యత తగ్గి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ, భవిష్యత్ మానవాళి మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తోంది" అని డి.సిఎం పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. "భూగర్భ జలాలు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి పర్యటనలో పలు సూచనలు చేశాను. వాటిని కూడా మీరు పాటించలేదు.

మీ ఉల్లంఘనలకు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు లోబడి కఠిన చర్యలు తీసుకోవచ్చు. పరిశ్రమలో కార్యకలాపాలు నిలుపుదల చేయొచ్చు. పెనాల్టీలు విధించవచ్చు. కంపెనీని సీజ్ చేయొచ్చు. ఏకంగా లైసెన్స్ రద్దు చేయొచ్చు. అయినప్పటికీ పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ముందస్తు హెచ్చరికగా షోకాజ్ నోటీసులు ఇచ్చి.. తప్పుని సరిదిద్దుకునే అవకాశం ఇచ్చింది. గడచిన మూడు నెలల కాలంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మీ ప్రతినిధులతో పలు మార్లు చర్చించి, పరిష్కార మార్గాలు సూచించారు. అయితే మీ నుంచి స్పందన పూర్తిగా కొరవడింది" అని డి.సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తక్షణం ఆంధ్రా పేపర్స్ లిమిటెడ్‌కి సమన్స్ జారీ చేసి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్, అదనపు అడ్వకేట్ జనరల్‌తో పాటు ప్రభుత్వ న్యాయవాదులు, స్టాండింగ్ కౌన్సిళ్లు ఇటువంటి ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. "స్వచ్ఛ గోదావరి- పవిత్ర పుష్కరాలు" థీమ్‌తో మన గోదావరి నదిని కాలుష్యం నుంచి కాపాడేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణ వేత్తలు, పౌర సమాజం నుంచి మద్దతు కోరుతున్నామని పేర్కొన్నారు.ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతాంశంగా ముందుకు తీసుకువెళ్తుందని తెలిపారు.

# విద్యుదుత్పత్తి ఆపండి



శుక్రవారం కెఆర్ఎంబి సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న నరసింహ మూర్తి

>> విద్యుత్ ఉత్పత్తికి వాడటం తగదని ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సి నరసింహామూర్తి అభ్యంతరం వ్యక్తంచేశారు. తెలంగాణ ఇఎన్‌సి రమేష్‌బాబు మాట్లాడుతూ పోతిరెడ్డి పాడునుంచి ఆంధ్రప్రదేశ్ నిబంధనలకు విరుద్ధంగా నీటిని బేసిన్ దాటి పోయేలా తరలిస్తోందని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఉందని ఉన్న నీటిని 50శాతంచొప్పున చెరిసగం పంచుకోవాలని తెలంగాణ ఇఎన్‌సి రమేష్‌బాబు కెఆర్ఎంబి ముందు ప్రతిపాదన పెట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం తరుపున నరసింహామూర్తి మాట్లాడుతూ 66;34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు ఉండాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కృష్ణా నదిలోని రిజర్వాయర్లలో 142 టిఎంసిలు ఉన్నాయని ఇఎన్‌సి రమేష్ బాబు వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సిమాత్రం ఖరాఖండిగా 66:34శాతం వాటా ప్రకారం 97 టిఎంసిలు విడదల చేయాలని కోరారు.

సభ్యుడు నరసింహామూర్తి మాట్లాడుతూ త్రిసభ్య కమిటీ సమావేశం ఏకాభిప్రాయం కుదరక అసంతప్తితో ముగిసిందని వ్యాఖ్యానించారు. కృష్ణా నదిలో లభ్యమయేయ్య నీరు 66:34 నిష్పత్తిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు నీటి విడుదల ఉత్తర్వులు ఇవ్వాలని కోరామని తెలిపారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో ఇవ్వాలని తెలంగాణ కోరిందని, వచ్చే ఆగస్టు వరకు 104 టిఎంసిలు కావాలని కోరామని వివరించారు. తెలంగాణ 200 టిఎంసిలు కావాలని కోరిందని, ఆ ప్రతిపాదన సహేతుకం కాదని చెప్పామని అన్నారు. తెలంగాణ అవసరం లేకున్నా శ్రీశైలం వద్ద విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని సమావేశంలో ఆరోపించామన్నారు. తమ వాటా నుంచే పోతిరెడ్డి పాడు, వెలిగొండ ద్వారా నీరు తీసుకుంటున్నామని, ఎవరి వాటా అడగడం లేదని తెలిపారు. రాయలసీమతో పాటు మార్కాపురం, పల్నాడు, ఇతర జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం నీరు ఇవ్వాల్సి ఉందని ఆయన అన్నారు.

తెలంగాణ ఇఎన్‌సి రమేష్‌బాబు మాట్లాడుతూ పోతిరెడ్డితోపాటు వెలిగొండ నుంచి కూడా నీటిని తీసుకొని పోతున్నారని మొత్తం తెలంగాణకు 200 టిఎంసిలు, ఎపికి 100 టిఎంసిలు ఇవ్వాలని కోరారు. ఇదిఇలా ఉంటే విద్యుత్ ఉత్పత్తికి కృష్ణా నదినీటిని వాడొద్దని కెఆర్ఎంబి తెలిపింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లోని 11వ షెడ్యూల్ లో 2, 3 పేరాలను అనుసరించి నీటి వినియోగం ఉండాలనీ తెలంగాణను కెఆర్ఎంబి ఆదేశించింది. సాగు నీరు, త్రాగునీరు, విద్యుత్ ఉత్పత్తి వంటి ప్రాధాన్యత అంశాలు విపత్తు పరిస్థితులు వస్తే, త్రాగు నీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలనీ కెఆర్ఎంబి తెలిపింది. తెలంగాణా రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తికి నీటిని వినియోగించడం వెంటనే నిలిపి వేయాలని కెఆర్ఎంబి హెచ్చరించింది. త్రాగు నీటి అవసరాలకే తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నీటిని వినియోగించాలి. తెలంగాణా రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తికి శ్రీశైలం నీటిని వినియోగించడం పై అభ్యంతరం వ్యక్తం చేసింది.



కేరళలో మాతా అమృతానందమయి దేవి ఆశీస్సులు అందుకుంటున్న మంత్రి నారా లోకేశ్

# అమృతపురి ఆశ్రమంలో మంత్రి లోకేశ్

## మాతా అమృతానందమయి దేవితో భేటీ

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** కేరళం రాష్ట్రం కొల్లం జిల్లాలోని ప్రసిద్ధ అమృతపురి ఆశ్రమాన్ని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం సందర్శించారు. ముందుగా అమృతపురి ఆశ్రమానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలోని కాళీ దేవాలయాన్ని, కలరిని మంత్రి సందర్శించారు. అనంతరం మాతా అమృతానందమయి దేవితో మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మాతా అమృతానందమయి దేవి ఆశీస్సులు పొందారు. ఆధ్యాత్మిక, తాత్వికరంగాల్లో మంత్రి ఆసక్తి కలిగి ఉండటం పట్ల అమృతానందమయి దేవి సంతోషం వ్యక్తం చేసారు. విశ్వవిద్యాలయాల వ్యవస్థాపన, నిర్వహణ విషయంలో ఆయన అందిస్తున్న సహకారానికి మంత్రిని అభ్యర్థించారు. అమరావతి అంతర్జాతీయంగా ఖ్యాతిని పొందుతుందని తెలిపారు. అనంతరం అమృత విశ్వవిద్యాపీఠం క్యాంపస్‌ను, అమృత ఆయుర్వేద కళాశాలను మంత్రి సందర్శించారు. దాదాపు మూడు గంటలపాటు ఆశ్రమంలో గడిపారు.

# గ'ఘన'విజయం

>>దశకు మధ్యలోనే శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం విడిపోయాయి. 40 టన్నుల ద్రవైందన సహాయంతో రెండో దశను 293.08సెకండ్లలో అధికమించింది. స్వదేశీ సాంకేతికతో రూపొందించిన 15 టన్నుల క్రయోజనిక్ సహాయంతో 1106.60 సెకండ్లలో మూడవ దశను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఇస్రో శాస్త్రవేత్తలు నిర్దేశించిన 19 నిమిషాల గమన సమయంలో 28934 ఎత్తులోనీ జియో ట్రాన్స్ ఫర్ ఆర్బిట్‌లోకి చేరుకుంది.అనంతరం భూభాగంలోని మాస్టర్ కంట్రోల్ సెంటర్ల వారు ఉపగ్రహాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని 36,000కిలోమీటర్ల ఎత్తులోని కక్షలోకి ప్రవేశపెట్టిన ప్రవేశపెట్టారు. కక్షలోకిచేరిన ఇఒఎస్ 05ఉపగ్రహం మాస్టర్ కంట్రోల్ సెంటర్‌కు సంకేతాలు ఇవ్వడం ప్రారంభించింది.

**ఈ యేడాదిలో ఆరు ప్రయోగాలు:** జీఎస్ఎల్వి ఎఫ్ 17 విజయం చారిత్రాత్మకమైనదని, ఈ విజయంలో ఇస్రోలోని ప్రతి ఒక్కరి సమిష్టి కృషి ఉందని ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ అన్నారు. ప్రయోగ విజయానంతరం శ్రీహరికోటలోని మీడియా సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. పిఎస్ఎల్వీ ఎఫ్ 17 రాకెట్ ద్వారా భారతదేశానికి అత్యంత ఉపయోగకరమైన ఇఒఎస్ 05 రాకెట్‌ను నిర్దేశించిన కక్షలోకి పంప గలిగామన్నారు. జీఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ ప్రథమంగా అధిక బరువు గల ఉపగ్రహాన్ని గగనతలంలోకి తీసుకువెళ్లిందని తెలిపారు. 36 వేల కిలోమీటర్ల ఎత్తులో ఈ ఉపగ్రహం చేరుకొని పనిచేయడం ప్రారంభించిందని, ఇస్రో ఆధ్వర్యంలో ఇంత ఎత్తులో ప్రవేశ పెట్టడం ప్రథమమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రథమ ప్రయోగం విజయవంతం అయిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అలాగే ప్రైవేటు సెక్టార్‌కు సంబంధించి విక్రమ్ వన్ రాకెట్ విజయం సాధించిందని తెలిపారు. ఎనిమిది నెలల విరామం తర్వాత ఇస్రోకు మంచి రోజులు వచ్చాయని, ఇదే విజయ పరంపరను కొనసాగించేందుకు ఇస్రో శాస్త్రవేత్తల బృందం నిరంతరం శ్రమిస్తామని నారాయణన్ తెలిపారు. ఈ యేడాదిలో మరో ఆరు ప్రయోగాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. ఇందులో గగన్‌యాన్ సంబంధించి మానవ రహిత ఉపగ్రహం ప్రయోగం, ఎన్‌వి ఎస్03 నావిగేషన్ శాటిలైట్ ప్రయోగం ఉంటాయని ఇస్రో చైర్మన్ తెలిపారు. ఈప్రయోగ విజయం ఇస్రో కుటుంబానికి స్ఫూర్తినిచ్చిందని ఆయన చెప్పారు. తమిళనాడులోని కులశేఖర పట్టణంలోని లాంచ్ ప్యాడ్‌లో ఇస్రో, ప్రైవేట్ సంస్థలకు చెందిన రాకెట్ ప్రయోగాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. శ్రీహరికోటలో మూడవ లాంచ్ ప్యాడ్ నిర్మాణం కీలక దశలో ఉందని నారాయణన్ తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తల బృందంతో కలిసి పిఎస్ఎల్వీ ఎఫ్ 17 రాకెట్ నమూనాను చేత పట్టుకొని విజయోత్సవం జరుపుకున్నారు. ఈ సమావేశంలో షార్ డైరెక్టర్ ముత్తు చెళియన్, ఐపిఆర్‌సి డైరెక్టర్ నారాయణ అప్పు, ఇస్రాక్ డైరెక్టర్ ఎంఆర్ రాఘవేంద్ర, మాస్టర్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్ పంకజ్ దామోదర్ కిల్‌డార్, విఎస్ఎస్‌సి డైరెక్టర్ డాక్టర్ రాజీవ్, యుఆర్ ఎస్సీ డైరెక్టర్ దినేష్ కుమార్ సింగ్, మిషన్ డైరెక్టర్ థామస్ కురియన్, డాక్టర్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 10, 11 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

>> చర్చించనున్నారు. సూపర్ సిక్స్, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించనున్నారు. ఆరోగ్యం, విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్లతో సిఎం చంద్రబాబు చర్చించనున్నారు. పెట్టుబడులు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడనున్నారు. జలధార కార్యక్రమం పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ల ఉత్తమ ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రదర్శన, వివరణ ఇవ్వనున్నారు. రెండో రోజు ఈగవర్నెన్స్, ఆర్టీజీఎస్. పిజిఆర్ఎస్ పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. భూ పరిపాలన, కేంద్ర పథకాల నిధుల వినియోగంపై చర్చించనున్నారు. జిల్లా కలెక్టర్లతో ఓపెన్ ఫోరంలో క్షేత్రస్థాయి సమస్యలపై మాట్లాడనున్నారు. చివరి రోజు శాంతిభద్రతల సమీక్షతో పాటు ముగింపు ప్రసంగాన్ని సిఎం చంద్రబాబు చేయనున్నారు.

# ఆ స్థల వివాదం తేల్చండి

>> సర్వేనెంబర్ 569లో 4 ఎకరాల 74 సెంట్లలో ఎకరాస్థలంలో వైసిపి కార్యాలయాన్ని నిర్మించింది. ఈ వ్యవహారాన్ని అశోక్ గజపతి రాజు వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తన స్థలంలో అక్రమంగా వైసిపి కార్యాలయ నిర్మాణం చేపట్టారంటూ గతఏడాది విజయ నగరం కలెక్టర్‌కు ఆధారాలు సమర్పించారు.సదరు ఆధారాలను పరిశీలించిన కూటమి ప్రభు త్వం విచారణకుఆదేశించింది.అప్పటి ఎమ్మార్వో ప్రభాకర్‌రావుపై విచారణకు ఆదేశాలు జారీ చేసింది. వారం రోజులలోపు ఆ వివరాలు అన్నీ ఇవ్వాలని జిల్లాఉన్నతాధికారులనుప్రభుత్వం ఆదేశించింది.

## నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం

**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా 173 మందిని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా విద్యాశాఖ గుర్తించి జాబితాను విడుదల చేసింది.వీరందరికి ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వీరికి అవార్డులు ప్రదానం చేయనుంది. విజయవాడలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వీరికి అవార్డులు అందజేస్తారు. పాఠశాల విద్యలో 79 మంది, ఇంటర్ విద్యలో 24మంది, సాంకేతిక విద్యలో 14 మంది, ఉన్నత విద్యలో 56 మందిని ఉత్తమ టీచర్లుగా ప్రభుత్వంఎంపికచేసింది. వీరికి ప్రశంసా పత్రం, రూ.20 వేల నగదు బహుమతి అందజేస్తారు.

## వారం - వర్జ్యం

05-09-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి.నవమి రా.9.53,న.మృగశిర రా.9.30
వ.తె.5.20 - ఉ.6.49
దు.తె.5.54 - ఉ.7.32
రాహు.ఉ.9.00-ఉ.10.30
శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** ఇంటా బయటా ఎదురైన ఒత్తిడులు తొలగుతాయి. గృహనిర్మాణ ఆలోచనల్లో తొందరపాటు వద్దు.అదనపు బాధ్యతలు.

**వృషభం :** నూతన పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక ప్రగతి సాధిస్తారు. వివాహానికి అనుకూలమైన కాలం.

**మిథునం :** వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. జీవితభాగస్వామినుండి వస్తు, వస్త్రలాభాలు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం.

**కర్కాటకం :** ఋణాలు కొంతవరకు తీరుస్తారు. వ్యాపారాలలో స్వల్పలాభాలు పొందుతారు.

**సింహం :** నూతన ఉత్సాహంతో కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. సంఘంలో ఆదరణ పెరుగుతుంది.

**కన్య :** ఆర్థిక ఇబ్బందులు అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది. శ్రమ ఫలిస్తుంది.

**తుల :** సోదరుల నుండి ఆస్తి, లాభం పొందుతారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**వృశ్చికం:** భూ వివాదాలు పరిష్కరించుకొంటారు. మానసిక ప్రశాంతత పొందుతారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**ధనుస్సు :** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. మీలోని ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

**మకరం :** వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు. కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**కుంభం :** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుతుంది.ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**మీనం :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలకువ చాలా అవసరం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# చెరువులకు కొత్త కళ



## సాగునీటి సంరక్షణ.. పర్యావరణ పరిరక్షణ లక్ష్యం

- రూ.50 కోట్లతో 105 చెరువుల ఆధునీకరణ
- 26 చెరువులకు పునరుజ్జీవం. భూగర్భ జలాల పెంపు
- ఆధునిక హంగులతో ఆహ్లాదకర కేంద్రాలుగా చెరువులు
- వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ ఎయిర్ జిమ్‌లు, పార్కులతో కొత్త రూపు

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** సాగునీటి వనరుల సంరక్షణ నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల వరకు సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక కృషి చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉప ముఖ్యమంత్రి చొరవకు 'ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన' పథకం తోడవడంతో రాష్ట్ర వ్యాప్తంగా మంచినీటి చెరువులు, సరస్సుల పునరుజ్జీవనానికి కొత్త ఊపు వచ్చింది. పవన్ కల్యాణ్ దార్శనికత, అభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతతో చెరువులకు కొత్త జీవం పోయడమే కాకుండా, వాటిని మరింత సమర్థవంతమైన సాగునీటి వనరులుగా తీర్చిదిద్దే దిశగా విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. చెరువుల ఆధునీకరణ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటం, సాగునీటి సామర్థ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన, ఆహ్లాదకరమైన జీవన వాతావరణాన్ని అందించాలన్న సమగ్ర లక్ష్యంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయి.

### 105 చెరువులు... రూ.50 కోట్ల అంచనా వ్యయంతో పనులు

రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం మొత్తం రూ.50 కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 26 చెరువులను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. అనంతపురం, పల్నాడు, శ్రీసత్యసాయి, చిత్తూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో ఇప్పటికే చెరువుల అభివృద్ధి పూర్తయ్యి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో శరవేగంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చెరువుల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమం పూర్తయితే చెరువుల నీటి నిల్వ సామర్థం పెరగడంతోపాటు సాగు నీటి వనరులు మరింత బలోపేతం కానున్నాయి. అలాగే భూగర్భ జలాల వృద్ధికి తోడ్పడనున్నాయి.

### చెరువులకు కొత్త రూపు.. ప్రజలకు కొత్త సౌకర్యాలు

చెరువుల ఆధునీకరణ ప్రక్రియలో భాగంగా చెరువు గట్ల బలోపేతం, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, ప్రవేశ ద్వారాల నిర్మాణం, సోలార్ లైట్ల ఏర్పాటు, సిట్టింగ్ బెంచ్‌ల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కుల ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ ఎయిర్ జిమ్ పరికరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు చెరువుల సుందరీకరణ పనులకు ప్రాధాన్యం ఇస్తూ, వాటిని ప్రజల విశ్రాంతి, ఆరోగ్యం, వినోదానికి అనువైన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గం పరిధిలోని వెదుళ్ల చెరువు, కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని పండూరు చెరువు, గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు, అనంతపురం జిల్లాలో గుడిశెలపల్లి చెరువు, నెల్లూరు జిల్లాలోని వింజమూరు, శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం తదితర చెరువులు పూర్తి స్థాయి అభివృద్ధి పనులు పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

### సాగు నీటితోపాటు భూగర్భ జలాలకు బలం

ఈ పనుల ద్వారా చెరువులు కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే పరిమితం కాకుండా బహుళ ప్రయోజన కేంద్రాలుగా రూపుదిద్దుకోనున్నాయి. చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల సాగునీటి వనరులు బలోపేతం కావడంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో రైతులకు సాగునీటి పరంగా ప్రయోజనం చేకూరడంతో పాటు గ్రామీణ ప్రజలకు దీర్ఘకాలికంగా మెరుగైన ఫలితాలు అందనున్నాయి. పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ కార్యక్రమం దోహదపడనుంది.

### నాణ్యతపై పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి

అభివృద్ధి పనుల వేగంతో పాటు వాటి నాణ్యతపై కూడా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, ప్రతి పని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సాగుతున్నాయో లేదో పరిశీలిస్తున్నారు. పనులను సెప్టెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి పనుల్లో వేగం, నాణ్యత రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రంలో అమలుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సాగు నీరు, పర్యావరణం, గ్రామీణ మౌలిక సదుపాయాలు, ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు వంటి అన్ని అంశాలను సమన్వయం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దార్శనికత ఈ చెరువుల ఆధునీకరణ కార్యక్రమంలో ప్రతిబింబిస్తోంది.




చెరువుకట్టపై పిల్లల పార్కు, జిమ్

ప్రజల తలసరి ఆదాయం పెరిగితే

# పేదల సంపద వృద్ధి

## అన్నిరంగాల్లో రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వానికి కీలకం: సిఎం చంద్రబాబు



**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజల తలసరి ఆదాయం పెరిగితే పేదల సంపద దానంతటదే వృద్ధి చెందుతుందని సిఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. రాష్ట్రంలో ప్రజల ప్రస్తుతం తలసరి ఆదాయం రూ.3 లక్షలుగా ఉందని, 2047 నాటికి దానిని రూ.54 లక్షలకు చేర్చడమే లక్ష్యమని వివరించారు. ఆ దిశలోనే ప్రభుత్వం కార్యచరణను ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తుందన్నారు. సిఎం చంద్రబాబు తన అధికారిక 'ఎక్స్' ఖాతాల్లో పలు అంశాలు వెల్లడించారు. సంపద వృద్ధి చెందాలంటే ఆదాయం వృద్ధి కావాలన్నారు. ఇందుకు తగినట్లు ప్రభుత్వవిధానం ఉందన్నారు.ప్రజలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు పిపిపి విధానాన్ని అమలులోకి తీసుకుని వచ్చామన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు. భవిష్యత్తు అంతా పర్యాటక రంగానిదేనని, ఆ రంగాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై ప్రజావసరాలను విస్మరించిందన్నారు. బటన్లు నొక్కి రోడ్లకు గుంతలు పెట్టారన్నారు. రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని చంద్రబాబు స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తపన, అనుభవంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిలో దూసుకెళ్తోందని సిఎం అన్నారు. 45యేళ్లుగా వెనుకబడిన వర్గాలు టిడిపికి అండగా నిలుస్తున్నాయని గుర్తు చేశారు. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గౌడ కులస్తులకు మద్యం షాపులు కేటాయిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి మరింత వేగంగా జరగాలంటే ప్రజలు తమ సలహాలు, సూచనలు అందించాలని ముఖ్యమంత్రి కోరారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించానని, దానికి రూ.4 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రేపు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్తున్నామని, కొండలు, గుట్టలు తొలిచి మరీ నీటిని తరలిస్తామన్నారు. నదుల అనుసంధానంతో భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఏమాత్రం రావని భరోసా ఇచ్చారు. వైఎస్సార్సీపీ పాలనలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని, కానీ కూటమి ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా పెంచలేదని స్పష్టం చేశారు. తాము ఏ మంచి పని చేసినా వైఎస్సార్సీపీ అడ్డుపడుతోందని మండిపడ్డారు. సూపర్ సిక్స్‌లో భాగంగా మెగా డిఎస్సీ వేస్తుంటే దాన్ని అడ్డుకునేందుకు కోర్టులో ఏకంగా 350 కేసులు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, మీ పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫొటో అవసరం లేదని తేల్చి చెప్పారు. ఆడబిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా ఇబ్బంది పడకూడదని ఉచిత బస్సు ప్రయాణం తీసుకువచ్చామని సీఎం చెప్పారు. రాబోయే రోజుల్లో ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్నారు. మహిళలకు కష్టం రాకూడదనే ఉద్దేశంతో దీపంపథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని 33శాతం రిజర్వేషన్లు తెచ్చామన్నారు. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తానే తీసుకువచ్చానని, త్వరలో మహిళా డ్రైవర్లను కూడా ప్రోత్సహిస్తామని ప్రకటించారు. 'సంజీవని' యాప్ ఓ గేమ్ ఛేంజర్ అని సిఎం చంద్రబాబు అన్నారు. గిరిజన ప్రాంత ప్రజలకు అనారోగ్యం వస్తే విశాఖ, పాడేరు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు గిరిజనుల ఆరోగ్యం వారి ఫోన్‌లో ఉందని, ఎక్కడికి వెళ్లినా వారు ఆరోగ్యం ఫోన్‌లో చెక్ చేసుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను క్రోడీకరించి ఆరోగ్యాన్ని రక్షిస్తామన్నారు. ప్రతి ఒక్క గిరిజన బిడ్డకు మెరుగైన ఆరోగ్యం ఇవ్వాలని సంకల్పించామన్నారు. గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. ఏజెన్సీ ఏరియాలో మరికొన్ని సెల్ టవర్లు పెట్టించి కనెక్టివిటీ పెంచుతామన్నారు. 3 నెలల్లో అల్లూరి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడటమే ప్రభుత్వానికి కీలకం అని సిఎం చంద్రబాబు వివరించారు.

## చెట్టుకు కారు ఢీ: అన్నదమ్ములు మృతి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మల్కిపురం మండలం, లక్కవరం శివారు, ఓఎన్జిసి సైట్ దగ్గర్లో జరిగిన ప్రమాదం లో ఇరువురు అన్నదమ్ములు అక్కడిక్కడే అసువులు బాయగా తోటి కోడళ్ళు ఆసుపత్రి లో చికిత్స పొందు తున్నారు. లక్కవరం గ్రామానికి చెందిన, ముదునూరి రామభద్ర రాజు (రాంబాబు రాజు), అతని తమ్ముడు ముదునూరి వెంకట సుబ్బరాజు లు వారి భార్యలతో కలసి, బంధువుల ఇంటికి వెళ్లి భీమవరం నుండి తిరిగి లక్కవరం గ్రామం వారి కారులో వస్తుండగా, లక్కవరం ఓఎన్జిసి సైట్ దగ్గరకు వచ్చేసరికి రోడ్డు పక్కన ఉన్న కొబ్బరి చెట్లను బలంగా ఢీకొట్టారు. కారు పూర్తిగా డ్యామేజ్ అయ్యి, డ్రైవింగ్ చేస్తున్న ముదునూరి రామభద్ర రాజు, తమ్ముడైన ముదునూరు వెంకట సుబ్బరాజు అక్కడికక్కడే మృతి చెందారు. తోటికోడళ్ళు ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో గ్రామస్తులు ఆసుపత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


## నార్త్ కొరియాలో ప్రమాదం: బాపట్ల జిల్లా వాసి మృతి



**చీరాల, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** నార్త్‌కొరియాలో జరిగిన ఫ్యాక్టరీ ప్రమాదం లో బాపట్ల జిల్లాకు చెందిన యువకుడు మృతి చెందాడు. పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన సందెపూడి సాల్మన్ రాజు (35) ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. సుమారు నెల రోజుల క్రితం ఆయన పనిచేస్తున్న ఫ్యాక్టరీలో ప్రమాదవశాత్తు ఘటన చోటుచేసుకోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గత సోమవారం ప్రాణాలు విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాల్మన్‌రాజు మృతి వార్త తెలియడంతో చెరుకూరు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుడికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నట్లు సమాచారం.మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. శనివారం సాల్మన్ రాజు మృతదేహం చెరుకూరు గ్రామానికి చేరుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ఇచ్ఛాపురంలో పోర్టు

- రెండు వేల ఎకరాల భూముల్లో నిర్మాణానికి ప్రతిపాదనలు
- కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు
- పలు అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి భూమిపూజ



**ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి (శ్రీకాకుళం జిల్లా), సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పోర్టు నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. తీర ప్రాంతంలో ఉపభూముల్లో పోర్టు నిర్మాణ ప్రతిపాదనలు చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో రూ.6 కోట్లతో నిర్మిస్తున్న రెండు రైల్వే అండర్ బ్రిడ్జిలు, కోల్ ఇండియా సౌజన్యంతో సూడా ఆధ్వర్యంలో రూ.2.29కోట్లతో సురంగి రాజావారి మైదానంలో నిర్మిస్తున్న బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (ఇండోర్ స్టేడియం) నిర్మాణానికి భూమి పూజ చేశారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో కలిసి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు తెలిపారు. ఇక్కడి తీర ప్రాంతంలో 2 వేల ఎకరాల్లో పోర్టు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి కార్యాచరణ మొదలెట్టినట్టు తెలిపారు. పోర్టు నిర్మాణం ద్వారా పెద్ద ఎత్తున అనుబంధ పరిశ్రమలు, సంస్థలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం పట్టణంలో మరో రైల్వే వంతెన నిర్మాణానికి కూడా సన్నాహాలు మొదలు పెట్టినట్టు ప్రకటించారు. అలైన్మెంట్ ప్రజాభిప్రాయానికి అనుగుణంగా రూపొందించనున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజోపయోగ పనులకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఐదేళ్ల వైసిపి పాలనలో అరాచకం, దౌర్జన్యం, దాడులతో కొనసాగిందని చెప్పారు. జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రస్థాయిలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. గతంలోనూ ఇప్పుడూ చంద్రబాబు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రాజావారి మైదానంలో అన్ని వసతులతో బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో కూడా ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందువరుసలో నిలబెడతామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రోడ్డు సదుపాయం లేని కంచిలి మండలంలో గిరిజన గ్రామాలకు రహదారులు వేసిన విషయాన్ని ప్రకటించారు.

ఇచ్ఛాపురం మున్సిపాల్టీని రైల్వేట్రాక్ రెండుగా విభజించటం వల్ల దశాబ్దాలుగా ఉన్న రాకపోకల సమస్యలు పరిష్కారంగా రెండు ఆర్ ఓబీలు శంకుస్థాపన చేశామన్నారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ పథకం క్రింద రీమోడల్ చేస్తున్నామని, దీంతో పాటు కొత్త రైళ్ల హాల్ట్‌లు కూడా తీసుకొచ్చామన్నారు. రైల్వేజోన్ మార్పు చారిత్రాత్మకమైన నిర్ణయమని గతంలో పలాసా నుండి ఇచ్ఛాపురం వరకు ఉన్న 7 స్టేషన్లను ఈస్ట్ కోస్ట్ జోన్ ఖుర్దా డివిజన్‌లో ఉండటం వల్ల చిన్న పనికి కూడా భువనేశ్వర్ వెళ్లాల్సి వచ్చిందని కూటమి ప్రభుత్వం కృషితో విశాఖపట్నం జోన్ మంజూరై 7 స్టేషన్లు విశాఖ డివిజన్‌లో కలిపారన్నారు. ఇకపై రైల్వే సమస్యలపై నేరుగా డిఆర్ఎంకు కలిసే అవకాశం దొరికిందన్నారు. ఏళ్ల తరబడి రోడ్లు లేని ఇంటీరియల్ గ్రామాలకు కూడా రూ.6లక్షలతో బిటి రోడ్డు, రూ.45 లక్షలతో సిసి రోడ్డు పనులు చేపట్టామన్నారు. గత 5 ఏళ్లుగా నిలిచిపోయిన ఇచ్ఛాపురం కెవికె రూ.2.40కోట్లుతో శంకుస్థాపన చేశామని అన్నారు. ఇందులో 3 కోర్టులు బ్యాడ్మింటన్, జిమ్, అథ్లెటిక్ ట్రాక్, ఆకింగ్ ట్రాక్ ఉంటాయని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడల్లా క్రీడలకు పెద్దపేట వేసేవారని స్టేడియంలు నిర్మించి క్రీడాకారులను తయారు చేసి ఒలింపిక్ స్థాయిలో మెడల్స్ సాధించేలా బాట వేసారన్నారు. శ్రీకాకుళం పార్లమెంటరీలోని 7 నియోజకవర్గాలలోనూ కేవీకేలు మంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో స్టేడియంలు నిర్మించటమే విజన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఆర్ఎం కె.రామారావు, సీనియర్ డిసిఎం పవన్ కుమార్, బిజెపి జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, జనసేన నాయకులు దాసరి రాజు, డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, జడ్ఆర్‌యుసిసి మెంబర్ శ్రీనివాస్ రౌలో, రాష్ట్ర రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ కొండా శంకర్ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పత్రి తవిటయ్య, ఎన్ కోటి, కాళ్ల దర్మారావు, కాళ్ల దిలీప్, లోపింటి పద్మనాభం, ఆశి లీలారాణి, జన్నెల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

**రహదారులను ప్రారంభించిన కేంద్రమంత్రి:** కంచిలి మండలంలో ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్ బాబుతో కలిసి పోలేరులో రూ.85 లక్షలతో పిఐయు నిధులతో తారు రోడ్లు ప్రారంభించారు. అలాగే కొండ పోలేరు గ్రామంలో రూ.75 లక్షలతో 750 మీటర్ల సిమెంట్ రహదారి ప్రారంభించారు. అనంతరం కొల్లూరు పంచాయతీ పరిధిలోగల గుండాం గ్రామంలో వైఎసఆర్ పార్టీకి చెందిన 50 కుటుంబాలు మంత్రి సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పి ఆయా కుటుంబాలను, మంత్రి, విప్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రహదారులు పూర్తిగా పాడైపోయి పెద్ద పెద్ద గోతులు ఏర్పడి చిన్నాభిన్నంగా తయారైందని ప్రజలు ప్రయాణం సాగించాలంటే నరకయాతన అనుభవించారని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపుతో పరిపాలన సాగిస్తున్నారని అమరావతి పూర్తిస్థాయిలో వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అలాగే పోలవరం ప్రాజెక్టు ఫేజ్ 2 నుండి గోదావరి జలాలను అనకాపల్లి వరకు అందించారని, రానున్న రోజుల్లో విశాఖపట్నం, విజయనగరం మీదుగా శ్రీకాకుళం జిల్లా వంశధార నదికి అనుసంధానం చేసి ఇచ్ఛాపురం వరకు తాగు సాగు నీరు అందించాలనే దృఢ సంకల్పంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జ్ దాసరి రాజు, కంచిలి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వం:** అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వం అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కారణమంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కవిటి మండలం రాజపురంలో ఆర్.కృష్ణయ్య 20 లక్షలఎంపీ నిధులతో నిర్మించనున్న సామాజిక భవనానికి శంకుస్థాపనతో పాటు బైరిపురం గ్రామంలో బిఎసఎనఎల్ టవర్‌ను ఆయన స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ సంయుక్తంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి రెండు కళ్ళు అంటూ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బెందాళం రమేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# పోలీసు క్రీడలకు ఇక ప్రత్యేక అకాడమీ

- పోలీసు క్రీడాకారులకు ప్రొఫెషనల్ శిక్షణ
- స్పోర్ట్స్ కార్యకలాపాల కోసం విట్‌తో ఎంఒయు
- పోలీసు క్రీడా సంబరాల సభలో డిజిపి వెల్లడి



**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర పోలీసు క్రీడాకారులను జాతీయస్థాయిలో తీర్చిదిద్దే లక్ష్యంతో 'ఎపి పోలీస్ స్పోర్ట్స్ అకాడమీ' ఏర్పాటు చేస్తున్నట్లు డిజిపి హరీష్ కుమార్ గుప్తా ప్రకటించారు. క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ, ఆధునిక క్రీడా పరికరాలు, అవసరమైన మౌలిక వసతులు కల్పించి ప్రొఫెషనల్ స్థాయిలో తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇందులో భాగంగా విఐటి-ఎపి, అమరావతితో పోలీసుశాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఎపి పోలీస్ స్పోర్ట్స్ అకాడమీ లోగోను డిజిపి ఆవిష్కరించారు. మంగళగిరి ఎపిఎస్పీ 6వ బెటాలియన్‌లో శుక్రవారం జరిగిన తొలి ఎపి స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 ముగింపు కార్యక్రమంలో డిజిపి మాట్లాడారు. పోలీసుశాఖలో హోదాలు, పోస్టింగ్‌లు వేరైనా అందరూ ఒకే జట్టులోని సభ్యులేనని పేర్కొన్నారు. 'మనది ఎపి పోలీస్ టీమ్.. మనమంతా ఒకే కుటుంబం. సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలం' అని పిలుపునిచ్చారు. సమాజంతోపాటు నేరాల స్వరూపమూ వేగంగా మారుతోందని డిజిపి పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఎదురయ్యే కొత్త తరహా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు పోలీసులకు శారీరక, మానసిక దృఢత్వం అత్యంత అవసరమన్నారు. క్రీడలను ఉద్యోగ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర పోలీసు క్రీడాకారులు ఈ మీట్‌తోనే ఆగిపోకుండా ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్‌కు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో మహిళలు ప్రతిభ చాటుతున్నారని, పోలీసుశాఖలోని మహిళా క్రీడాకారులు కూడా రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేలా పూర్తి ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించిన ఆర్గనైజింగ్ కమిటీ, విశ్వవిద్యాలయాలు, క్రీడా సంస్థలు, కోచ్‌లు, సాంకేతిక అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు, స్పాన్సర్లను డిజిపి అభినందించారు. వచ్చే ఏడాది పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను మరింత విస్తృతంగా, మెరుగైన ప్రమాణాలతో నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 15 రేంజ్‌ల నుంచి దాదాపు 1,900 మంది పోలీసు క్రీడాకారులు నాలుగు రోజులపాటు జరిగిన పోటీల్లో పాల్గొన్నారని డిజిపి తెలిపారు. తొలిసారిగా ఇంత పెద్ద స్థాయిలో రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించడం గర్వకారణ మన్నారు. పతకాలు సాధించిన వారిని అభినందిస్తూ.. విజయం సాధించని వారు నిరుత్సాహపడకుండా మరింత సాధనతో ముందుకు సాగాలని సూచించారు.

**విశాఖ రేంజ్‌కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్:** నాలుగు రోజులపాటు హోరాహోరీగా సాగిన పోటీల్లో విశాఖ రేంజ్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐజిలు కె.వి.మోహన్‌రావు (స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్), ఆకే రవికృష్ణ (ఈగల్), బి.రాజకుమారి (వుమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ), సీహెచ్.శ్రీకాంత్ (టెక్నికల్ సర్వీసెస్ అండ్ ఆపరేషన్స్), సెంథిల్‌కుమార్, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, డిఐజిలు అన్బురాజన్, వకుల్ జిందాల్‌తోపాటు సీనియర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉమెన్ ఎపిఎల్ షెడ్యూల్ విడుదల

- సెప్టెంబర్ 19న తొలి మ్యాచ్.. సెప్టెంబర్ 27న ఫైనల్
- మొత్తం 13 మ్యాచ్‌లు మంగళగిరి వేదికగా డే, నైట్ మ్యాచ్‌లు
- బ్రాండ్ అంబాసిడర్‌గా భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్




**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** మహిళల ఎ.పి. ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల షెడ్యూల్‌ను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఎ.సి.ఎ) శుక్రవారం విడుదల చేసింది. ప్రీమియర్ లీగ్ పోటీల వివరాలను ఎ.సి.ఎ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శి సానా సతీష్ బాబు, గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్ దొడ్డపనేని కళ్యాణ్ కృష్ణ వెల్లడించారు. ఈ లీగ్‌లో ఫైనల్ మ్యాచ్‌తో కలిపి మొత్తం 13 మ్యాచ్‌లు జరగనున్నాయి. సెప్టెంబర్ 19న తొలి మ్యాచ్ ప్రారంభం కాగా, సెప్టెంబర్ 27న ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. ఫైనల్ మ్యాచ్‌కు ఏదైనా అంతరాయం కలిగితే ఒక రిజర్వ్ డే రోజున మ్యాచ్ నిర్వహిస్తారు. ఈప్రీమియర్ లీగ్‌లో నాలుగు జట్లు పోటీపడనున్నాయి. రాజధాని అమరావతిలో మంగళగిరి వేదికగా జరగనున్న ఈ పోటీల్లో డే, నైట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మహిళా క్రికెట్ అభిమానులు ప్రత్యక్షంగా మ్యాచ్‌లను వీక్షి ంచేలా మరోసారి ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. గతంలో లీగ్‌కు లభించిన ఆదరణను దృష్టిలో ఉంచుకుని, ఈసారి కూడా ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి క్రీడాకారిణులను ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరుతున్నారు. మహిళా క్రికెట్ భారత మాజీ కెప్టెన్, ప్రముఖ క్రీడాకారిణి మిథాలీ రాజ్ ఈ ప్రీమియర్ లీగ్ పోటీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. మిథాలీ రాజ్ భాగస్వామ్యం ద్వారా మహిళా క్రికెట్‌కు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు నిర్వాహకులు కృషి

వార్త

క్రమశిక్షణ, సౌశీల్యం, అంతర్‌దృష్టి, మానవీయత, కరుణ మొదలైన గుణాలు లోపించిన నాయకుల చేతుల్లో రాజకీయాలు ఉండటం కంటే అసలు రాజకీయాలే లేకపోవడం ఎంతో మేలు.

న- రామ్ మనోహర్ లోహియా

# స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయొద్దు

**దేశంలో కానీ, రాష్ట్రాల్లో కానీ ఎంతో సమర్థవంతులుగా పేరు తెచ్చుకున్న నాయకుల్లో అధిక శాతం పంచాయతీరాజ్ వ్యవస్థ నుండి వచ్చినవారే. సర్పంచులు, సమితి అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా పనిచేసిన వారికి ప్రజాసమస్యలు ముఖ్యంగా గ్రామీణ సమస్యల పట్ల మంచి అవగాహన ఉంటుంది. ఏ సమస్య వచ్చినా తమ తరపున మాట్లాడటానికి తమ సర్పంచ్ ఉన్నాడనే ధైర్యం ఆనాడు గ్రామ ప్రజల్లో అపారంగా ఉండేది. ఇలా ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్న గ్రామ నాయకులు ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగారు. ఇప్పుడా పరిస్థితి స్థానిక సంస్థలకు లేదనే చెప్పొచ్చు. నిధులు లేక తలతాకట్టుపెట్టి అప్పో సప్పో చేసి గ్రామాభివృద్ధికి సొంత డబ్బు వెచ్చించిన ఎందరో సర్పంచులు వారి పదవీకాలం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఆ బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు భరించలేక, ఆత్మగౌరవం చంపుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ కొందరు మాజీ సర్పంచులై ఏళ్లు దాటినా తమ బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు.**

దామెర్ల సాయిబాబ

కానుకలు, దక్షిణతాంబూలాలు, మొక్కులు అన్నీ సమర్పించుకున్న తర్వాత కూడా దైవం కోరిన వరాలు ఇవ్వకపోతే కోరికలు తీర్చకపోతే పోయావు తాము చెల్లించిన కానుకలు, దక్షిణలు తిరిగి ఇవ్వాలంటూ 'మాదన్నమాకీ రాజన్న దేవుడా' అంటూ భక్తులు వేములవాడలోని రాజరాజేశ్వర స్వామిని వేడుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. భక్తులు సమర్పించిన కానుకలు తిరిగి వారికి చెల్లించడానికి ఆయన దగ్గర లక్ష్మి ఉండదు కనుక ఏదో వరం ఇచ్చి పంపుతారనేది భక్తుల విశ్వాసం. ప్రజాస్వామ్యవ్యవస్థకు మూలస్తంభాలైన స్థానిక సంస్థల ప్రతినిధుల పరిస్థితి అందుకు అద్దంపడుతుందేమోననిపిస్తున్నది. పంచాయతీలకు నిధులు, విధులు ఇస్తాం, చట్టాలు తెచ్చాం, గ్రామ సమస్యలను గుర్తించి స్థానికంగానే సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నాం అంటూ ఎంతో కాలంగా పాలకులు ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తూనే ఉన్నారు. కానీ 'అయ్యా మాకేమీ కొత్త చట్టాలు చేసి అదనంగా నిధులు, అధికారాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. రాజ్యాంగ సవరణల ద్వారా కల్పించిన ముప్పై తొమ్మిది ప్రభుత్వ శాఖలను గ్రామస్థాయిలో తమకు అప్పగిస్తే అదే పదివేలని వారు ఎంతోకాలంగా వేడుకుంటున్నారు. చట్టంలో ఉంది కనుక ఇవ్వమని చెప్పలేరు, అలాని ఇవ్వరు. దశాబ్దాల తరబడి నాన్చుతూనే ఉన్నారు. ఇప్పటికీ చట్టంలో కల్పించిన సగం అధికారాలు కూడా వారికి ఇవ్వలేదు. ఇచ్చినా కొద్దిపాటి శాఖల్లోకూడా అనేక ఆంక్షలు, అధికారుల జోక్యాన్ని పెంచారు. అంతేకాదు ఒక వ్యూహం ప్రకారం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారనే ఆరోపణలను కొట్టివేయలేం. సర్పంచులకు గౌరవమర్యాదలకు ఎలాంటి లోటు ఉండదని అంటూనే ఇంకొకపక్క విద్యాకమిటీలు, వనరక్షణ కమిటీలు, నీటి సంఘాలంటూ స్థానిక సంస్థలకు సమాంతరంగా వ్యవస్థలను ఏర్పాటు చేసి సర్పంచు పదవులను ఉత్సవ విగ్రహాలుగా తయారు చేశారు. స్థానిక సంస్థల ప్రతినిధుల ప్రమేయం లేకుండానే ఎన్నోసంక్షేమ కార్యక్రమాలను, చివరకు లబ్దిదారుల గుర్తింపులు కూడా జరిగిపోతున్నాయి. ఇది ఇప్పటికిప్పుడు ఆరంభమైంది కాకపోయినా రెండు, మూడు దశాబ్దాలుగా ఒక వ్యూహం ప్రకారం స్థానిక సంస్థలను బల హీనపరిచే కార్యక్రమం జరుగుతున్నది. చివరకు చీపురుకట్ట కొనడానికి కూడా స్వతంత్రంగా వ్యవహరించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మరొకపక్క ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఆదాయం అంతంత మాత్రమేఉంది. ఆస్తిపన్ను తప్ప మరోపెద్ద ఆదాయవనరు లేకుండాపోయింది. ఇకగ్రామంలో ఏ అభివృద్ధి చేయాలన్నా అటు కేంద్ర ప్రభుత్వం వైపు, ఇటు రాష్ట్ర ప్రభుత్వంవైపు చేయి చాచే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏకోణంలో చూసినా పంచాయతీ రాజ్ వ్యవస్థను అంతోఇంతో నిర్వీర్యం చేయాలని అందరూ ప్రయత్నం చేసినవారే. తమ అధికారాలకు, ప్రాబల్యానికి దెబ్బ తగులుతుందనే భయమే ఇందుకు కారణమని చెప్పొచ్చు. పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారానే రాజకీయ ప్రవేశం చేసి ఉన్నతస్థాయికి చేరిన కొందరు నాయకులుకూడాపంచాయతీలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించడం అత్యంత బాధాకరం. దేశంలో కానీ, రాష్ట్రాల్లోకానీ ఎంతో సమర్థవంతులుగా పేరు తెచ్చుకున్న నాయకుల్లో అధికశాతం పంచాయతీరాజ్ వ్యవస్థ నుండి వచ్చినవారే. సర్పంచులు, సమితి అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా పనిచేసినవారికి ప్రజాసమస్యలు ముఖ్యంగా గ్రామీణ సమస్యల పట్ల మంచి


## ఒక్క మాట

అవగాహన ఉంటుంది. ఏ సమస్య వచ్చినా తమ తరపున మాట్లాడటానికి తమ సర్పంచ్‌ఉన్నా డనే ధైర్యం ఆనాడు గ్రామప్రజల్లో అపారంగా ఉండేది. ఇలా ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్న గ్రామ నాయకులు ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారు. ఇప్పుడా పరిస్థితి స్థానిక సంస్థలకు లేదనే చెప్పొచ్చు. నిధులులేక తలతాకట్టు పెట్టి అప్పోసప్పో చేసి గ్రామా భివృద్ధికి సొంత డబ్బు వెచ్చించిన ఎందరో సర్పంచులు వారి పదవీకాలం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఆ బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు భరిం చలేక, ఆత్మగౌరవం చంపుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతు న్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ కొందరు మాజీ సర్పంచులై ఏళ్లు దాటినా తమ బిల్లులకోసం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. భారతదేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. చంద్రగుప్తుడికంటే ముందు నుంచి గ్రామాలు, గ్రామ వ్యవస్థ అమలులో ఉన్నట్లు చరిత్ర చెబుతున్నది. ఆనాడు కూడా గ్రామసభలుండేవి. వాటి నిర్ణయాలకు ఆనాటిరాజరిక వ్యవస్థ ఎంతోప్రాముఖ్యత ఇచ్చిం ది. ప్రాచీన కాలం నుండే గ్రామవ్యవస్థ ఏదో ఒకరూపంలో మనదేశంలో కొనసాగుతూ వచ్చింది. 1882లో ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్ రిప్పన్ స్థానిక సంస్థలకు ఒక ప్రతిపత్తి కల్పించారు. స్వాతంత్ర్య నంతరం 1952లో మొదటి పంచవర్ష ప్రణాళికలోనే కేంద్ర ప్రభుత్వం కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు ప్రారంభించింది. దాదాపు వంద గ్రామాలకు సుమారు లక్ష జనాభాతో ఒకయూనిట్‌ను ఏర్పాటు చేసి సామాజికాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కొంతకాలం కొనసాగిన పిదప అవి ఏ మేరకు లక్ష్యసాధనలో గ్రామ ప్రజలకు ఉపయోగపడ్డాయి? ప్రజలకు మరింత దగ్గర చేసేందుకు మార్పులు అవసరమా? అవసరమైతే ఎలాంటి మార్పులు చేయాలి? తదితర అంశాలపై అధ్యయ నం చేసేందుకు 1957లో ఒక కమిటీని వేశారు. బల్వంత రాయ్ మెహతా అధ్యక్షతన ఈ బృందం దేశంలోని అనేక ప్రాంతాలు పర్యటించి సమగ్రంగా పరిశీలించి 1958లో ఒక నివేదిక సమర్పించింది. గ్రామాభివృద్ధికి నిర్ణయాలు తీసుకునే అధికారం, స్వేచ్ఛస్థానిక సంస్థలకే ఉండాలని, అవి మూడంచెల విధానంలో ఉంటే బాగుంటుందని తదితర స్పష్టమైన సూచనలు చేసింది. ఆ సూచనల మేరకే దేశంలో మొదట రాజస్థాన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మూడంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. 1964లో గ్రామపంచాయతీ చట్టం తీసుకువచ్చారు. ఎంపి పాయ్‌కమిటీ నివేదికను అనుసరించి 447 బ్లాకులను, 321కు కుదింపు చేశారు. 1985లో సమితులను రద్దు చేసి అంతకుముందు అశోక్ మెహతా కమిటీ చేసిన సూచనలమేరకు 1986లో మండల్ ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్‌ను ఏర్పాటు చేశారు. ఇలా ఎన్నోమార్పులు చేర్పులు చేశారు. దేశవ్యాప్తంగా ఒకే తరహా పంచాయతీ రాజ్ వ్యవస్థ అమలులో ఉండాలనే ఉద్దేశ్యంతో 73వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు ఆమోదించిం ది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1994 మే 30వ తేదీ నుండి ఈశాసనం అమలులోకి వచ్చింది. ఈ చట్టప్రకారమే రాష్ట్రంలో ఐదంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. జెడ్‌పిటిసి, ఎంపి టిసిలని కొత్త పదవులు సృష్టించారు. కనీసం కూర్చోడానికి కుర్చీకూడా లేకుండా, అధికారాలు లేకుండా ఆ పదవులు ఎందుకు సృష్టించారో ఇప్పటికీ అర్థంకాదు. ఎన్ని మార్పులు చేసినా, మరెన్ని కూర్పులుచేసినా, అధికార వికేంద్రీకరణ మాత్రం మొదటి నుంచి అధికారంలో ఉన్న పెద్దలు జాగ్రత్త పడుతూనే వచ్చారు. తెలంగాణ ప్రభుత్వం 2018 ఏప్రిల్ నుంచి కొత్తచట్టాన్ని తీసుకువచ్చింది. ఈచట్టప్రకారం మరి కొన్ని అధికారాలతో పాటు ఆదాయాన్ని పెంచుకునే మార్గాలకు అవకాశాలు ఇచ్చింది. మొన్న తెలంగాణలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు కొలువు తీరారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వర లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగబోతున్నాయి. అనేక సమస్యలు వారి ముందు దర్శనమిస్తున్నాయి. ఏళ్ల తరబడి పేరుకుపోయిఉన్నాయి. ప్రగతికిమూలం కావాల్సిన పల్లెలు సమ స్యల నిలయాలుగా ఉన్నాయి. ప్రతి గ్రామం ఏదోరక మైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. స్థానిక సంస్థలను భాగ స్వామ్యం చేయకపోడంతో లబ్దిదారుల గుర్తింపులో కూడా అనేక అవకతవకలు జరుగుతున్నాయి. గ్రామాభివృద్ధికి చేపడుతున్న పనులు పంచాయతీ పరిధిలోకి తీసు కురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏదిఏమైనా రాజ్యాంగం కల్పించిన అధికారాలు, స్థానిక సంస్థలకు ఇవ్వడంలో జాప్యం చేయడం ఏమాత్రం సమంజసం కాదు. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలని కేంద్రం ముందు గావుకేకలు పెడుతున్న రాష్ట్రాల నేతలు స్థానిక సంస్థలకు మాత్రం అధి కారాలు ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసమో పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. ●


# అవశేషమే విశేషం!

రైతు శరీరభాగాల్లో పురుగుమందుల అవశేషాలు కానవస్తున్నాయన్న అంశంపై ఇప్పుడు ఎల్లెడలా విస్తృత చర్చ నడుస్తోంది. తన పంట బాగుకు అధిక దిగుబడికి పంట పొలాల్లో పురుగు మందులు చల్లడం, తెగుళ్ల మందుల పిచికారీలు చేయని రైతు ఉండనే ఉండడు. పంట బాగా పండి తన పెరట్లో గాదులు నిండితే చాలునని రైతు సంతృప్తి పడతాడు. అందుకే వాళ్లు ఆరుగాలం, అహర్నిశలూ కష్టపడుతుంటారు. ప్రపంచరైతుల్లో సగం మంది శరీరంలో పురుగు మందుల అవశేషాలున్నాయన్న గణాంకాల కారణాలు ఏవైనా ప్రపంచానికే ఆహార భరోసానిస్తున్న రైతు శరీరమే విషజాలంగా మారితే అందుకు బాధ్యులెవరో అంత తేలికగా తేల్చి చెప్పే విషయం కానేకాదు. ఇలాంటి దురదృష్టకర ఉదంతాలు వెల్ల డైనప్పుడల్లా ప్రభుత్వాలు, రైతులు, పురుగుమందుల కంపెనీల్లోనూ సందిగ్ధతలు ఉదయిస్తాయి. కానీ మళ్లీ మళ్లీ షరామామూలే. ఇలాంటి ఉదంతాలు పునరావృతమవుతూనే ఉంటాయి. తన వ్యాపారం పెరుగుతుందని పురుగు మందుల తయారీ సంస్థ భావిస్తే రైతు మాత్రం మంచి దిగుబడే కోరుకుంటాడు. మధ్యేమార్గంగా ప్రభుత్వం ఆ ఇరుపక్షాల సంక్షేమం కోసం 'సాగు' ప్రణాళికలు రూపొందిస్తుంది. కానీ అవి వికటిస్తే రైతుగతి అధోగతే. హరిత విప్లవం పేరిట దేశంలో దిగుబడులు పెరిగాయి. ప్రపంచ దేశాల్లో ఆహార భద్రతకు మేమే అని చెప్పుకుంటున్నాము. కానీ రైతు ఆకాంక్షలు, పురుగుమందుల నుండి రైతుకు రక్షణ, సాగుకు సంరక్షణ వంటి అంశాలపై పూర్తిస్థాయి భద్రతా విధానాలను పాటించేలా అవగాహన కల్పించడంలో ప్రభుత్వం ఇంకా ఒక అడుగు వెనుకనే ఉంది. నిజానికి పంట విధానాలు ఎన్నున్నా పెస్టిసైడ్స్ వాడకంలో రైతు ఎక్కడో అక్కడ తప్పటడుగు వేస్తున్నాడని ప్రభుత్వాలు ఆరోపిస్తుంటాయి. వీటిలో ఎంత నిజం ఉన్నా లేకపోయినా రైతు ఆరోగ్యానికి చేటు తప్పడం లేదు. పురుగుమందుల వాడకంలో రైతును సరైనదారిలో పెట్టగల పథకాలేవీ ప్రభుత్వం వద్ద లేవు. శాస్త్రీయ పరిజ్ఞానం ఎంతఅందుబాటులో ఉన్నా వాటిని సరైన దిశగా అమల్లో పెట్టే రైతాంగం లేదని అనుకోవడం కద్దు. పంటను కాపాడే మందు అయినా ఇప్పుడా పురుగు మందే రైతు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. తాము వాడుతున్నది అసలు మందులా, నకిలీ మందులో జాడ తెలుసుకోలేక రైతు సందిగ్ధంలో పడిపోతున్నాడు. ప్రపంచవ్యాప్తంగా 93.4 కోట్ల మంది వ్యవసాయంపై ఆధార పడి జీవిస్తుండగా వారిలో కనీసం సగం పైగా అంటే 40.2 కోట్ల నుంచి 43.3 కోట్ల మంది రైతుల వ్యవ సాయ కూలీల శరీరాల్లో పురుగు మందులకు సంబంధించిన విషపూరిత అవశేషాలను గుర్తించినట్లు 'పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్ సంస్థ' తన నివేదికలో వెల్లడించింది. పురుగుల మందుల బారిన పడియేటా ప్రపంచ వ్యాప్తంగా 11వేల మంది చనిపోతున్నారు. అందులో 60శాతంభారత్‌లోని రైతులు, వ్యవసాయ కూలీలే అని ఒక అంచనా. పశ్చిమ ఆఫ్రికాలోనిబుర్కినా ఫోసాలోని రైతాంగంలో 84 శాతం మంది రైతులు, కూలీల శరీరం లో విషకారకాలు బయటపడుతున్నాయి. రైతు పొలంలో చల్లే పురుగుమందుల్లో ప్రతి చుక్కవిషం, పిల్లలకు చేరుతోంది. ఆ పని వారి రక్తంలో, మూత్రంలో, స్వేదంలోనూ ఈ విషప్రభావం చేరిపోతోంది. ప్రధానంగా రైతు పురుగుమందుల వినియోగంలో అత్యాశకు పోయి వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదుకన్నా 3-4 రెట్లు ఎక్కువ మందు వాడుతున్నారు. ఒకమందు పనిచేయక పోతే మరో సంస్థ తయారీ మందును వాడేస్తున్నారు. ఎండో సల్ఫాన్, మోనోక్రోటోఫాస్, ఫోరేట్ వంటి అత్యంత విషపూరిత మందులను భారత్‌లో విచ్చలవిడిగా వాడుతున్నారు. ఇన్నాళ్లకు ఎండో సల్ఫాన్ వినియోగం విషయంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని హెచ్చరికలు జారీ చేసింది. రైతును ఆ మందు వాడకుండా ఆపేందుకు ఈ ప్రయత్నం చేశారు. అసలు తయారీనే ఆపించాలి. వీటి వినియోగంలో రైతును ఆశించే అవశేషాలు క్యాన్సర్, కిడ్నీ ఫెయిల్యూర్, నరాల బలహీనత, సంతానలోపం, చర్మవ్యాధులకు దారితీస్తాయి. పంజాబ్‌లో క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేక రైలు ఉన్నట్లుగానే, కేరళలో ఎండో సల్ఫాన్ బాధితులు ఎక్కువ మంది ఉన్న గ్రామాలు కూడా ఉన్నాయంటే అర్థం చేసుకోవచ్చు. ఇలా రైతు శరీరంలో విషం ఉంటే వారు పండించే ధాన్యంలో మనం తినే ఆహారంలో కూడా ఉన్నట్లే. విష అవశేషాల ప్రభావం తల్లిపాల ద్వారా బిడ్డకు, విత్తనం ద్వారా తర్వాత పంటకు చేరిపోతోంది. ఇప్పటికీ మార్కెట్‌లో 27 రకాల పురుగు మందులపై నిషేధం విధించాల్సి ఉందని రైతాంగం కోరుకుంటోంది. ఏవో కొన్ని కారణాల వలన కేంద్రప్రభుత్వం వాటి మీద దృష్టి పెట్టలేకపోతోంది. కనీసం సేంద్రియ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయ అవకాశం చూపితే రైతు ఒడ్డునపడతాడు. జీవన ఎరువులు, వేప ఆధారిత ఎరువులు, సమగ్ర సస్యరక్షణ విధానాలను రైతుకు చేరువచేస్తే తప్ప ఈ విషవలయంలోంచి బయటకురాలేడు. ఈ అవశేషాలు ప్రాణాంతకం అన్న విషయం గతంలో కొన్ని ఉదంతాల వలన తేటతెల్లం అయింది. గత మూడేళ్లలో మహారాష్ట్రలో 183 మంది రైతులు పురుగుమందు పీల్చడం వలన చనిపోయారు. 2017 ఆగస్టు, సెప్టెంబరు నెలలో 'యావత్మాల్'లో పత్తి పంటపై పిచికారీ చేసిన పురుగుమందులకు 21 మంది రైతులు, కూలీలు బలయ్యారు. 2024-26ల మధ్య రాజస్థాన్‌లో 535 మంది రైతులు ఈ పురుగుమందుల వాడకంతో మృతి చెందారు. ఇలా ప్రాణాంతక వ్యవసాయంగా మారితే రైతులు 'సాగు' రంగాన్ని వీడితే 'ఆహారభద్రత'కే గండి పడుతుంది.

> రచయితల సంఖ్య పెరిగే కొద్దీ పాఠకులు సోమరులుగా మారడం సహజం.
>
> గోల్డ్‌స్మిత్



> ఒక కంటితో నిద్రపోతూ మరో కంటితో శత్రువులను కనిపెట్టి ఉండే ఎలుగుబంటిలా రాజు శత్రువుల పట్ల జాగ్రత్తగా ఉండాలి.
>
> శ్రీకృష్ణదేవరాయలు



# ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు భరోసా ఏది?

డా. మోటె చిరంజీవి

విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన పథకంపై ప్రభుత్వ చిత్తశుద్ధి అవసరం. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉన్నత విద్య అందుబాటులోకి రావాలంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అత్యంత కీలకం. ఆర్థిక స్తోమత లేక చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితిలో ఉన్న అనేక మంది విద్యార్థులకు ఈ పథకం ఒక ఆశాకిరణంగా నిలిచింది. అయితే రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం, బకాయిలు పేరుకుపోవడం విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు విద్యాసంస్థల యాజమాన్యాల్లోనూ ఆందోళన కలిగిస్తోంది. విద్య అనేది ఖర్చు కాదు. భవిష్యత్తుకు పెట్టుబడి. ముఖ్యంగా పేద కుటుంబాల పిల్లలు ఇంజినీరింగ్, వైద్య, ఫార్మసీ, డిగ్రీ, పీజీ, వృత్తివిద్య వంటికోర్సులు అభ్యసించేందుకు ప్రభుత్వ సహకారం ఎంతో అవసరం. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందితేనే విద్యార్థులు ఆర్థిక ఒత్తిడి లేకుండా తమ చదువును కొనసాగించగలరు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోతే దాని ప్రభావం విద్యార్థులపైనే కాకుండా కళాశాలల నిర్వహణపైనా పడుతుంది. బోధనా సిబ్బంది జీతాలు, మౌలిక వసతుల నిర్వహణ, విద్యాప్రమాణాల కొనసాగింపు వంటి అంశాలు ఆర్థిక సమస్యలకు గురయ్యే అవకాశం ఉంటుంది. చివరికి దీనిప్రభావం విద్యార్థుల భవిష్యత్తుపైపడటంఆందోళనకరం. 2019-20 రూ.27 కోట్లు, 2020-21 రూ.151 కోట్లు, 2021-22 రూ.762 కోట్లు, 2022-23 రూ.1,432 కోట్లు, 2023-24 రూ.1,147 కోట్లు, 2024-25 రూ.24 కోట్లు పెండింగ్ టోకెన్ల మొత్తం రూ.3,543 కోట్లు వున్నాయి. తెలంగాణలో ప్రొఫెషనల్, నాన్‌ప్రొఫెషనల్ కోర్సులకు కలిపి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం సుమారు రూ.2,500 కోట్ల వార్షిక కేటాయింపు చేస్తోంది. 2025-26 నాటికి బకాయిలు భారీగా పెరిగి, 2024-25 వరకు మొత్తం బకాయిలు సుమారు రూ.9,000 కోట్ల వరకు ఉన్నాయని ప్రైవేట్ కళాశాలల సమాఖ్యలు పేర్కొన్నాయి. ప్రభుత్వాలు పథకాలను ప్రకటించడం మాత్రమే కాకుండా వాటికి అవసరమైన నిధులను సకాలంలో విడుదల చేయాలి. ముఖ్యంగా విద్యార్థుల చదువుతో ముడిపడిన పథకాల విషయంలో ఆలస్యం మరింత తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా పారదర్శకమైన, నిరంతర చెల్లింపు వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉంది. అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. పెండింగ్ బకాయిలను దశలవారీగా కాకుండా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతోపాటు, భవిష్య త్తులో బకాయిలు పేరుకుపోకుండా బడ్జెట్‌లో తగిన కేటా యింపులు చేయాలి. పేదరికం కారణంగా ఒక్క విద్యార్థి కూడా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. నిధుల విడుదలలో జాప్యం లేకుండా, విద్యార్థుల భవిష్య త్తుకు భరోసా కల్పించే విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను బలోపేతం చేయడమే సమాజ శ్రేయస్సుకు సరైన మార్గం. ●

# ఆచార్య దేవోభవ! అదే మన స్ఫూర్తిప్రదాత



శ్రీమతి ద్రౌపదీ ముర్ము

తలరాతను మార్చేది ఉపాధ్యాయులే. కోట్లాది మంది విద్యార్థుల జీవితాల్లో విజ్ఞానం, నైపుణ్యాలు, విలువలు, స్ఫూర్తి నింపి సుసంపన్నం చేస్తున్న గురువులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భారతీయులందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తన జన్మ దినోత్సవాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని భారతదేశానికి రెండో రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆకాక్షి ంచిన విషయం అందరికీ తెలిసిందే. ఆయన అంతర్జాతీయంగా ఖ్యాతి గాంచిన మేధావి. ప్రఖ్యాత రచయిత. గొప్ప రాజనీతిజ్ఞుడు. అయినప్పటికీ ఉపాధ్యాయునిగా తానుపోషించిన పాత్రనే అన్నింటి కంటే మిన్నగా భావించారు. అత్యంత ఆదరణ పొందిన రాష్ట్రపతుల్లో ఒకరైన డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాంకు ఒక సందర్భంలో మిమ్మల్ని శాస్త్రవేత్తగా గుర్తుంచుకోవాలా? రాష్ట్రపతిగాగుర్తుంచుకోవాలా? అనే ప్రశ్న ఎదురయింది. తనను ఓ ఉపాధ్యాయుడిగా గుర్తుంచుకోవాలనిడాక్టర్ కలాం సమాధానమిచ్చారు. సామర్థ్యం, నైతిక విలువలే ఉపాధ్యాయులను పూజనీయులుగా మారుస్తాయి. అలాంటి వారినే విద్యార్థులు దైవంగా భావిస్తారు. వారినే ఆదర్శంగా తీసుకుంటారు. విద్యార్థులపై కోపం ప్రదర్శించకూడదని, సహనంతో ఉండాలని ప్రాచీన గ్రంథాలు సూచిస్తున్నాయి. 'ఆచార్యదేవో భవ' అనే కాలాతీత సందేశాన్ని దాదాపు మూడు సహస్రాబ్దాల క్రితం నాటి తైత్తిరీయ ఉపనిషత్తులోని శిక్షావల్లి అందిస్తోంది. ఎంతోమంది వివేకవంతులైన, ప్రేమ నిండిన ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని పొందడం నాకు కలిగిన గొప్ప అదృష్టం. కొన్నిసందర్భాల్లో పాఠశాల సమయం ముగిసిన తర్వాత సైతం తమ గృహాల్లోనే వారు మాకు పాఠాలు చెప్పేవారు. మమ్మల్ని ఎంతోజాగ్రత్తగా చూసుకొనేవారు. ఏడో తరగతి తర్వాత పైచదువుల కోసం మా ఊరు నుంచి బయటకు వెళ్లిన మొదటి అమ్మాయిని నేనే. ఆ తర్వాత భువనేశ్వర్‌లో చదువుతున్నప్పుడూ నా ఉపాధ్యాయుల నుంచి అపారమైన ప్రేమను, ప్రోత్సాహాన్ని పొందగలగడం నాకు దక్కిన భాగ్యం. నా ఉపాధ్యాయుల గురించి ఎంతో వినయంగా ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఎందుకంటే వారి కథ... ప్రేమ, అంకితభావంఉన్న ఉపాధ్యాయుడు విద్యార్థిలోఅపరిమితమైన సామర్థ్యాన్ని, స్ఫూర్తిని మేల్కొల్పగలరు అనే గొప్ప సత్యాన్ని తెలియజేస్తుంది. మంచి ఉపాధ్యాయున్ని తీర్చిదిద్దే సూక్ష్మం ప్రాచీన కాలం నుంచి మన సంస్కృతీసంప్రదాయాల ద్వారా మనకు లభించింది. అది నేటి కాలానికి సైతం వర్తిస్తుంది. శతాబ్దాల క్రితం, మహాకవి కాళిదాసు తన మాళవికాగ్నిమిత్రం నాటకంలో, అపారమైన జ్ఞానాన్ని ఉండటంతో పాటు, దానిని ఇతరులకు అందించగల సామర్థ్యం ఉన్నవారే మంచి ఉపాధ్యాయుడు అని రాశారు. విద్యార్థుల్లో స్వతంత్ర్య ఆలోచనను ప్రోత్సహించడం, వారిలో ఆసక్తిని రేకెత్తించడం, తర్కాన్ని, ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించడం, నిర్ణయ సామర్థ్యానికి పదును పెట్టడం, వారు సాధికారత సాధించిన వ్యక్తులుగా ఎదగడానికి సాయ పడటం ఇవే బోధనకు ఉన్న అత్యంత ఉపయోగకరమైన, ప్రతిఫలాన్ని అందించే ఉపయుక్తకర అంశాలు. బోధన అంటే మానవాళిని తీర్చిదిద్దే పవిత్రమైన కార్యం. భవిష్యత్తు తరాలకు ప్రకాశవంతమైన మార్గాన్నిఅందించే ఉన్నతమైన బాధ్యత. బోధనకు సంబంధించిన నా జ్ఞాపకాలు నాకు ప్రత్యేకమైన సంతృప్తిని ఇస్తాయి. నేను ఒడిశాలోని రాయరంగ్‌పూర్‌లో ఉన్న శ్రీ అరబిందో ఇంటిగ్రల్ పాఠశాలలో చిన్నారులకు బోధించాను. వివిధ పాఠ్యాంశాలను బోధించడంతో పాటు... సంగీత ప్రదర్శనలకు, క్రీడలకు, నాటకాలకు వారిని సిద్ధం చేయడంలో పూర్తిగా నిమగ్నమై ఉండేదాన్ని. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకలకోసం మా సన్నాహాలను, ఆ సమయంలో పిల్లల ఆనందోత్సాహాలను గుర్తు చేసుకుంటే ఈనాటికీ నాకు ఎంతో సంతోషం కలుగుతుంది. విద్యార్థులను అందమైన ప్రదేశాలకు విహారయాత్రలకు తీసుకెళ్లడంలో గొప్ప సంతృప్తిని, అర్థాన్ని కనుగొన్నాను. పాఠశాల విద్యపూర్తయి ఏళ్లు గడిచినా...ఇప్పటికీ నా విద్యార్థులు వారి కుటుంబ కార్యక్రమాలకు నన్ను ఆహ్వానిస్తుంటారు. నా విద్యార్థుల్లో చాలా మంది పేర్లు నాకు స్పష్టంగా గుర్తున్నాయి. వాటితో పాటు మేం వారిని పిలిచిన మారు పేర్లు కూడా గుర్తున్నాయి. నా విద్యార్థుల నుంచి నేను కూడా చాలా నేర్చుకున్నాను. బాలల నుంచి తక్షణమేస్పందించే గుణాన్ని, ఆసక్తిని ఉపాధ్యాయులు నేర్చుకుంటారని నేను విశ్వసిస్తాను. రాష్ట్రపతిగా రెండో సంవత్సరాన్ని నేను పూర్తి చేసుకున్నప్పుడు రాష్ట్రపతి భవన్ ఆవరణలోని పాఠశాల విద్యార్థులతో సమయం గడిపాను. అప్పుడు వారికి పర్యావరణ పరిరక్షణ గురించి వివరించాను. నేను ఎల్లప్పుడూ విద్యార్థులను కలవడానికి, వారి ఆలోచనలను, అభిప్రాయాలను అర్థం చేసుకోవడానికి ఆసక్తి చూపుతాను. వారు పంచుకునే విషయాలు నాకు గుర్తుండిపోతాయి. సుమారు పదకొండేళ్ల క్రితం, నేను మా ఊరిలోఒక గురుకుల పాఠశాలను స్థాపించాను. ఆ పాఠశాలలో పేద విద్యార్థులు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలలు చదువుకుంటారు. వారిని కలుసుకొనేందుకు అప్పుడప్పుడూ ఆ పాఠశాలను సందర్శిస్తుంటాను. ఈ ఏడాది జూన్ 20న నా పుట్టినరోజు సందర్భంగా ఆబాలలతో సమయం గడపడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ సైతం నాతో పాటు పాఠశాలను సందర్శించి వారిలో స్ఫూర్తి నింపారు. ప్రధానిని కలుసుకున్న అసాధారణ అనుభవం వారికి చిరకాలంస్ఫూర్తినిచ్చేదిగా నిలిచిపోయింది. విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులకుమాత్రమే పరిమితం కాదు. తమ ప్రవర్తన, విజయాల ద్వారా బాలలకు ఆదర్శంగా నిలిచేవారు కూడా నేర్చుకోవడానికి, స్ఫూర్తికి విలువైన వనరుగా ఉంటారు. తమ పిల్లలను చదువుకోవడానికి పంపించేటప్పుడు ఉపాధ్యాయులపై అత్యంత విశ్వాసాన్ని తల్లిదండ్రులు, సంరక్షులు ఉంచుతారు. విద్యార్థులను తమ సొంత పిల్లలా చూసుకుంటారని, వారి భద్రత, అభివృద్ధి విషయంలో అత్యంత శ్రద్ధ తీసుకుంటారనివారు నమ్ముతారు. తమపై ఉంచిన ఈ పవిత్రమైన నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి ఉపాధ్యాయుని ధర్మం. ఉపాధ్యాయుని వైఖరి, ప్రవర్తన, నడవడిక బాలల్లో భయాందోళనలను కలిగించకూడదు, వారి మనోధైర్యాన్ని దెబ్బతీయకూడదు. లేదా వారిలో ఎలాంటి న్యూనతా భావం పెరిగేలా చేయకూడదు. విద్యార్థులను తమ లాంటి ఉత్తమ వ్యక్తులుగా తీర్చిదిద్దేలా ఉత్తమ ఉపాధ్యాయులు దోహదపడతారు. తమ విద్యార్థులను మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దే పవిత్రమైన బాధ్యత ఉపాధ్యాయులదే. తమ ఆలోచనల్లో, చేతల్లో నైతికతను పాటిస్తూ, సంపదను, కీర్తిని సాధించే విద్యార్థులే ఉపాధ్యాయుని విజయానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తారు. సామాజిక సమ్మిళితత్వమే కేంద్రంగా ఎదగాలనే లక్ష ్యం దిశగా భారత్ స్థిరంగా ప్రయాణిస్తోంది. పర్యావరణాన్ని, సకల జీవరాశులను పరిరక్షి ంచే, వ్యక్తిగత, సామాజిక శ్రేయస్సుకోసం కృషి చేసే, దేశమే ప్రథమం అనేస్ఫూర్తితో ముందుకు సాగే విద్యార్థులనుఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని నేనుకోరుకుంటున్నాను. భారత్ అగ్రగామిగా నిలవాలని

# ప్రజావాక్కు



## గురువులను గౌరవిద్దాం

నేటి విద్యార్థుల్లో కొందరికి గురువులంటే భయం, భక్తి, గౌరవం తగ్గిపోతున్నాయి. తరగతి గదుల్లోనే గురువులపై కామెంట్లు చేస్తూ, వెకిలిచేష్టలు చేయడంబాధాకరం. గురువులు తప్పును సరిదిద్దేందుకు మందలిస్తే, కొందరు విద్యార్థులు దారుణంగా ప్రవర్తిస్తూ బెదిరించే స్థాయికి వెళ్తున్నారు. తమ జీవితానికి మార్గదర్శనం చేసే గురువుల పట్ల కనీస గౌరవం లేకుండా ప్రవర్తించడం సరికాదు. గురువు చెప్పే మాటలు మన భవిష్యత్తుకు ఉపయోగపడే మంచి మార్గదర్శకత్వమని విద్యార్థులు గుర్తించాలి. గురువులను గౌరవించడం అంటే విద్యను, జ్ఞానాన్ని, మన భవిష్యత్తునుగౌరవించడమే. విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచడంలో తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమైనది. పిల్లలు తప్పులు చేయకుండా తల్లిదండ్రులు కూడా వారి ప్రవర్తనను గమనిస్తూ చూడాలి. గురువు విలువను గుర్తించి గౌరవించ డం ప్రతి విద్యార్థి బాధ్యత.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## పరిశోధకులను నియమించుకోవాలి

తెలంగాణా రాష్ట్రంలో గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు నూతన సంస్కరణలో భాగంగా పరిపాలనా పరమైన పరిశోధనలు అవసరం. ప్రతిమంత్రిత్వ శాఖ పరిధిలో ఆయా కార్యాలయాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులలో ఉన్నత విద్యలను అభ్యసించి వివిధ యూనివర్సిటీల నుండి డాక్టరేట్ పట్టా పొందిన ఉద్యోగుల వివరాలు సేకరించాలి. వారిద్వారా ఆయా శాఖలలో పని విధానం, నిధులు, సౌకర్యాలు, సమస్యలు, పరిష్కరించడం కోసం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సహాయకులుగా పనిచేయడానికి సలహాలు సూచనలు ఇవ్వడానికి వారిని నియమించుకోవాలి. ఆయా శాఖల అభివృద్ధికి గాను వీరి సేవలను వినియోగించుకోవాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## మట్టి విగ్రహాలను పూజిద్దాం

రాబోయే గణపతి ఉత్సవాల్లో భాగంగాకేవలం మట్టి విగ్రహాలను మాత్రమే పూజించి పర్యావరణాన్ని కాపాడుకునే ప్రయత్నం చేద్దాం. మారుతున్న కాలానుగుణంగా రకరకాల రంగురంగుల వినాయక విగ్రహాలను పర్యావరణ పరిరక్షణకు ఇబ్బంది కలగడమే కాకుండా చెరువుల్లో నిమజ్జనం చేసినప్పుడు నీరు కలుషితంతో పాటు వాటిని త్రాగే పాడిపశువులు, సకల జీవరాశులు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

## అయినా! ట్రంప్ మారడు

అమెరికా వాణిజ్య లోటును తగ్గించడం, దేశీయ పరిశ్రమలను కాపాడటమనే ప్రధాన ఉద్దేశ్యంతో అంతర్జాతీయ వాణిజ్యంలో ఇతర దేశాల నుంచి అమెరికాలోకి వచ్చే వస్తువులపై విధించే కస్టమ్స్ సుంకాలను ఎడాపడా వేసారు. ఇంతకు ముందున్న అమెరికా అధ్యక్షులెవరికీ లేని దుందుడుకుతనం ట్రంపుది. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు కొనసాగించడంపై ట్రంప్‌ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేస్తూ, భారత్ సహా పలు దేశాలపై ట్రంప్ సర్కార్ అదనపు టారిఫ్‌లు, సుంకాల పెంపునిర్ణయాలు ప్రకటించింది. అంతేకాదు జనరిక్ ఔషధాలపై కూడా ట్రంప్ టారిఫ్ విధించారు. ఈకొత్త టారిఫ్‌ల విధానాలపై అమెరికాలోని పలు రాష్ట్రాలు కోర్టును కూడా ఆశ్రయించాయి. కోర్టుల్లో పలు కీలక వ్యతిరేక తీర్పులు (ఎదురుదెబ్బలు) తగిలాయి. ఐనా! ట్రంప్ మారడం లేదు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## రైతులకు పశువులను అందించాలి

వర్షాభావ పరిస్థితులను ఎదురుకునేందుకు పశువులను రుణాలపై అందించాలి అని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం నిర్ణయించడం సంతోషకరం. అది గ్రామీణా ఉపాధి కల్పనా కార్యక్రమం ద్వారా కావొచ్చు, లేక ముద్ర పథకం ద్వారా కావొచ్చు. సెర్ప్ సంస్థ పెద్దన్న పాత్ర పోషించి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా డెయిరీని ఏర్పాటు చేసి విజయ డెయిరీ ద్వారా పాల కొనుగోలు కూడా చేపట్టడం గొప్ప అవకాశం. గత ప్రభుత్వం గొర్రెలు దిగుమతి ఆపడానికి గొర్రెల పంపిణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి గొర్రెల సంఖ్యలో దేశంలో రెండో స్థానంలో నిలిపితే ఇప్పటి ఈ ప్రభుత్వం పాల దిగుమతిని ఆపుటకు తద్వారా పాల ఉత్పత్తి సాధించుటకు కృషి చేస్తున్నది. అయితే ఉపాధి హామీ లేదా వీబీ జీరామ్ జీ ద్వారా ఈ ప్రాజెక్ట్ కూడా చేపడితే పథకం సంపూర్ణ ఫలితాలు అందిస్తుంది.

- భారత అవినాష్, జనగామ

## ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తరించాలి

భారత్ చుట్టూ ఉన్న భౌగోళిక, భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే దేశ రక్షణసన్నద్ధతలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావు లేదు. సరిహద్దుల్లో శాంతి కొనసాగాలని భారత్ కోరుకుంటున్నప్పటికీ, ఎలాంటి అనూహ్య పరిస్థితినైనా ఎదుర్కొనే సామర్థ్యాన్ని నిరంతరం పెంచుకోవాల్సిన అవసరం ఉంది. శాంతిని కోరుకోవడం బలహీనత కాదు, శాంతిని కాపాడగల సైనిక సామర్థ్యమే నిజమైన నిరోధక శక్తి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

గుంటూరు వార్త

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎంపీ,ఎమ్మెల్యే

**పిడుగురాళ్ల, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** గురజాల నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల శాసన సభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తిలు శంకుస్థాపనలు చేశారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురు రూ.177.67 కోట్ల యూఐడిఎఫ్, రూ.24.77 కోట్ల మున్సిపాలిటి నిధులతో పట్టణంలో సమగ్ర మంచినీటి అభివృద్ధి పథకం శంకుస్థాపన గావించారు. మొత్తంగా రూ.29.77 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే పట్టణంలోని గంగమ్మతల్లి దేవాలయం ప్రాంగణంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా నేతలు ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.



## సామూహిక వరలక్ష్మీ వ్రతం



**గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 4,ప్రభాతవార్త :** స్థానిక అరండల్‌పేటలోని శ్రీఅష్టలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో వ్యవస్థాపకులు,ప్రధాన పూజారి మర్రిపాటి ప్రసాద్ మరియు వారి బృందం ఆధ్వర్యంలో జరుగుతున్న కోటికుంకుమార్చనలో భాగంగా నాల్గవ శ్రావణ మాస శుక్రవారం ఉదయం శ్రీ చక్రమేరుకు అభిషేక విశేషార్చన అనంతరం వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో వ్రత విశేషాలను వివరిస్తూ నిర్వహించారు.తొలుత అమ్మవార్లకు కలువపూలు,బంగారు పుష్పాలతో విశేష పూజలు నిర్వహించి,లలిత,మణిద్వీప వర్ణన,విష్ణు సహస్ర పారాయణ,నక్షత్ర హారతి,మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాద వితరణతోపాటు అన్నప్రసాద వితరణ జరిగింది.

## నూతన పింఛన్లను పారదర్శకంగా మంజూరు చేస్తాం : ఎమ్మెల్యే మాధవి

**గుంటూరు, సెప్టెంబర్ 4,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో అర్హులైన వారందరికీ దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. పెన్షన్ మంజూరులో అర్హతే ప్రామాణికమని రాజకీయాలకు తావు లేదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని సానుకూలంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ప్రజా గ్రీవెన్స్‌లో కొత్త పింఛన్ల కోసం పెద్ద సంఖ్యలో అర్జీలు అందుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో అర్హులైన వారందరికి దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచే ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనర్హుల పేరుతో నిజమైన లబ్ధిదారులను పింఛన్ల జాబితా నుంచి తొలగించి, అధికార పార్టీకి చెందిన వారికి ప్రయోజనం చేకూరే విధంగా వ్యవహరించారని ఎమ్మెల్యే విమర్శించారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయ పక్షపాతం చోటుచేసుకోవడం వల్ల ఎంతో మంది అర్హులు నష్టపోయారని అన్నారు.ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో మాత్రం సంక్షేమ పథకాల అమలులో "అర్హతే ప్రామాణికం" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. పింఛన్ల మంజూరులో ఎటువంటి రాజకీయ జోక్యాలకు తావు ఉండదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయి పారదర్శకతతో పింఛన్లు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజల సంక్షేమం విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ఒక్క లబ్ధిదారుడూ నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.



## మాచర్ల పట్టణంలోని సచివాలయాల్లో అసలేం జరుగుతోంది..?

**కనీస సేవలకూ ప్రజలు మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సిందేనా..?**

**మాచర్ల టౌన్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:**

- ఉచిత సేవలకూ రేట్లు కడుతున్నారన్న ఆరోపణలు...
- సర్వీస్ చార్ట్ ఏదీ..? నేమ్‌బోర్డులు ఏవీ..?...
- అప్లికేషన్లు కూడా అందుబాటులో ఉండవా..?..
- సచివాలయాల నిర్వహణకు నిధులు రావడం లేదా..?..
- మహిళా పోలీసుల పాత్రపై కూడా ప్రశ్నలు..
- పెన్షన్ల పంపిణీకే పరిమితమయ్యారా..?

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన స్వర్ణ గ్రామం,స్వర్ణ వార్డు సచివాలయాల అసలు లక్ష్యం ఏమిటనే ప్రశ్నలు ప్రస్తుతం మాచర్ల పట్టణంలోని ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.ఒకప్పుడు అనేక ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చిన సచివాలయ వ్యవస్థ.ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో కనీస సేవలు కూడా అందించలేని పరిస్థితికి చేరిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.దీంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో మీ సేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు.

**సేవల కోసం మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు**

ఆదాయ ధ్రువీకరణ పత్రం,కుల ధ్రువీకరణ పత్రం,నివాస ధ్రువీకరణ పత్రం,1బి,అడంగల్ ,రేషన్‌కార్డులో చేర్పులు, మార్పులు,పంటల బీమా నమోదు తదితర సేవలను ప్రజలకు చేరువ చేయడమే సచివాలయ వ్యవస్థ ప్రధాన ఉద్దేశాల్లో ఒకటి.అయితే ప్రస్తుతం కొన్ని సచివాలయాల్లో ఈ సేవలు సక్రమంగా అందడం లేదని ప్రజలుఆరోపిస్తున్నారు.సచివాలయం లోనే పూర్తవ్వాల్సిన పనుల కోసం కూడా పట్టణ వాసులు కూడా మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని పలువురు చెబుతున్నారు.ఒక పని కోసం సచివాలయానికి వెళితే మరోచోటికి వెళ్లాలని సూచించడం, దరఖాస్తు ప్రక్రియపై సరైన సమాచారం ఇవ్వకపోవడం వంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని ప్రజలు అంటున్నారు

**అప్లికేషన్లు కూడా అందుబాటులో ఉండవా..?**

ప్రజలకు అవసరమైన దరఖాస్తు పత్రాలు సచివాలయంలో అందుబాటులో ఉండాల్సి ఉండగా, కొన్ని చోట్ల కనీసం అప్లికేషన్లు కూడా లభించని పరిస్థితి ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఏ సేవకు ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి..? ఏ పత్రాలు సమర్పించాలి..?సంబంధిత అధికారి ఎవరు..?అనే విషయాలపై స్పష్టత లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు.

**ఉచిత సేవలకు కూడా రేట్లు ఉన్నాయా..?**

ప్రభుత్వం నిర్దేశించిన కొన్ని సేవలకు రుసుములు లేకపోయినా,ఆయా పనులకు సంబంధించి ఒక్కో సర్వీసుకు ఒక్కో రేటు నిర్ణయించి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత..? ఎక్కడైనా అక్రమ వసూళ్లు జరుగుతున్నాయా..? జరిగితే వాటిపై అధికారులు తీసుకున్న చర్యలేమిటి..? అన్నది స్పష్టం కావాల్సి ఉంది.

**సచివాలయాల నిర్వహణకు నిధులు రావడం లేదా..?**

సచివాలయ భవనాల నిర్వహణ, మౌలిక వసతులు,ప్రజలకు అవసరమైన సమాచారం ప్రదర్శించే ఏర్పాట్లపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కొన్ని గ్రామాల్లో సచివాలయ భవనాలకు నేమ్‌బోర్డులు లేకపోవడం,ప్రజలకు కనిపించే విధంగా సర్వీస్ చార్ట్ ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.ఏ సేవలు అందుబాటులో ఉన్నాయి..?ఏ అధికారి ఏపని చూస్తారు..? సంబంధిత అధికారి ఎప్పుడు అందుబాటులో ఉంటారు..?అనే వివరాలు ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

**అందుబాటులో లేని గ్రామ సర్వేయర్లు..**

పట్టణంలో భూములకు సంబంధించిన సమస్యలు ఎదుర్కొనే ప్రజలకు సర్వేయర్ల సేవలు అత్యంత కీలకం.అయితే సంబంధిత సర్వేయర్లు అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మహిళా పోలీసుల పాత్రపై కూడా ప్రశ్నలు**

సచివాలయ వ్యవస్థలో మహిళా పోలీసుల నియామకం వెనుక ఉన్న ఉద్దేశం మహిళలు,బాలికల భద్రత, మహిళా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం వంటి అంశాల్లో కీలకంగా పనిచేయడమే. అయితే కొన్ని ప్రాంతాల్లో వారి విధులు, ప్రజలకు అందుతున్న సేవలపై స్పష్టత లేకపోవడంతో "సచివాలయంలో మహిళా పోలీసుల అసలు పాత్ర ఏమిటి?" అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.మహిళా పోలీసుల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకునేలా స్పష్టమైన బాధ్యతలు, ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



నేమ్ బోర్డు కూడా లేకుండా దర్శనమిస్తున్న నెహ్రూనగర్ 1వ వార్డులోని సచివాలయం

**పెన్షన్ల పంపిణీకే పరిమితమయ్యారా..?**

ప్రతి నెల ఒకటో తేదీ వచ్చేసరికి పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది చురుకుగా పాల్గొంటున్నారు. అయితే పెన్షన్ల పంపిణీతో పాటు మిగిలిన పౌర సేవలు కూడా అదే స్థాయిలో ప్రజలకు అందుతున్నాయా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సచివాలయాలు ఏర్పాటు చేసిన అసలు లక్ష్యం ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పకుండా "ప్రభుత్వ సేవలు ప్రజల ఇంటి ముంగిట" అందించడమే. కానీ ప్రస్తుతం ప్రజలు తమ చిన్నచిన్న పనుల కోసం కూడా మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తే సచివాలయ వ్యవస్థ ఉద్దేశం ఏమిటనే ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది.

**ఉన్నతాధికారులు స్పందించాలిన సమయం వచ్చింది..**

సచివాలయాల్లో అందుబాటులో ఉన్న సేవలు,సంబంధిత సిబ్బంది వివరాలు, సేవలకు నిర్ణయించిన రుసుములు, ఫిర్యాదుల పరిష్కార విధానం తదితర వివరాలను ప్రతి సచివాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని ప్రజలు కోరుతున్నారు.ఉచితంగా అందించాల్సిన సేవలకు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని,కేవలం ఆరోపణలైతే వాటిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని వారు కోరుతున్నారు.సచివాలయాలు ఎందుకు ఉన్నాయి..? ప్రజలకు సేవలు అందించేందుకా..? లేక ప్రజలను మరోసారి మీసేవ కేంద్రాల చుట్టూ తిప్పేందుకా..?ఈ ప్రశ్నకు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## అంతా నేనే చేశాను అనుకోవడం అవివేకం

### నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

**పిడుగురాళ్ల, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** అంతా నేనే చేశాను.. నేను లేకపోతే ఏదీ లేదు అనుకోవడం అనే దానికి మించిన అవివేకం మరొకటి లేదని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరుగుతున్న అభివృద్ధి పనులను, ప్రాజెక్ట్ నిర్మాణాలను చూసి మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అంతా నేను చేశాను.. మా ప్రభుత్వ హయాంలోనే జరిగాయని చెప్పుకోవడం, గురజాల నియోజకవర్గంలో మాజీ శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి కూడా పిడుగురాళ్ల పట్టణానికి తానే మంచినీళ్లు ఇచ్చాను.. అభివృద్ధి చేశాను అంటూ చెప్పుకోవడంకు మించిన అవివేకం మరోటి లేదని అన్నారు. గురజాల నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మాట్లాడిన విధంగానే గురజాల మాజీ శాసనసభ్యుడు కాసు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రానున్న పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు.



**రానున్న ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలి : ఎమ్మెల్యే యరపతినేని**

రానున్న మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసికట్టుగా పనిచేయాలని గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆర్అండ్‌బి బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలను సృష్టించి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు లేకుండా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ప్రజా పాలన జరగాలని, అందుకే ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని చెప్పారన్నారు. కూటమి నేతలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు.

**సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి : టీటీడీ బోర్డు సభ్యుడు కృష్ణమూర్తి**

కూటమి ప్రభుత్వంలో అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు పిల్లి చెన్నారావు, డాక్టర్ ఉన్నం నాగమల్లిఖార్జునరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలి, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు, మార్కెట్‌యార్డు చైర్మన్ వీరస్వామి, బాబావలి, వడ్డపల్లి సర్వేశ్వరరావు, సాంబశివరావు, సుతార్ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉంటాం

### ప్రజాదర్బార్ లో అర్జీలు స్వీకరించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, సెప్టెంబర్ 4,ప్రభాతవార్త :** రాష్ట్రంలో త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించబోతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే స్వయంగా స్వీకరించారు. ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉంటామని తెలిపారు. ఎక్కువగా పింఛన్లు, ఇంటి స్థలాలు, శానిటేషన్, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు వచ్చాయని, సంబంధిత అధికారులకు అర్జీలను పంపించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పింఛన్ల కోసం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే అర్హులైన వారిని గుర్తించామని, ప్రతి ఒక్కరూ సచివాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తామని చెప్పారు. కూటమి నాయకులు స్థానిక ఎన్నికలకు సిద్ధమవ్వాలని, కలిసికట్టుగా అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి బలం చేకూర్చడం ద్వారా గుంటూరు నగరంలో మరింత అభివృద్ధి సాధించుకోవచ్చన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా అన్ని రంగాల్లో ప్రగతి సాధించామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి సుమారు రూ.350 కోట్లు వెచ్చించామన్నారు. మురుగు శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. అంతర్గత రోడ్లను సైతం సీసీలుగా తీర్చిదిద్దుతున్నామని, గత వైసీపీలో గుంతల రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. కేవలం రోడ్లనే కాకుండా పార్కులు, క్రీడా ప్రాంగణాలు, వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు.

**కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే నసీర్**

కృష్ణుడి జీవితం ప్రతి మానవుడికి మార్గదర్శకమని గుంటూరు తూర్పు



ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం కృష్ణాష్టమి సందర్భంగా స్థానిక పాత గుంటూరులోని యాదవబజార్, మణి హోటల్ సెంటర్, ఇతర ప్రాంతాల్లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జీవితంలో ఎలాంటి కష్టాలు ఎదురైనా నవ్వుతూ ఎదుర్కొనే ధైర్యం కృష్ణుడి బాల్యం నేర్పుతుందని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడికి బోధించిన భగవద్గీత సమాజానికి సన్మార్గం చూపించదని చెప్పారు.

## ముగిసిన జన్మాష్టమి వేడుకలు



**గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 4,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కళావేదికపై సంస్కార భారతి అధ్యక్షులు మరియు వారి బృందం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి బాల గోకులం వేడుకలు కనుల పండువగా జరిగాయి.తొలుత జరిగిన చిరు సభా కార్యక్రమంలో పలువురు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.అనంతరం కోలాత నృత్యాలు పద్య పఠనాలు జరిగాయి.పలు ప్రాంతాల పాఠశాలల నుండి పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు అతిధులు బహుమతి ప్రధానం చేశారు.సాయంత్రం చిన్నారులు శ్రీకృష్ణవేషధారణలు,గోపిక వేషధారణలో పాల్గొని వేడుకగా ఉట్టికొట్టి బహుమతులను అందుకున్నారు.ఉదయం సాయంత్రం సుమారు 500మందికి పైగా బహుమతులను అందించారు.

## పెదకాకానిలో హై టెన్షన్

- ఎట్టకేలకు నానుతాడు సమర్పించి అంబటి మురళీకృష్ణ
- తెదేపా-వైకాపా కార్యకర్తల నినాదాలు
- వైకాపా నాయకులను అడ్డుకున్న టిడిపి శ్రేణులు

**పెదకాకాని(పొన్నూరు), సెప్టెంబర్ 4,ప్రభాతవార్త:** పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని పెదకాకాని గ్రామంలో హై టెన్షన్ నెలకొంది...పెదకాకాని గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామివారి దేవాలయంలో భ్రమరాంబ అమ్మవారికి సంబంధించిన మంగళసూత్రాలు, నానుతాడు ఛోరీకి గురైన విషయం పాఠకులకు విధితమే. ఈ విషయంపై టిడిపి-వైసీపి నాయకుల మధ్య మాటల యుద్ధం నడిచింది. ఈ విషయంలో ఇరు పార్టీల నాయకులు పత్రికా సమావేశాల ద్వారా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం జరిగింది. గత



నెలలో అమ్మవారికి సంబంధించిన మంగళసూత్రాలు, నానుతాడు ఛోరీకి గురయ్యాయి. విషయంపై స్థానిక వైకాపా నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళితే పోలీసులు స్పందించలేదని, అందువల్లే ఆ తర్వాత వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పెదకాకాని పోలీసులకు మళ్ళీ ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టారు. నిందితులను అరెస్టు చేయడం, నిందితుడి నుంచి ఛోరీ సొమ్మును స్వాధీనం చేసుకోవడం జరిగింది. శ్రావణమాసం కావడంతో గత నెల 27వ తేదీన నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ నేతృత్వంలో అమ్మవారికి మంగళసూత్రాలను సమర్పించారు. అదే రోజు అమ్మవారికి నానుతాడు కూడా భక్తుల సహాయ సహకారాలతో అందజేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, మరికొంత మంది నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. పెదకాకాని దేవాలయ ప్రతిష్టను మంట గలిపేవిధంగా అంబటి మురళీకృష్ణ, వైకాపా నాయకులు వ్యవహరిస్తున్నారని, ఇది సరైన విధానం కాదని చెప్పారు. ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయాలైన దేవాలయాలను వైకాపా నాయకులు రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటన్నారు. ఛోరీ జరిగితే దాన్ని ఛేధించేందుకు పోలీసులున్నారని, ఈ లోగానే వైకాపా నాయకులు లేనిపోని అపోహలు, ఆరోపణలతో దేవాలయ ప్రతిష్టను మంట గలపడం అన్యాయమన్నారు. వైకాపా నాయకులు, అంబటి మురళీకృష్ణ దేవాలయం ముందుకు వచ్చి అమ్మవారికి, భక్తులకు బహిరంగ క్షమాణలు చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఇక శుక్రవారం అమ్మవారికి నానుతాడు సమర్పించేందుకు బయలు దేరిన అంబటి మురళీకృష్ణను వైకాపా నాయకులను టిడిపి శ్రేణులు అడ్డుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబును టిడిపి శ్రేణులు, పోలీసులు



అడ్డుకున్నారు. వీరి మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. ఓం నమ:శివాయ....ఓం నమంశివాయ అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఎట్టకేలకు అంబటి మురళీకృష్ణ, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మంగళగిరి, తాడికొండ, వేమూరు సమన్వయకర్తలు దొంతిరెడ్డి వేమారెడ్డి, డైమండ్‌బాబు, వరికూటి అశోక్‌బాబు తదితరులు ర్యాలీగా వచ్చి అమ్మవారికి నానుతాడును సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

**రోడ్లను శుభ్రపరిచిన టిడిపి నాయకులు, కార్యకర్తలు:**

శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామివారి ప్రతిష్టకు భంగం కలిగించేవిధంగా వ్యవహరించిన వైకాపా నాయకులు నడిచిన రోడ్లన్నీ అపరిశుభ్రమయ్యాయని టిడిపి శ్రేణులు పసుపు నీళ్ళతో రోడ్లన్నీ శుభ్రం చేశారు. పెదకాకాని మల్లేశ్వరస్వామివారి దేవాలయ ప్రతిష్టకు భంగం కలిగించిన వైకాపా నాయకులు ఇప్పటికైనా క్షమాపణలు చెప్పాలని, లేకుండా భగవంతుడు క్షమించడని పలువురు నాయకులు స్పష్టం చేశారు.

## జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

**గుంటూరు,సెప్టెంబర్4,ప్రభాతవార్త:**

గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతను మెరుగుపరచడం, ట్రాఫిక్ నిబంధనల అమలును కట్టుదిట్టం చేయడం లక్ష్యంగా గురువారం సాయంత్రం 4.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్ అమలు



కార్యక్రమం నిర్వహించబడింది.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో జిల్లాలోని 5 బ్లాక్ స్పాట్లు, మరో 13 హైవే ఎంట్రీ, ఎగ్జిట్ కీలక ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై మొత్తం 501 చలానాలు నమోదు చేసి రూ. 3,33,360/ జరిమానా విధించారు. ఈ ప్రత్యేక డ్రైవ్ లో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై మరియు కార్ లో సీట్ బెల్ట్ ధరించని వారిపై 120 కేసులు,ట్రిపుల్ రైడింగ్‌పై - 12 కేసులు,ప్రమాదకరంగా వాహనాలు నడిపిన వారిపై - 37 కేసులు,రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై - 8 కేసులు,మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపిన వారిపై - 16 కేసులు,వాహనానికి సైలెన్సర్ లేకుండా 1,మైనర్ డ్రైవింగ్ చేసినవారు 12 కేసులు నమోదు చేశారు.ఇతర మోటారు వాహన చట్ట ఉల్లంఘనలకు సంబంధించి 314 కేసులు నమోదు చేశారు.అదేవిధంగా రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు మరియు హెల్మెట్ వాడకంపై జిల్లా వ్యాప్తం గా 18 రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.5 బ్లాక్ స్పాట్స్,10 హైవే ఎంట్రీ పాయింట్లు,3 ఎగ్జిట్ పాయింట్లు వద్ద ఈ కార్యక్రమాల ద్వారా 250 మంది డ్రైవర్లు, 300 మంది విద్యార్థులు, 255 మంది సాధారణ ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మొత్తం 805 మంది ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, హెల్మెట్ ధరించడం,మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగించకుండా డ్రైవింగ్ చేయడం ద్వారా, రాత్రివేళ నిదర టైములో డ్రైవింగ్ చేయ కుండా ఉండటం వలన ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా ఇటువంటి ప్రత్యేక అమలు డ్రైవ్‌లు,రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిరంతరం కొనసాగుతాయని గుంటూరు జిల్లా పోలీసులు పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజాదర్బార్ ధ్యేయం

### చీఫ్‌విప్ జీ.వీ



**వినుకొండ,సెప్టెంబర్4,ప్రభాతవార్త:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సాధ్యమైనంత వేగంగా పరిష్కారం చూపడమే ప్రజాదర్బార్ ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం వినుకొండలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 28 అర్జీలను స్వీకరించారు. ప్రజాదర్బార్‌లో ప్రధానంగా తాగునీటి సరఫరా, కొత్త వాటర్ పైప్‌లైన్లు, లో వోల్టేజ్ సహా విద్యుత్ సమస్యలు, మున్సిపల్ మౌలిక వసతులు, భూ రికార్డులు, రీసర్వే,22ఎ/డిలీషన్ లిస్ట్,దివ్యాంగుల పెన్షన్, శ్మశానవాటికకు స్థలం తదితర సమస్యలపై అర్జీలు అందాయి. ఆయా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు వీలైనంత త్వరగా పరిష్కరించాలని జీవీ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో 60 మంది విద్యార్థులు ఉండగా తాగునీటి కొరత ఉందని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పి.రత్నకుమారి దృష్టికి తీసుకురావడంతో, సాధారణ నీటి సరఫరా పునరుద్ధరించే వరకు అవసరాన్ని పరిశీలించి ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అలాగే 17వ వార్డులో సుమారు 200 మీటర్ల వాటర్ పైప్‌లైన్/ట్యాప్ కనెక్షన్ ఏర్పాటు చేయాలన్న స్థానికుల విజ్ఞప్తిపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు. జీ.వీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ప్రజాదర్బార్‌లో తెలియజేసిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చింతపల్లిలో రూ.2 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం

### శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



**అచ్చంపేట, సెప్టెంబర్ 4 (ప్రభాత వార్త):** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. అచ్చంపేట మండలం చింతపల్లి గ్రామంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.అంతకుముందు వేల్పూరు, తాడువాయి గ్రామాల్లో సుమారు రూ.36 లక్షల చొప్పున నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం చింతపల్లిలో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ వైద్యం మరింత అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నూతన ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వస్తే చింతపల్లి, పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. చుక్కా రత్న మన్మోహన్ మాట్లాడుతూ చింతపల్లి పరిసర గ్రామాల ప్రజలకు ఈ ఆరోగ్య కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీపీ భూక్య స్వర్ణమ్మ రమేష్ నాయక్, అచ్చంపేట మండల టీడీపీ అధ్యక్షుడు నందిగ ఆశీర్వాదం, బత్తుల శ్రీనివాసరావు, అచ్చంపేట, మాదిపాడు పీహెచ్‌సీల వైద్యాధికారులు డా. జె. రాములు నాయక్, డా. వి. రాంబాబు నాయక్, డా. సీహెచ్. స్రవంతి, డా. జి. పూజిత, విస్తరణ అధికారి పి. వెంకటరావు, హెచ్‌వీలు ఎలిజబెత్, నాగమల్లేశ్వరి, మండలంలోని అన్ని సబ్‌సెంటర్ల ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**విజయపురిసౌత్ , సెప్టెంబర్ 04 , ప్రభాతవార్త.** విజయపురిసౌత్:ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ (బాలురు)నందు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఉదయం ప్రత్యేక ప్రార్థన,భక్తి గీతాలతో వేడుకలను ప్రారంభించారు.అనంతరం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.హేమాంబర రెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపకులు,సిబ్బంది సహకారంతో సంప్రదాయబద్ధంగా ఉన్న ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టిని కొట్టేందుకు పోటీపడడంతో కళాశాల ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ హేమాంబ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యమని తెలుపుతూ శ్రీకృష్ణుని బాల్య లీలలను విద్యార్థులకు తెలియజేసారు.

## శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి ఆలయంలో ఎంపీ,ఎమ్మెల్యే పూజలు



**గురజాల, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** పట్టణంలోని శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అభివృద్ధి కమిటి చైర్మన్ చీతిరాల సుబ్బారావు వారిని దుశ్శాలువలతో ఘనంగా సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఈవవో పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక వరలక్ష్మి వ్రతం



**గురజాల, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందించారు. ఆలయ కమిటి అధ్యక్షుడు కట్టమూరు గోవర్ధన్ అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు జరిపారు. అర్చకుడు సుబ్రహ్మణ్యేశ్వరశాస్త్రి ఆధ్వర్యాన అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధి కమిటి అధ్యక్షుడు చీతిరాల సుబ్బారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## మాడుగులలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి



**గురజాల, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** మండలంలోని మాడుగులలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం వేళ యాదవుల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిద్ధారపు గాంధీ యాదవ్ యూత్ సభ్యులు ఉట్టికొట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వైభవంగా రాధాకృష్ణుల విగ్రహ ప్రతిష్ట




గురజాల, సెప్టెంబరు 4 ప్రభాతవార్త : మండలంలోని దైద గ్రామంలో శ్రీరాధాకృష్ణమూర్తుల విగ్రహ, ధ్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు, మాచర్ల నియోజకవర్గ పరిశీలకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, పెదకూరపాడు పరిశీలకుడు యెనుముల మురళీధర్ రెడ్డి, కొమ్మినేని రవిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## చంగిస్‌ఖాన్‌పేటలో ఘనంగా జన్మాష్టమి వేడుకలు



**యడ్లపాడు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చారిత్రక ప్రదేశమైన చెంఘీసాఖాన్‌పేట గ్రామం లోని శ్రీ వెన్నముద్దల వేణుగోపాలస్వామి దేవాలయంలో జన్మాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూల అలంకరణతో పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన వెన్నపూస, మోడీ కారం, అటుకులను ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

## కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



**యడ్లపాడు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చెంఘీస్కాన్‌పేట గ్రామంలోని నవనీత బాలకృష్ణస్వామి ఆలయంలో కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ నవనీత బాలకృష్ణస్వామి (వెన్నముద్దల గోపాలకృష్ణస్వామి) ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు.కృష్ణాష్టమి సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌కు కొసనా ఆంజనేయులు, బసెల సత్యనారాయణ, అంబటి బ్రహ్మం, బసెల కృష్ణ మూర్తి, చాటరాజుపల్లి శ్రీనివాసరావు, గుమస్తా శ్రీనివాసరావు, ఆదిత్యతో పాటు ఆలయ కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు.

## పాల ఉత్పత్తిదారులకు రూ.5.62 లక్షల బోనస్ పంపిణీ



**యడ్లపాడు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** యడ్లపాడు గ్రామంలోని ఏఎంపీసీఎస్ పాల కేంద్రం, సంగం డెయిరీ ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ధరల వ్యత్యాసం (బోనస్) పంపిణీ కార్యక్రమాన్ని సొసైటీ అధ్యక్షుడు పోపూరి కృష్ణ, కల్లూరి రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పాల ఉత్పత్తిదారులకు రూ.100కు రూ.11 చొప్పున మొత్తం రూ.5,62,246 బోనస్‌ను పంపిణీ చేశారు. ఇందులో సంగం డెయిరీ రూ.1,32,000, యడ్లపాడు ఏఎంపీసీఎస్ పాల కేంద్రం రూ.4,30,246 అందించింది.కార్యక్రమానికి సంగం డెయిరీ డైరెక్టర్ పావులూరి శ్రీనివాసరావు, పల్నాడు జోన్-1 జోనల్ మేనేజర్ కాట్రా నరేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరై బోనస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం సంగం డెయిరీ అందిస్తున్న వెటర్నరీ సేవలు, సంక్షేమ పథకాలు, గేదెల బీమా తదితర సేవలను వివరించారు. బోనస్ అందుకోవడంతో పాల ఉత్పత్తిదారులు హర్షం వ్యక్తం చేసి, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్, పాలకవర్గ సభ్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చీఫ్‌విప్ జీ.వీ,డీసీసీబీ మక్కెన



**వినుకొండ,సెప్టెంబర్4,ప్రభాతవార్త:** శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో కొలువై ఉన్న శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవాలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, డీసీసీబీ మక్కెన మల్లికార్జునరావు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న జీవీ ఆంజనేయులు, మక్కెనలకు ఆలయ అర్చకులు,నాయకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు,అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి,వేద మంత్రోచ్ఛారణల మధ్య వేదాశీర్వచనం అందించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి ఆయన కొద్దిసేపు గడిపారు. శ్రీకృష్ణుని ఆశీస్సులతో వినుకొండ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో,ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు,కూటమి నాయకులు,కార్యకర్తలు,ఆలయ కమిటీ సభ్యులు,అర్చకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన పార్వతీదేవి ఆలయం



**యడ్లపాడు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా మండల పరిధిలోని బోయపాలెం గ్రామంలోని శ్రీ పార్వతీదేవి అమ్మవారి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.మహిళలు ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## వెంచర్ల అనుమతులపై అధికారుల ఆరా



**యడ్లపాడు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వెంచర్లకు సంబంధించిన అనుమతులపై రెవెన్యూ అధికారులు ఆరా తీస్తున్నారు. వెంచర్లలోని భూవిలకు నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయా, లేదా అనే అంశంపై అధికారులు పరిశీలన చేపట్టారు. గతంలో భూములను వ్యవసాయ భూముల నుంచి వ్యవసాయేతర భూములుగా మార్చిన అలా మార్చినట్లయితే ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు పూర్తిగా చెల్లించారా లేదా అనే అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు తహసీల్దార్ జై విజయశ్రీ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వెంచర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

## అమ్మ ఫౌండేషన్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు అర్హత

**రొంపిచర్ల, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:** గత 23 సంవత్సరాలుగా గుంటూరు, పల్నాడు జిల్లాల వ్యాప్తంగా నిస్వార్థ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్న అమ్మ ఫౌండేషన్ సేవలు ప్రభుత్వ గుర్తింపుతో పాటు ప్రతిష్ఠాత్మక అవార్డుకు పూర్తిగా అర్హమైనవని ఫౌండర్ అండ్ చైర్మన్ అట్లూరి విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం విలేరులతో మాట్లాడుతూ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను వివరించారు. నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా అమ్మ ఫౌండేషన్ నిరంతరం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. పేద కుటుంబాలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు గర్భిణీస్త్రీలకువైద్యసహాయం, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వలస కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి అండగా నిలిచినట్లు పేర్కొన్నారు.కరోనా మహమ్మారి సమయంలో నర్సులు, పోలీసులు, పారిశుధ్య కార్మికులకు మాస్కులు, శానిటైజర్లు, కూరగాయలు, భోజన సదుపాయాలు అందించి ఫౌండేషన్ మానవతా దృక్పథాన్ని చాటుకుందని విజయ్ కుమార్ తెలిపారు.అలాగే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, ఫీజుల సహాయం అందిస్తూ వారి విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నామని చెప్పారు. సమాజంలోని అణగారిన వర్గాల సంక్షేమం కోసం ఎటువంటి స్వార్థం లేకుండా 23 ఏళ్లుగా సేవలు కొనసాగిస్తున్న అమ్మ ఫౌండేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు లభించడంతో పాటు ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కాలని వారు ఆకాంక్షించారు.

## ఎంపీ లావు వ్యాఖ్యలు ఎంఆర్పీఎస్‌ను ఉద్దేశించినవి కాదు

**రొంపిచర్ల, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:** చిలకల వారిపేట రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించిన ఘనత ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకే దక్కుతుందని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరు కుమార్, టిడిపి సీనియర్ నాయకులు కొట్ట కిరణ్ అన్నారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. బాధితులకు చెక్కుల పంపిణీ సందర్భంగా ఎంపీ లావు చేసిన వ్యాఖ్యలు వైఎస్సార్‌సీపీ, ఇతర రాజకీయ పార్టీలను ఉద్దేశించినవేనని, ఎంఆర్పీఎస్‌ను ఉద్దేశించినవి కాదని స్పష్టం చేశారు. ఎంఆర్పీఎస్ నేతలు, మందా కృష్ణ మాదిగతో టీడీపీ గౌరవంగా వ్యవహరిస్తుందన్నారు.ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత ఇంజనీరింగ్ విద్య అందించడంతో పాటు ఎస్సీలనుపారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఎంపీ కృషి చేస్తున్నారని టీడీపీ ఎస్సీ సెల్ నేతలు తెలిపారు. ఈ సమావేశంలో దావల రవికుమార్, జీపీ కుమార్, గర్నెపూడి నాయుడు, కొత్తపల్లి జయరావు, సాయి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి లాజర్‌ను పరామర్శించిన బీసీ సంఘాల నాయకులు

### త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



**సత్తెనపల్లి (సెప్టెంబర్ 4, ప్రభాతవార్త):** ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ బాండెడ్ లేబర్ మెంబర్ చింతపల్లి లాజర్ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న సత్తెనపల్లి బీసీ సంఘాల నాయకులు శుక్రవారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా ప్రమాదంలో గాయపడిన లాజర్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ స్థితికి రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు చింకా అంకమ్మరావు, వీరాటం సైదారావు, గుంటూరు గోవిందు, కుమ్మరి దస్తగిరి, కే. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినుకొండలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



**వినుకొండ,సెప్టెంబర్4,ప్రభాతవార్త:** స్థానిక శ్రీ విజేత హై స్కూల్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులు చిన్ని కృష్ణుడు,రాధాదేవి వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ అలరించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి ప్రతిమ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో హాజరై సందడి చేశారు. పాఠశాల కరస్పాండెంట్లు కావూరి సాయికుమార్,ఆవులమంద బ్రహ్మయ్యలు శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు,విద్యార్థులు కలసి ప్రదర్శించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో పోటీపడి పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడం పట్ల పాఠశాల యాజమాన్యం విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించింది. ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, శ్రీకృష్ణ భగవానుడు చూపిన ధర్మ మార్గంలో పయనించాలని నిర్వాహకులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## ఎన్నికలలో ఓటుకు నోటు సంస్కృతి పోవాలి

### మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి



**నరసరావుపేట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త ::** ఎన్నికల లో ఓటుకు నోటు సంస్కృతి పోవాలని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి వ్యాఖ్యానించారు.శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు 1996లో ఓటుకి 50 రూపాయలు ఇచ్చి ఈ విష సంస్కృతిని ప్రారంభించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఏ ఎలక్షన్ లోనైనా ఓటుకు ..2000 ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జనరల్ ఎలక్షన్లో ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గానికి రూ.40 కోట్లు పెట్టి ఓట్లు కొంటున్నారని తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నియోజకవర్గాలలో 20వేల కోట్లు పెట్టి ఓట్లు కుంటున్నారని తెలియజేశారు. తాము ఖర్చుపెట్టిన డబ్బును తిరిగి రాబట్టుకునేందుకు ఎమ్మెల్యేలు మైనింగ్ ఇసుక, సిమెంట్ చివరకు టిటిడిని సైతం అవినీతి చేయాల్సిన పరిస్థితి దాపురించింది అన్నారు. ప్రలోభాలకు సీఎం చంద్రబాబు నాయుడు తెరతీసారని ఆయనే ఈ విషయ సంస్కృతిని ఆపాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కొరకు అన్ని రాజకీయ పార్టీలతో ఓటుకు నోటు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నుండి ఈ కార్యక్రమం చేయాలన్నారు. మీడియా సంస్థల సైతం ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు ఈ విష సంస్కృతి నుంచి బయటికి రా లేపోతే సమాజం విచ్ఛిన్నవుతుందని తెలియజేశారు. ప్రధానమంత్రి మోడీ కన్నా సీనియర్ అని చెప్పుకునే చంద్రబాబు తన అనువాన్ని ఓటుకు నోటును ఆపేందుకు ఉపయోగించాలని కోరారు. లేకుంటే భవిష్యత్ తరాలు చరిత్ర చంద్రబాబును నిలదీస్తాని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## గణేష్ మండపాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

### డీజేలకు అనుమతి లేదు

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

### సీఐ నాగమల్లేశ్వరరావు



**సత్తెనపల్లి (సెప్టెంబర్ 4, ప్రభాతవార్త):** వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని సత్తెనపల్లి టౌన్ సీఐ నాగమల్లేశ్వరరావు సూచించారు.గణేష్ మండపాల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల కోసం సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మండపాల నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.వినాయక నిమజ్జనం సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతి లేదని సీఐ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిమజ్జన ఊరేగింపును రాత్రి 10 గంటలలోపు పూర్తి చేయాలని సూచించారు.ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించి వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ నాగమల్లేశ్వరరావు కోరారు.

## కృష్ణ నామస్మరణతో సత్తెనపల్లిలో ఆధ్యాత్మిక శోభ

### చలువాది చిన్న సత్యనారాయణ గృహంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**సత్తెనపల్లి (సెప్టెంబర్ 4, ప్రభాతవార్త):** శ్రీకృష్ణుడి నామస్మరణతో సత్తెనపల్లి పట్టణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సీనియర్ న్యాయవాది, ఆర్ఎస్ఎస్ సత్తెనపల్లి శాఖ సంఘ్ చాలక్ చలువాది చిన్న సత్యనారాయణ గృహంలో శుక్రవారం చలువాది హేమలత పూజా సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.కృష్ణ నామస్మరణతో మనస్సుకు ప్రశాంతత, భగవద్గీత బోధనలతో జీవితానికి మార్గదర్శకత్వం లభిస్తుందనే ఆధ్యాత్మిక సందేశాన్ని చాటేలా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత నగర సంకీర్తన నిర్వహించగా, భక్తులు కృష్ణ నామస్మరణ చేస్తూ భక్తిభావాన్ని చాటారు. అన్నం వెంకట రమణ, వాసు ఆధ్వర్యంలో భక్తి సంకీర్తనలు ఆలపించారు.అనంతరం భగవద్గీత పారాయణం, విష్ణు సహస్రనామ పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీత సారాన్ని జీవితంలో ఆచరించడమే కృష్ణాష్టమి వేడుకల అసలైన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు.శ్రీకృష్ణుడి లీలలు, ధర్మ పరిరక్షణ, భక్తి, ప్రేమ, కర్తవ్యనిష్ఠ వంటి తత్వాలను గుర్తు చేసుకుంటూ భక్తులు కృష్ణ లీలల పాటలను ఆలపించారు. అనంతరం భక్తులకు పది రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో న్యాయవాదులు, భక్తులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.



5PLD 7fff.qxd:5PLD 7.qxd 01/01/2001 10:39 Page 1





# పల్నాడు జిల్లా వార్త

## ఘనంగా సీతారామ ఆలయంలో కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు

**విజయపురిసౌత్ సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** :ప్రతి ఏటా జరుపుకునే శ్రీకృష్ణాష్టమి వేడుకలను శ్రీ సీతారామాలయంలో ఆలయ కమిటీ సభ్యు లుకనుల పండుగగా నిర్వహించారు .సీతారావ ాల్నాయలో సాయంత్రం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఆలయ పూజారి గుడిపుడి బ్రహ్మాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమన్నీ ప్రారంభించరు.గ్రామంలోని చిన్నారు లు,యువకులు,మహిళలు ఉత్సాహంగా భారీ ఎత్తున ఉట్టి కొట్టడానికి పోటీపడ్డారు.ఈపోటీలో ఉట్టి కొట్టిన విజేత అయిన ఎన్.హార్షిత్ డిగ్రీ కళాశాల విద్యార్థి కు ఆలయ కమిటీ చేతులు మీదుగా 2116 రు.లు .కమిటీ మెంబర్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు సెక్రటరీరావ ాంజనేయులు,నర్సిం మూర్తి, కృష్ణమూర్తి,సత్తిబాబు,పవన్ కుమార్,సా యి రాం,బాలస్వా మి,నరసి ంహులు, చిట్టి, భజన బృందం,గ్రామస్తులు మొదలగువారు పాల్గొన్నారు.

## కాకతీయ కళ్యాణ మండపం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి

### ఆచూకీ తెలిసిన వారు సత్తెనపల్లి టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలి



**సత్తెనపల్లి (సెప్టెంబర్ 4, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణం లోని కాకతీయ కళ్యాణ మండపం వద్ద 03092026 తేదీన సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతుడి వివరాలు, చిరునామా తెలియరాలేదు.పై ఫోటోలో ఉన్న వ్యక్తి గురించి తెలిసిన వారు, కుటుంబ సభ్యులు లేదా బంధువుల ఆచూకీ తెలిసిన వారు సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.సమాచారం తెలిసిన వారు 9440796230 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని సూచించారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్ల సెంటర్ ప్రారంభించిన చీఫ్‌విప్ జీవీ,ఎమ్మెల్యే రాము



**వినుకొండ, సెప్టెంబర్4,ప్రభాతవార్త:** పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కరెంటు ట్రాన్స్ ఫార్మర్ల రిపేర్ల కేంద్రాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యేజీవీ ఆంజనేయులు,గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాముతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ వ్యవసాయ,గృహ అవసరాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూసేందుకే ఈ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ట్రాన్స్ ఫార్మర్లు పాడైపోతే వేగంగా మరమ్మతులు చేసి రైతులకు,ప్రజలకు తక్షణమే రీప్లేస్‌మెంట్ అందించేందుకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతు ందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు,కూటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**కారంపూడిసెప్టెంబర్4,ప్రభాతవార్త:** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం వేడుకలు శుక్రవారం మండ లంలో ఘనంగా జరిగాయి. పేటసనిగండ్ల, ఇనుప రాజు పల్లె, చిన్న కోదమగుండ్ల, కార ంపూడిలో వేడుకలు జరిగాయి. కారంపూడి లోని గాంధీ బొమ్మ సెంటర్లో ఉట్టి కొట్టే కార్య క్రమాన్ని నిర్వహిం చారు. ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తొలగించారు. గ్రావ ాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి పూజలు



**మాచర్ల రూరల్ సెప్టెంబర్4,ప్రభాతవార్త:** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. జమ్మలమడక. రాయవరం. కంభంపాడు. కొత్తపల్లి. గన్నవరం. శ్రావణ మాసంలో ఆత్రు తగా చూసే ఒక ఆధ్యాత్మిక ఆనందంతో కూడిన వేడుక శ్రీకృష్ణ పరమాత్ముడు భూమిపై అవత రించిన పవిత్రమైన పర్వదినం శ్రీకృష్ణ జన్మాష్టమి... కృష్ణం వందే జగద్గురుమ్ అని, కన్నయ్య, గోపయ్య అంటూ రకరకాల నామాలతో స్మరిస్తూ, స్తుతిస్తూ భక్తులు భక్తిపారవశ్యంలో పరవశించి పోతా రు. అలాంటి శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని దేశవ్యాప్తంగా శుక్రవారం పిల్లలు, పెద్దలు ఆనందోత్సవాలు, భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజామునే అభ్యంగన స్నానాలు ఆచరించి, ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలతో అలంకరించారు. ఇల్లంతా రంగవల్లులు, కన్నయ్య నడిచి వస్తాడని భావించి బాలకృష్ణుని పాదాలు వేసి అందంగా తీర్చిదిద్దారు. శ్రీకృష్ణ పరమాత్మునికి తులసి మాలలు, పారిజాత పుష్పాలతో పూజల నిర్వహించి ఆవు పాలు నైవేద్యం, పాలు, పెరుగు, వెన్న, మీగడ, అటుకులు బెల్లం సమర్పించారు. ఇంటిలోని చిన్నారులకు బాలకృష్ణుడు, గోపికల అవతారాలు వేసి, తమ పిల్లలలో కన్నయ్యను చూసుకుంటూ ముచ్చట తీర్చుకున్నారు.

## తాళ్లపల్లిలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**మాచర్ల రూరల్ సెప్టెంబర్4,ప్రభాతవార్త:** మాచర్ల: నియోజ కవంగంలోని తాళ్లపల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యర్రగొర్ల సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహి ంచిన ఈ వేడుకలకు బీజేపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్, అసెంబ్లీ బీఎల్ఏ1 నాసరయ్య జీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడు కలను ప్రతి ఏటా వైభవంగా నిర్వహిస్తున్న తాళ్లపల్లి గ్రామస్తులను అభినందించారు. యువత సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ ముందుకు తీసుకెళ్లడంతో పాటు రాజకీయ చైతన్యం పెంపొ ందించుకోవడం, విద్యా, ఉద్యోగ రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించడం అభినం దనీయమన్నారు.కార్యక్రమంలో కృష్ణ, బీజేపీ జిల్లా కార్యదర్శి గంజర్ల ఆదిలక్ష్మి, ఎస్ఐఆర్ కన్వీనర్ గొబ్బూరి శ్రీనివాస్ నాయుడు, గుమ్మ శ్రీనివాస్, పీవీఆర్ యాదవ్, పేర్ల గురుస్వామి, ఎండపల్లి సుబ్బారావు తదితరులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## మూగజీవికి ఆపన్నహస్తం.. ఎస్సై కిషోర్ మానవత్వం



**నరసరావుపేట క్రైమ్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త ::** ఒక వైపు విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే పోలీ సు అధికారి.. ఆపదలో ఉన్న లేగ దూడను చూసి చలించిపోయారు. స్థానిక పెద్ద చెరువులో గాయాలతో నడవలేని స్థితిలో ఉన్న లేగదూడకు అండగా నిలిచి చికిత్స చేయించిన నరసరావుపేట రూరల్ ఎస్సై సీహెచ్ కిషోర్ మానవత్వాన్ని చాటుకున్నారు.కొంతకాలంగా ప్రమాదంలో గాయపడి నడవలేక ఇబ్బందులు పడుతున్న లేగదూడను ఎస్సై కిషోర్ గుర్తించారు. వెంటనే దానికి చికిత్స అందించేందుకు చొరవ తీసుకున్నారు. నరసరావుపేట పశుసంవర్ధక శాఖ ఏడీ రామచంద్రరావు సూచనలతో మొలకలూరు పశుసంవర్ధక శాఖ వైద్యుడు శ్రీధర్‌రెడ్డితో లేగదూడకు వైద్యం చేయించారు.చికిత్స అనంతరం లేగదూడను గోశాలకు తరలించి, అక్కడే సంరక్షణతో పాటు వైద్యం కొనసాగించేలా చర్యలు చేపట్టారు. పోలీసు విధుల్లో కఠినంగా వ్యవహరిస్తూనే ఆపదలో ఉన్న మూగజీవిపై జాలి చూపించి, దాని ప్రాణాలను కాపాడేందుకు స్వయంగా చొరవ చూపిన ఎస్సై కిషోర్ తీరుపై స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.విధి నిర్వహాలోనేకాదు..మానవత్వంలోనూ ముందుండాలన్న సందేశాన్ని ఎస్సై కిషోర్ చాటుకున్నారని స్థానికులు ప్రశంసిస్తున్నారు.

## మాచర్ల నియోజకవర్గంలోని నాలుగు ఆలయాలకు రూ.1.60 కోట్ల శ్రీవాణి ట్రస్టు నిధులు

**మాచర్ల టౌన్ సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** మాచర్ల నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో దేవాలయాల నిర్మాణాలకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వారి శ్రీవాణి ట్రస్టు ద్వారా భారీగా నిధులు మంజూరయ్యాయి.ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ,ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలోని నాలుగు దేవాలయాల నిర్మాణాలకు ఒక్కో ఆలయానికి రూ.40 లక్షల చొప్పున మొత్తం రూ.1 కోటి 60 లక్షల నిధులు మంజూరు చేశారు.రెంటచింతల మండలం మంచికల్లు గ్రామంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నిర్మాణానికి రూ.40 లక్షలు,మాచర్ల మండలం పశువేముల గ్రామంలోని శ్రీ సంతు సేవాలాల్ స్వామి దేవాలయం నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయి.అదేవిధంగా వెల్దుర్తి మండలం బోదిలవీడు గ్రామంలోని శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానం నిర్మాణానికి రూ.40 లక్షలు,వెల్దుర్తి మండలం పట్లవీడు గ్రామంలోని శ్రీ రామాలయం నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించారు.దీంతో మాచర్ల నియోజకవర్గంలోని నాలుగు ఆలయాల నిర్మాణాలకు శ్రీవాణి ట్రస్టు ద్వారా మొత్తం రూ.1.60 కోట్ల నిధులు అందుబాటులోకి రానున్నాయి. నిధుల మంజూరుతో ఆయా గ్రామాల్లో దేవాలయాల నిర్మాణాలు మరింత వేగవంతం కానున్నాయని భక్తులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఏఎం రెడ్డి విద్యాసంస్థలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**నకరికల్లు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:** ఏ.ఎం. రెడ్డి విద్యాసంస్థల (అటానమస్)లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థల కార్యదర్శి డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి హాజరై విద్యార్థులకు శ్రీకృష్ణుని సందేశాలను వివరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో యువత పాత్ర ఎంతో ము ఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు సంస్కృతి, విలువలను అలవరచుకోవాలని సూ చించారు.జన్మాష్టమి సందర్భంగా విద్యార్థులకు శ్రీకృష్ణుని జీవితంపై క్విజ్ పోటీలు, ఉట్టి కొట్టడం, వివిధ వినోదభరిత ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యా ర్థులు కృష్ణుడు, రాధ పాత్రల్లో పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. మల్లికార్జున, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవభూషణరావు, డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. కృష్ణారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు.క్విజ్ పోటీలు, ఉట్టి కొట్టడం, ఇతర ఆటల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ముఖ్య అతిథి డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థుల ఉత్సాహభరితమైన పాల్గొనడంతో కళాశాల ఆవరణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వాతావరణంతో కళకళలాడింది.

# ప్రతి పేదవాడి ఇంటికి మంచినీటి సరఫరా లక్ష్యం

### నరసరావుపేట ఎంపీ లావు





**గురజాల, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** ప్రతిపేద వాడికి కుళాయి ద్వారా మంచినీటిని అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం రూ.27.20 కోట్ల అమృత్ 2.0 నిధులతో సమగ్ర మంచినీటి అభివృద్ధి పథకానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నాగార్జున సాగర్ కుడికాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, యరపతినేని నిఖిల్, ఆర్డీవో మురళికృష్ణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లావు, ఎమ్మెల్యే యరపతినేనిలు మాట్లాడుతూ నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో ప్రతి గ్రామం, ప్రతి మున్సిపాలిటికి మంచినీరు అందించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అమృత్ 2.0 ద్వారా సుమారు రూ.27 కోట్ల నిధులు సమకూరాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి చేసి చూపడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జవిృగుంపుల లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ బడేజాని, తహసీల్దార్ కుటుంబరావు, మున్సిపల్ కమిషనర్ శివన్నారాయణ, బొల్లయ్య, ఆకుల పిచ్చయ్య గుప్తా, అడపా శ్రీనివాసరావు, నవులూరి శ్రీరామ్మూర్తి, శరమాల హనుమంతురావు, పోటు నాగేశ్వరరావు, అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌పీ కాలువ,మంచినీటి చెరువు పరిశీలన

### మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మధుసూదనరావు, టీడీపీ నాయకుల సందర్శన



**సత్తెనపల్లి (సెప్టెంబర్ 4, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలువతో పాటు గార్లపాడు రోడ్డులో ఉన్న మంచినీటి చెరువును శుక్రవారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ డీఈ మధుసూదనరావు, టీడీపీ నాయకులు సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా కాలువ, మంచినీటి చెరువు పరిస్థితులను పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సంబంధిత మున్సిపల్ సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు దరువూరి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి నూర్‌భాషా జానీబాబు, పట్టణ తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మారెళ్ల రామాంజనేయులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేస్తే కూటమికి భారీ విజయం ఖాయం

### - ఎమ్మెల్యే డా. చదలవాడ



**నరసరావుపేట టౌన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త ::** స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు సన్వయంతో పనిచేయాలని మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింబాబు తెలిపారు. శుక్రవారం గుంటూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహి ంచిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అక్టోబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందని, మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించే అకాశం ఉందని తెలిపారు. పార్టీలో గ్రూపురాజకీయాలకు తావులేకుండా నో మిస్‌ఫైర్.. నో క్లాష్ నినాదంతో కూటమి నేతలు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని మంత్రి సూచించినట్లు చెప్పారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ప్రతిపక్షాల విర్శలకు వాస్తవాలతో సమాధానం ఇవ్వాలని లోకేష్ సూచించారని తెలిపారు. కష్టపడి పనిచేసే కార్యర్తలకు భవిష్యత్తులో తగిన గుర్తింపు కల్పిస్తామని, మై టీడీపీ యాప్ ద్వారా చురుగ్గా పనిచేసే వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు అరవిందబాబు వెల్లడించారు.కూటమి పార్టీలన్నీ సమన్వయంతో పనిచేస్తే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ సాధించడం ఖాయమని ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద్ బాబు ధీమా వ్యక్తం చేశారు.

## పల్నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా జెల్ది విజయప్రసాద్ ఎంపిక

### ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి అవార్డు



**సత్తెనపల్లి (సెప్టెంబర్ 4, ప్రభాతవార్త):** సెప్టెంబర్ 5న నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా సత్తెనపల్లి మండలం కంకణాల పల్లి దళితవాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యా యుడిగా పనిచేస్తున్న జెల్ది విజయప్రసాద్ ఎంపిక య్యారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నెల 5న నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవ వేడు కల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విజయప్రసాద్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందు కోనున్నారు.గత 18 సంవత్సరాలుగా వివిధ మండలాల్లో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న తనకు ఈ గుర్తింపు లభించడం ఎంతో సంతోషంగా ఉందని విజయ ప్రసాద్ తెలిపారు. తన ఎంపికకు సహక రించిన సత్తెనపల్లి మండల విద్యాశాఖాధికారి ఎ. శ్రీనివాసరావు, ద్వితీయ విద్యా శాఖాధికారి ఎ. రాఘవేంద్రరావుకు కృతజ్ఞతలు తెలిపాం. విజయప్రసాద్‌ను ఎఐఎస్‌టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్. జోసెఫ్ సుధీర్‌బాబు, పల్నాడు జిల్లా ఎస్టీయూ అధ్యక్షులు ఎల్.వి. రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ. ఏమండి, ఆర్థిక కార్యదర్శి ఎస్.కె. మహబూబ్ సుభాని (సుబ్బు), ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ బి. సత్యన్నారాయణరాజు, జిల్లా ఉపాధ్యక్షులు బుర్రి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి తురకా రాజు, సత్తెనపల్లి ఏరియా కార్యదర్శి వల్లూరి నాగరాజు, సత్తెనపల్లి మండల గౌరవ అధ్యక్షులు మోదుగుల అప్పారావు తదితరులు అభినందనలు తెలిపారు.

## ఇంటర్ సీటీ ఎంప్లాయిస్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించి ఎంపీ లావు, ఎమ్మెల్యే యరపతినేని



**పిడుగురాళ్ల, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** ఇంటర్‌సిటి ఎంప్లాయిస్ ట్రైన్‌కు పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో నూతనంగా స్టాప్ ఇవ్వడంతో శుక్రవారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తిలు జెండా ఊపి ప్రారంభించారు. లింగంపల్లి నుంచి బయలుదేరే ఎంప్లాయిస్ ఎక్స్‌ప్రెస్ పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో కూడా ఆగే విధంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కృషి చేశారు. ఉదయం 4:40 గంటలకు లింగంపల్లి నుంచి బయలుదేరి పిడుగురాళ్లకు 8:05 గంటలకు చేరుకుంటుందన్నారు. అలాగే విజయవాడులో సాయంత్రం 5:30 గంటలకు బయలుదేరి రాత్రి 7:04 గంటలకు పిడుగురాళ్లకు చేరుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ట్రైన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**మాచర్ల టౌన్ సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** అలుగురాజుపల్లిలోని న్యూటన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటు కున్నారు.ప్రధానంగా ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా,సందడిగా ఉట్టి కొట్టి శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థుల ఉత్సాహం,కేరింతలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది.ఈ కార్యక్రమంలో సంస్థ కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ జున్నా చంద్రశేఖర్ రెడ్డి,ప్రిన్సిపాల్ డా.ఎస్. నరసింహారావు,వైస్ ప్రిన్సిపాల్ బి. నరసింహారావు,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీ ఖాసిం,వివిధ విభాగాల హెచ్ ఓ డి లు,అధ్యాపకులు,విద్యా ర్థులు పాల్గొన్నారు.కళాశాలలో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సంప్రదాయాలు,సంస్కృతిపై అవగాహన పెంపొందుతుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

## ప్రజా వేదికలో 27 ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే



**నరసరావుపేట, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నరసరావుపేట ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసరప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహి ంచారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే 27 అర్జీలను స్వయంగా స్వీకరించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు కల్పించాలని, సీసీ రోడ్లు నిర్మించాలని, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం పరిష్కరించేందుకు అవకాశం ఉన్న సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు.నాగార్జున సాగర్ కుడి కాలువ నుంచి నీటి విడుదల జరుగుతున్న నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని చెరువులు, కుంటలను సాధ్యమైనంత మేరకు నీటితో నింపేలా చర్యలు చేపట్టాలని ఎన్ఎస్‌పీ, ఆర్‌డబ్ల్యూఎస్, మైనర్ ఇరిగేషన్‌శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాబోయే రోజుల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు సూచించారు.

**తిలక్ స్కూల్‌లో శానిటేషన్ డ్రైవ్ ..**

ప్రకాశ్‌నగర్‌లోని తిలక్ స్కూల్ ఆవరణలో శుక్రవారం శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కార్యక్రమంలో పాల్గొని పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు పారిశుద్ధ్య చర్యలను నిరంతరం కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల, పారిశుద్ధ్య సిబ్బంది, కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు

## జూనియర్ నేషనల్ అక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌కు పల్నాడు జిల్లా క్రీడాకారులు



**రొంపిచర్ల, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** 52వ జూనియర్ నేషనల్ అక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున వాటర్ పోలో విభాగంలో ప్రాతినిధ్యం వహించేందుకు పల్నాడు జిల్లాకు చెందిన ఆర్. లోహిత్, కె. రుద్ర ప్రతాప్ సైదులు రెడ్డి ఎంపికయ్యారు. సెప్టెంబర్ 7 నుంచి 12వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జాతీయ స్థాయి వాటర్ పోలో ఛాంపియన్‌షిప్ జరగనుంది.ఆంధ్రప్రదేశ్ స్విమ్మింగ్ అసోసియేషన్ సమక్షంలో, పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నరరావుపేటలోని ఎస్ఎస్అండ్ఎన్ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ వాటర్ పోలో శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచి వీరు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఏపీ స్విమ్మింగ్ కోచ్ సురేష్ జి మార్గదర్శకత్వంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు.లోహిత్, రుద్ర ప్రతాప్ ఎంపిక వారి కఠోర శ్రమ, క్రమశిక్షణకు నిదర్శనమని పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి. సుబ్బారెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఎంపికైన క్రీడాకారులకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

# కోలాహలంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

### భక్తులతో కిక్కిరిసిన ఇస్కాన్ మందిరం



**నరసరావుపేట టౌన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త ::** స్థానిక బరంపేట లోని ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మందిరం ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. బాలకృష్ణుని వేషధారణలో అనేకమంది చిన్నారులను తీసుకొని తల్లిదండ్రులు మందిరానికి తరలి రాటంతో ఎటుచూసినా సందడి వాతావరణం కనిపించింది. వేకువ ఝాము నుంచే ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రారంభమై నాయి. తొలుత తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు శుభ మంగళ హారతితో ప్రారంభమై శుభ దర్శన హారతి, భాగవత ప్రవచనం, మహా హరినామ సంకీర్తన కార్యక్రమాలను నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం భక్తుల కోలా హలం మధ్య ఉట్లోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. యువకులు ఉట్టి కొట్టటానికి పోటీప డ్డారు. అనంతరం 58 రకాల ద్రవ్యాలచే ఉత్సవవ మూర్తులకు మహా శంఖాభిషేకం నిర్వహించారు కాకుండా 108 రకాల భక్షాలచే స్వామివారికి మహారాజ భోగ నివేదన నిర్వహించా రు. భక్తులు ఈ కార్యక్రమాలన్నింటిలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. మందిరం ఉపాధ్యక్షులు వైష్ణవప్రభు కార్యక్రమాలన్నింటిని పర్యవేక్షించారు.

## వశిష్ఠ కళాశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**రొంపిచర్ల,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త ::** నరసంావుపేట పట్టణం రెడ్డి నగర్ లోని వశిష్ఠ జూనియర్ కళాశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. కళాశాల ప్రిన్సిపల్ సూదా సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారని తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి హిందూ ధర్మంలో అత్యంత పవిత్ర పర్వదినమన్నారు.కళాశాల చైర్మన్ మద్దుల కోటేశ్వరరావు, డైరెక్టర్ మద్దుల నరేష్ కుమార్ మాట్లాడుతూ దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం, మానవాళికి భగవద్గీత ద్వారా ధర్మమార్గాన్ని బోధించేందుకు శ్రీకృష్ణుడు అవతరించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు నర్రా శేషగిరి, నల్లపాటి శ్రీకాంత్, భవిరిశెట్టి మదనరాజా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## 13న రేపల్లె రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు



**రేపల్లె, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** రేపల్లె సబ్ బ్రాంచ్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నికలను ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు బ్రాంచ్ అధ్యక్షుడు,రేపల్లె మండల తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావు తెలిపారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2026-2029 కాలపరిమితికి సంబంధించి 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నికల ద్వారా ఎన్నుకోవాల్సి ఉందని చెప్పారు.సొసైటీకి చెందిన పాట్రన్ మెంబర్లు,వైస్ పాట్రన్ మెంబర్లు,లైఫ్ మెంబర్లు తమ గుర్తింపు కార్డులతో ఎన్నికల కేంద్రంలో తమ హక్కు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## పట్టణంలో పేదలకు అన్నదానం



**రేపల్లె, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** రేపల్లె పట్టణంలోని శ్రీ వాసవి సేవా మహిళా మండలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అమృతధార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని 80 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమృతధార కార్యక్రమం ద్వారా దాతల సహకారంతో అన్నార్తుల ఆకలి తీర్చుతున్నామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మెడతాటి జ్యోతి, పి.గౌరీ రామకుమారి, సిహెచ్.ఒదుమతి, ఎం.విజయ,కె.కృష్ణకుమారి,ల క్ష్మి,సుబ్రహ్మణ్యం, నాగలక్ష్మి, అన్నపూర్ణ, వి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ క్రీడల్లో బాపట్లకు రాష్ట్రస్థాయి ట్రోఫీ

### లాన్ టెన్నిస్ విజేతగా సీఐ రాంబాబుమెడల్‌తో సత్కరించిన జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, సెప్టెంబరు 4: ప్రభాతవార్త,ప్రతినిధి:



మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ ప్రాంగణంలో ఈ నెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జరిగిన ఖ1వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్-2026ఖ పోటీల్లో బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ప్రతిభ చాటింది. లాన్ టెన్నిస్ సింగిల్స్ విభాగంలో బాపట్ల టౌన్ సీఐ ఆర్.రాంబాబు విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. విజయం సాధించిన సీఐ రాంబాబు శుక్రవారం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, మెడల్‌తో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన ఎస్ఐ, ఆర్ఎస్ఐ, సీఐ స్థాయి అధికారులతో కూడిన 20 మందికి పైగా క్రీడాకారులు ఈ విభాగంలో పోటీపడగా, వారిపై ఆధిపత్యం ప్రదర్శించి విజేతగా నిలవడం జిల్లా పోలీస్ శాఖకు గర్వకారణమన్నారు. సీఐ రాంబాబు



రాబోయే రోజుల్లో జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షి ంచారు. నిరంతర విధి నిర్వహణలో ఒత్తిడి ఎదుర్కొనే సిబ్బందికి క్రీడలు మానసిక ప్రశాంతతను, శారీరక దృఢత్వాన్ని అందిస్తాయన్నారు, ప్రతీ ఒక్కరూ ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన సీఐ రాంబాబును పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందించారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**భట్టిప్రోలు (రేపల్లె), సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** భట్టి ప్రోలులోని సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.గోపూజ,పారాయణం,కోలాటం,ఉట్టి కొట్టే కార్యక్రమాలు భక్తులను అలరించాయి.శ్రీకృష్ణ పరమాత్ముడు అందించిన ఆధ్యాత్మిక జ్ఞాన సంపద,యోగ విద్య రహస్యాల గురించి సాధన మండలి అధ్యక్షురాలు అరుణ కుమారి వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు బాల గోపాల భజన మండలి నిర్వాహకులు మాతా కాన్వెంట్ విద్యార్థినులతో కోలాట ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కెఎన్‌వి రవితేజ,కె.సంధ్యారాణి,యశోద,పి.దేవసేన ఆండాళ్ళు,కె.హేమలత,బి.జ్యోతిర్మయి,ఎ.సునీత,జె.శంకరరావు,సిహెచ్.బాబు, వి.చలమయ్య,సిహెచ్. రామకోటేశ్వరరావు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం

**నిజాంపట్నం, సెప్టెంబరు 4, ప్రభాతవార్తః** రైతు సమస్యలను పరిష్కరించటంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఘోరంగా



విఫలమైందని వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహనకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని అడవులదీవి వద్ద ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద కొబ్బరికాయ కొట్టి పాదయాత్రను ఆయన ప్రారంభించారు. గరువుపాలెం, కూచినపూడి, బొర్రావారిపాలెం, కేసనవారిపాలెం, అచ్యుతపురం మీదుగా మట్లపూడి వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుకు నీరురాక రైతులు ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. రైతు సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు చిత్రాల ఓబేదు, మదన్, రాంబాబు, మాజీ సర్పంచ్‌లు కొక్కిలిగడ్డ రవి, యేమినేని రాంబాబు, శ్రీనివాసరావు, సాయి, శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


## బాపట్లలో వైభవంగా శ్రీ రుక్మిణీ సమేత పాండురంగ స్వామి వారి కృష్ణాష్టమి వేడుకలు



**బాపట్ల, సెప్టెంబర్ 4., ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక చీలు రోడ్డులోని రుక్మిణి సమేత పాండురంగ స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు స్వామివారికి విశేష గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచామృతాభిషేక మహోత్స వాలను శాస్త్రోక్తంగా జరిపారు.అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేసి, నైవేద్య సమర్పణ, నీరాజనం, మంత్రపుష్ప కార్యక్రమాలను అర్చకులు అత్యంత కన్నులపండువగా నిర్వహించారు. ఈ విశేష పూజల్లో ఉభయదాతలుగా అనసూయ దేవి, ఆమె కుమార్తె వ్యవహరించారు.ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని తరించారు. అనంతరం విచ్చేసిన భక్తజనానికి తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యులు, చంద్ర శ్రీ మణికంఠ. భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి ప్రత్యేక పూజలు

**తెనాలి మున్సిపాలిటీ సెప్టెంబర్ 4(ప్రభాతవార్త):** శ్రీ కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, శుక్రవారం పట్టణంలోని పలు కృష్ణాలయాల్లో శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగానమ్మపేట లోని శ్రీకృష్ణ మందిరం వద్ద సమాధి బాలకృష్ణ, సమాధి మహేష్ బ్రదర్స్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని శ్రీ స్వామి వారిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనం పొందారు. అనంతరం రైల్వే స్టేషన్ వద్ద గల చిన్ని కృష్ణ మందిరం వద్ద ప్రత్యేక పూజలు పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా నాజరు పేట లోని శ్రీ మహాలక్ష్మీ చెట్టు మందిరం వద్ద శ్రావణమాసం నాలుగవ శుక్రవారం సందర్భంగా, శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,శ్రీ మహాలక్ష్మి అమ్మవారి అనుగ్రహం వల్ల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని,అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని,ప్రతి ఒక్కరూ ఈ పండుగను ఆనందంగా జరుపుకోవాలని, పాడిపంటలు సుఖసంతోషాలతో ప్రజలందరినీ,



ఆ మహాలక్ష్మీ అమ్మవారు దీవించాలని కోరుకుంటున్నానన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి వెంట పలువురు పార్టీ శ్రేణులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద ముస్లీం విద్యార్థులకు ప్లేట్లు,గ్లాసులు పంపిణీ



**రేపల్లె, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** పురపాలక సంఘంలోని 26వ వార్డు మదర్సా పాఠశాలలో శుక్రవారం కొండపల్లి పార్వతి ఛారిటబుల్ ట్రస్ట్ తరపున 40 మంది విద్యార్థులకు ప్లేట్లు,గ్లాసులను చైతన్య వేదిక అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సమాజానికి సేవ చేస్తే భగవంతునికి సేవ చేసిన ప్రతిఫలం లభిస్తుందని చెప్పారు.భగవద్గీత,ఖురాన్,బైబిల్‌లో పేర్కొన్నట్లు తోటివారిని ఆదుకోవాలని ఆయన సూచించారు.మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులకు,తల్లిదండ్రులకు కీర్తి తీసుకురావాలని విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమంలో బాపట్ల దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు వాగోలు బాబూరావు,షేక్ జమీర్,కన్నా నటరాజ్,గాలి సురేష్‌బాబు,షేక్ కరీముల్లా,ఇమామ్,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**కొల్లిపర, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** శ్రీకృష్ణాష్టమి వేడుకలను మండలంలో కన్నుల పండువగా నిర్వహించారు. మండలంలోని తూములూరు, చివలూరు, పిడపర్రు, వల్లభాపురం, దావు లూరు,అత్తోట యాదవపాలెంతో పాటు వివిధ గ్రామాల్లో భక్తి శ్రద్దలతో శ్రీకృష్ణుడుని ప్రత్యేకంగా ఆలంకరించి పూజలు చేసారు.మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి





భూదేవి సమేత శ్రీజనార్ధన స్వామి దేవస్థానంలో అర్చకులు పరాశరం జగన్నా ధాచార్యులు శ్రీకృష్ణాష్టమి వేడుకలు పురస్కరించి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు.మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసారు.అదేవిధంగా శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిపారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**తెనాలి సెప్టెంబర్ 4(ప్రభాతవార్త):** బాపట్ల జిల్లా, వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలంలోని స్వర్ణ చిలుమూరులో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో తెనాలి రోటరీ క్లబ్ ఆఫ్ ఆంధ్ర ప్యారిస్ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ, బాపట్ల పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు కనగాల మధు సూదన్ ప్రసాద్ పాల్గొని ఉచిత శిబిరాన్ని ప్రారంభించారు. మధుసూదన్ ప్రసాద్ మాట్లాడుతూ మెలబంటి వేణు కిషోర్ పరుచూరి కొండలరావు సహకారంతో డాక్టర్



ఎల్ వి ప్రసాద్ ఐ ఇనిస్ట్యూట్ వారిచే ఈ శిబిరాల నిర్వహించారన్నారు. ఈ శిబిరంలో వయసుతో నిమిత్తం లేకుండా అందరికీ కంటి పరీక్షలు చేయబడతాయన్నారు. 65 ఏళ్ల పైబడిన వారికి కళ్ళజోళ్ళు తక్కువ ధరకు ఇస్తారన్నారు. శుక్లం ముదిరిన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ కూడా చేయబడుతుందన్నారు. చిలుమూరు గ్రామ ప్రజలు నేత్ర శిబిరానికి విచ్చేసి తమ నేత పరీక్షలు చేయించుకుని మీ కంటి చూపును కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిస్టిక్ 3150 మాజీ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్, నల్లూరి వెంకటేశ్వరరావు, కాసరనేని మోహన్, సాతా సుధాకర రావు, చిలుమూరు మాజీ వైస్ సర్పంచ్ గాలి అబ్రహం, మాజీ ఎంపీటీసీ కొప్పుల మోహన్ బాబు, మాజీ సర్పంచ్ కోట నరేష్, టిడిపి కార్యకర్తలు ధూళిపూడి చింతయ్య చందు సూర్యనారాయణ కంకిపాడు రాంబాబులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

## నేడు రేపు ఓటర్ల నమోదుకు అవకాశం

**వేమూరు,సెప్టెంబర్ 4, (ప్రభాతవార్త) :** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 5,6తేదీలో ప్రత్యేక క్యాంపెయిన్ డ నిర్వహించడం జరుగుతుందని నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారి పి.పార్వతి



తెలియజేశారు. ఈ ప్రత్యేక ఓట్ల నమోదు సందర్భంగా బిఎల్వోలు ఆయా పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ప్రత్యేక ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు నమోదు చేసుకుంటారన్నారు. ఓటర్ల నమోదుకు ప్రత్యేకంగా నిర్వహించే క్యాంపెయిన్‌ను నియోజకవర్గ ఎన్నికల అధికారి లవన్న సందర్శిస్తారని అర్హులైన ఓటర్లు సద్వినియోగపరచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కన్నుల పండుగగా శ్రావణ శుక్రవారం పూజలు

**కొల్లిపర,సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** శ్రావణ శుక్రవారం కావటంతో మండలంలోని దేవాలయాల్లో పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు



నిర్వహించారు.అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు గ్రామాల్లోని ఆలయాలను సందర్శించి దర్శనం చేసుకున్నారు.దీనిలో భాగంగా మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్ధనస్వామి ఆలయం అమ్మవారి దర్శనం కోసం భక్తులతో నిండిపోయింది.ఆలయ ప్రధాన అర్చకులు పరాశరం జగన్నాధా చార్యులు పర్యవేక్షణలో లక్ష్మీదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేసి పంచామృతాలతో అభిషేకాలు చేసారు.పాడిపంటలు సమృద్ధిగా పండాలని.. సకాలంలో వర్షాలు పడి గ్రామం సుభిక్షంగా ఉండాలని భక్తులు పూజలు చేసారు.అనంతరం భక్తులకు పులిహోర,ప్రసాదం వితరణ గావించారు.ఇదే విధంగా శ్రీగంగా పార్వతీ సమేత ముక్త్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో,శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో పండితులు జగన్నాధాచార్యులు, కుమారస్వామి, నిరంజన్‌శర్మలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు చేసారు.

## తెనాలి మండలంలో నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**తెనాలి సెప్టెంబర్ 4(ప్రభాతవార్త):** తెనాలి రూరల్ మండల గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని,ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్,ఆపరేషన్ సబ్‌డివిజన్ తెనాలి రూరల్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు టేకి విశ్వనాదం ఒక ప్రకటనలో తెలిపారు.తెనాలి రూరల్ మండలంలోని కొలకలూరు 33/11 కె.వి. సబ్ స్టేషన్ పరిధిలో గల లైన్ మరమత్తులు, లైన్ లకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించు పనులు జరుగుతున్న కారణముగా తెనాలి రూరల్ మండలంలోని కొలకలూరు గ్రామమునకు మరియు గుడివాడ గ్రామమునకు, ఖాజీపేట, ఆఫ్టెట, గుడివాడ వ్యవసాయ విద్యుత్తు మరియు అనమర్లపూడి, తకెళ్ళమూడి గ్రామములకు గృహ విద్యుత్తు మరియు వ్యవసాయ విద్యుత్తు నిలుపుదల చేయుచున్నామని, శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యానం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని కావున వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ వారికి సహకరించగలరని ఎ.పి.సి.పి.డి.సి.యల్,తెనాలి రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు.

## తెనాలి ఆర్.ఆర్ నగర్‌లో కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు

**తెనాలి,సెప్టెంబర్ 4(,ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని ఆర్.ఆర్ నగర్ సమీపాన గల ద్వారకా నగర్ లో వేంచేసిన శ్రీ రుక్మిణి సమేత శ్రీ కృష్ణమందిరం నందు, శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ



సందర్భముగా శుక్రవారం శ్రీ స్వామివారికి ఉదయం నుండి అభిషేకాలు,ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయం స్థాపించిన ఐదు సంవత్సరాల నుండి భక్తులు, పెద్దల సహాయ సహకారాలతో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా, కృష్ణాష్టమి పండుగకు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, కోలాట ప్రదర్శనలతో పాటుగా, మధ్యాహ్నం నుండి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు అనంతరం శ్రీ స్వామి వారిని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నల్లగొర్ల నాగేశ్వరరావు,పెరుగు శ్రీనివాసరావు,పెరుగు స్వాములు,అంగిరేకుల వెంకటప్రసాద్, అక్కి శివ శంకర్రావు,అన్నపురెడ్డి ప్రభాకర్ రెడ్డి,అన్నపురెడ్డి నారాయణరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, అంగిరేకుల శివయ్య, కృష్ణ,మరియు ద్వారకా నగర్,ఆర్.ఆర్ నగర్ నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక

**చుండూరు సెప్టెంబర్4(ప్రభాతవార్త):** బాపట్ల జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కి నూతన కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు గా, కే.శ్రీనివాసరెడ్డి , సెక్రటరీ గా,ఎం.బద్రీనారాయణ, జాయింట్ సెక్రటరీగా ఎం.అమరనాథ్ (కవి),ట్రెజరర్ గా ఏ.మణికంఠ రెడ్డి, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆబ్సె ర్వెర్స్ గా వచ్చిన శాప్ కోచ్ చిరంజీవి మరియు స్టేట్ అబ్జర్వర్స్ గా వచ్చిన సునీల్ ,సురేష్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఇంటర్నేషన్ సాఫ్ట్బాల్ అంపైర్ ఏ.ఎస్.ఎస్.జగదీశ్ రెడ్డి మరియు పీడీ బి.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**సెప్టెంబర్ 7న సబ్‌జూనియర్స్ సెలెక్షన్స్:**

బాపట్ల జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ సబ్ జూనియర్ సెలెక్షన్స్, సెప్టెంబర్ 7న ఏపిఎస్డబ్లియుఆర్ఎస్ బాయ్స్ చుండూరు నందు జరుగును అని జిల్లా సెక్రెటరీ బద్రినారాయణ ఒక ప్రకటనలో తెలియ జేశారు. ఆసక్తి కలిగిన వారు,2012 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలని,సెలక్షన్స్ కి వచ్చు విద్యార్థిని,



విద్యార్థులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకొని రావాల్సిందిగా సూచించారు.జిల్లా జట్టుకు సెలెక్ట్ అయిన విద్యార్థులు, సెప్టెంబర్ 11,12,13 తేదీల్లో బొబ్బిలిలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, జిల్లా సాఫ్ట్ బాల్ సెక్రటరీ బద్రినారాయణ పేర్కొన్నారు.

## చదలవాడ ఉమేష్ చంద్రకు పోలీసుల ఘన నివాళి

**తెనాలి మున్సిపాలిటీ, సెప్టెంబర్4,(ప్రభాతవార్త):** దివంగత ఐపిఎస్ అధికారి, అమరవీరుడు,కడప పులిగా పేరుగాంచిన, చదలవాడ ఉమేష్ చంద్ర 27వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం తెనాలి పట్టణంలో డీఎస్పి బి. జనార్ధనరావు పర్యవేక్షణలో నిర్వహించారు పట్టణంలోని చెంచుపేట లోని ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద పట్టణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.ముందుగా ఉమేష్ చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి,ఘన నివాళి అర్పించారు.ఈ కార్యక్రమంలో తెనాలి పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉమేష్ చంద్ర చేసిన సాహసోపేత సేవలు, ఫ్యాక్షనిజం, నక్సలిజం అణచివేతలో ఆయన చూపిన తెగువను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. 1991 బ్యాచ్ ఐపిఎస్ అధికారి చదలవాడ ఉమేష్ చంద్ర 1999 సెప్టెంబర్ 4న హైదరాబాద్ లో విధి నిర్వహణలో అమరుడైన విషయం తెలిసిందే. కడప, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఎస్పీగా పని చేసి ప్రజల మన్ననలు పొందారు.ఈ కార్యక్రమంలో డీఎస్పి బి.జనార్ధనరావు,వన్ టౌన్ సీఐ సిహెచ్.రాంబాబు,ఎస్సై కోటేశ్వరమ్మ,టూ టౌన్ సీఐ రవీంద్ర బాబు,త్రీ టౌన్ ఎస్సై కరీముల్లా,తాలూకా ఎస్సై ఆనంద్,ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## నేడు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**పొన్నూరు, సెప్టెంబర్ 4,ప్రభాతవార్త:** స్థానిక లయన్స్‌పాలీ సర్వీస్ సెంటర్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు నన్నపనేని రఘునాథ్ తెలిపారు. శనివాయం సాయంత్రం 6.30గంటలకు జరిగే ఈ వేడుకల్లో క్లబ్ సభ్యులు అందరూ పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన పలువురు ఉపాధ్యాయులను సత్కరిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# మరింత ఉగ్రరూపంతో ఎల్‌నినో

- ప్రపంచ వాతావరణ సంస్థ అంచనా - 2027 ఫిబ్రవరి వరకూ కొనసాగే అవకాశం - ఉష్ణోగ్రతలు 2 డిగ్రీలు అధికంగా నమోదు : డబ్ల్యుఎంఒ సెక్రటరీ జనరల్ సెలెస్ట్ సౌలో




**జెనీవా, సెప్టెంబర్ 4:** ఎల్ నినో వాతావరణ దృగ్విషయం 2027 వరకు మరింత తీవ్రతరం కానుందని, ఇది ఇప్పటివరకు నమోదైన వాటిలో అత్యంత బలమైనదిగా మారవచ్చని, తద్వారా వచ్చే ఏడాది తీవ్ర వాతావరణ పరిస్థితుల ప్రమాదాన్ని పెంచుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) తెలిపింది. అసాధారణంగా వేడెక్కిన పసిఫిక్ మహాసముద్ర ఉష్ణోగ్రతల కారణంగా, ఎల్ నినో 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం దాదాపు 100శాతం ఉందని తమ అంచనాలు చూపిస్తున్నాయని ఐక్యరాజ్య సమితి వాతావరణ సంస్థ తెలిపింది. ఇంతటి నిశ్చయతను వ్యక్తం చేయడం ఇదే మొదటిసారి అని డబ్ల్యూఎంఓ పేర్కొంది. "ఈ ధోరణి ఇలాగే కొనసాగితే, ఇది అత్యంత బలమైనదిగా మారవచ్చు. అంటే, అక్షరాలా ఊహించని స్థాయిలో ఉంటుంది" అని డబ్ల్యుఎంఒ సెక్రటరీ జనరల్ సెలెస్ట్ సౌలో జెనీవాలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎల్ నినో అంటే బల హీన పడుతున్న వాణిజ్య పవనాల వల్ల తూర్పు పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు కాలానుగుణంగా పెరగడం. ఇది ప్రతి రెండు నుండి ఏడు సంవత్సరాలకు ఒకసారి సంభవిస్తుంది. 12 నెలల వరకు కొనసాగుతూ, లాటిన్ అమెరికా అంతటా తీవ్రమైన వర్షాలకు, కరువులకు కారణమవుతుంది. చాలా బలమైన ఎల్ నినో ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, ఉష్ణోగ్రత సరళిని గణనీయంగా మార్చగలదు. కరువులు, తుఫానుల వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులను మరింత తీవ్రతరం చేస్తుంది. వేడెక్కుతున్న సముద్రం: ఇది సహజంగా సంభవించే దృగ్విషయమే అయినా శిలాజ ఇంధనాల వల్ల కలిగే వాతావరణ మార్పుతో దీనికి ప్రత్యక్ష సంబంధం లేనప్పటికీ, వేడెక్కుతున్న సముద్రపు ఉష్ణోగ్రతల వల్ల ఇది తీవ్రతరం కావచ్చు. "ఎల్ నినో మన కళ్ల ముందే భారీ స్థాయికి చేరుకుంటోంది. దీంతో సముద్ర జలాలు వేడెక్కుతున్నాయి" అని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ అన్నారు. 1950 నుండి నమోదైన గణాంకాల ప్రకారం, గతంలో నమోదైన నాలుగు ఎల్ నినో ఘటనలలో కంటే, ప్రస్తుత ఎల్ నినో సమయంలో, పసిఫిక్ మహాసముద్ర ఉష్ణోగ్రతలు ఇప్పటికే సాధారణం కంటే 2 డిగ్రీల సెల్సియస్ (3.6 డిగ్రీల ఫారెన్‌హీట్) కంటే ఎక్కువగా ఉన్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) తెలిపింది. ఈ ఘటన ఇప్పటికే ఉష్ణ మండల ప్రాంతాల్లోని వ్యవసాయ ఉత్పత్తులపై ప్రభావం చూపింది, దీనివల్ల మధ్య అమెరికాలోని 'డ్రై కారిడార్' ప్రాంతంలో తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడింది. ప్రపంచ ఉష్ణోగ్రతలలో పెరుగుదల: ఈ యేడాది చివరి నాటికి ఇది గరిష్ట స్థాయికి చేరుకుంటుందని డబ్ల్యుఎంఒ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే దీని ప్రభావాలు 2027 వరకు కొనసాగుతాయని, వచ్చే యేడాది ప్రపంచ ఉష్ణోగ్రతలు మరింత పెరిగేలా చేస్తాయని డబ్ల్యుఎంఒ అధికారులు పేర్కొన్నారు. "సాధారణంగా ఎల్ నినో ఘటన తర్వాత ప్రపంచ ఉష్ణోగ్రతలలో ఒక తాత్కాలిక పెరుగుదల కనిపిస్తుంది" అని డబ్ల్యుఎంఒ వాతావరణ అంచనా సేవల విభాగం అధిపతి విల్‌ఫ్రాన్ మోఫౌమా ఒకియా విలేకరులతో అన్నారు. ఇప్పటివరకు అత్యంత వేడిగా నమోదైన 2024 సంవత్సరాన్ని ప్రస్తావిస్తూ, "2027 రికార్డు స్థాయిలో అత్యంత వేడి సంవత్సరంగా మారే అవకాశం ఉంది" అని ఆయన పేర్కొన్నారు.

## పెనువిషాదాన్ని మిగిల్చిన నేపాల్ భారీ వరదలు!

# 17వేల మంది చిన్నారులపై విపత్తు ప్రభావం

**ఖాట్మండు, సెప్టెంబరు 4:** నేపాల్‌లో సంభవించిన ఘోర వరద విపత్తు పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ జల ప్రళయంలో వందలాది మంది చిన్నారులు సహా వేలాది మంది గల్లంతయ్యారు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, రోడ్లు, వంతెనలు పూర్తిగా ధ్వంసం కావడంతో గల్లంతైన వారిని, ముఖ్యంగా పిల్లలను గుర్తించడం అధికారులకు కష్టసాధ్యంగా మారింది. వారి ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనతో ఎదురుచూస్తున్నారు. గతనెల 26న నేపాల్‌చైనా (టిబెట్) సరిహద్దులోని హిమాలయాల్లో భారీ హిమానీనదం కూలిపోవడంతో త్రిశూలి నదికి వరదలు పోటెత్తాయి. ఈ ఆకస్మిక వరదల ధాటికి చైనానేపాల్ సరిహద్దులోని గైరాంగ్ చెక్‌పాయింట్ సహా పలు పట్టణాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 1,200 దాటింది. నేపాల్, టిబెట్ కలిపి గల్లంతైన వారి సంఖ్య 5,000 వరకూ ఉంటుందని అంచనా. గల్లంతైన వారిలో భారతీయులు, అమెరికన్లతో పాటు పలువురు విదేశీయులు కూడా ఉన్నారు. ఈ విపత్తులో చిన్నారులు తీవ్రంగా ప్రభావితమయ్యారు. యూనిసెఫ్ ప్రకారం, సుమారు 17,000 మంది పిల్లలకు తక్షణ మానవతా సహాయం అవసరం. వరదల కారణంగా 18 పాఠశాలలు పూర్తిగా నేలమట్టం కాగా, మరో 20 పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, సుమారు 230 నుంచి 250 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు గల్లంతయ్యారు. కుటుంబాల నుంచి విడిపోయిన పిల్లల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. యూనిసెఫ్ బృందాలు వారిని గుర్తించి, కుటుంబ సభ్యులతో కలిపేందుకు, మానసిక సహాయం అందించేందుకు కృషి చేస్తున్నాయి. గల్లంతైన వారిని కనుగొనడంలో తెగిపోయిన నెట్‌వర్క్‌లు అతిపెద్ద సవాలుగా మారాయి.

టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలు పూర్తిగా స్తంభించాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో చాలా ప్రాంతాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. కేవలం హెలికాప్టర్ల ద్వారా మాత్రమే సహాయక బృందాలు అక్కడికి చేరుకోగలుగుతున్నాయి. దీంతో సహాయక చర్యలు, మృతదేహాల గుర్తింపు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. డీఎన్‌ఏ నమూనాలు సేకరించి మృతులను గుర్తించేందుకు నేపాల్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఐక్యరాజ్యసమితి, రెడ్‌క్రాస్ వంటి అంతర్జాతీయ సంస్థలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి.

# భారత్, బెల్జియంల మధ్య పది ఒప్పందాలు

## రక్షణ సంబంధాలు మరింత బలోపేతం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** భారత్‌లో పర్యటిస్తున్న బెల్జియం ప్రధాని బార్ట్ డివెవర్ తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. భారత్‌తో రక్షణ సంబంధాలను బెల్జియం మరింత బలోపేతం చేసుకుంది. పాకిస్థాన్‌తో సైనిక పరికరాలు, రక్షణ సాంకేతికతకు సంబంధించిన సహకారం చేపట్టబోమని భారత్‌కు హామీ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. రక్షణ, భద్రతా వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ఢిల్లీలో ప్రధాని మోడీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ సమావేశమయ్యారు. మరోవైపు భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బెల్జియం రక్షణ, విదేశీ వాణిజ్య మంత్రి థియో ఫ్రాంకెన్‌తో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. భారత్‌బెల్జియం సంయుక్త ప్రకటనలో గానీ రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో గానీ పాకిస్థాన్ ప్రస్తావన లేదు. బెల్జియం రక్షణ ఎగుమతులపై ఏదైనా నిర్దిష్ట దేశానికి సంబంధించిన ఆంక్షలను కూడా బహిరంగంగా ప్రకటించలేదు. ఈ హామీ ఎంతకాలం అమల్లో ఉంటుంది. ఎలా అమలు చేస్తారనే దానిపై కూడా అధికారిక వివరాలు వెల్లడికాలేదు. ఉగ్రవాదాన్ని, ముఖ్యంగా సరిహద్దు దాటి జరిగే ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే భారత్ పోరాటానికి బెల్జియం మద్దతు ప్రకటించినట్లు సంయుక్త ప్రకటన తెలిపింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో 2025 ఏప్రిల్‌లో జరిగిన ఉగ్రదాడిని బెల్జియం ఖండించింది. ఉగ్రవాదులు, వారికి నిధులు అందించే వ్యక్తులు, సంస్థలు, వారికి ఆశ్రయం కల్పించే వ్యవస్థలపై చర్యలు తీసుకోవాలని ఇరు దేశాలు పిలుపునిచ్చాయి. ఇందుకోసం ఐక్యరాజ్యసమితి, ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ వంటి అంతర్జాతీయ వేదికల ద్వారా కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. ఉగ్రవాద నిరోధక అంశాలపై సంయుక్త వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలించాలని అంగీకరించాయి.

గతంలో బెల్జియం పాకిస్థాన్‌కు సైనిక విమానాలను సరఫరా చేసింది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డేటా ప్రకారం 2021లో బెల్జియం ఏడు సి130బీ రవాణా విమానాలను పాకిస్థాన్‌కు విక్రయించింది. 2003లో పాకిస్థాన్ బెల్జియం నుంచి ఎఫ్16 యుద్ధ విమానాలను కూడా కొనుగోలు చేయాలని ప్రయత్నించింది. అయితే అమెరికాలో తయారైన ఈ విమానాలను బదిలీ చేయడానికి వాషింగ్టన్ అనుమతి అవసరం కావడంతో ఆ ప్రతిపాదిత ఒప్పందం ముందుకు సాగలేదు. 2021-25 మధ్యకాలంలో పాకిస్థాన్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ప్రధాన ఆయుధాల దిగుమతిదారుగా ఉంది. ఆ కాలంలో పాకిస్థాన్ దిగుమతి చేసుకున్న ఆయుధాల్లో 80 శాతం చైనా నుంచి వచ్చాయి. తుర్కియే 7 శాతం, నెదర్లాండ్స్ 4.6 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# సిఎం విజయ్ కాన్వాయ్‌లోకి చొరబడిన భార్యాభర్తలు!

**చెన్నై, సెప్టెంబరు 4:** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ కాన్వాయ్‌లో తీవ్ర భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. మార్చిలో శివగంగై జిల్లాలో పోలీసుల కస్టడీలో మృతి చెందిన 26 ఏళ్ల యువకుడి తల్లిదండ్రులు సీఎం కాన్వాయ్‌కు అడ్డుగా దూసుకెళ్లారు. తమ కుమారుడి మరణానికి న్యాయం చేయాలని కోరుతూ వారు బంధువులతో కలిసి నిరసన చేపట్టారు. చెన్నైలోని సచివాలయం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిరసన చేస్తున్న మృతుడి తల్లిదండ్రులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ కాన్వాయ్ వస్తుండగా స్థానికులు ఫెన్సింగ్ వెనుక నిలబడి ఉన్నట్లు వీడియోలో కనిపించింది. ఇంతలో ఓ మహిళ, ఓ పురుషుడు ఒక్కసారిగా ఫెన్సింగ్ దాటి భద్రతా వలయాన్ని ఛేదిస్తూ కాన్వాయ్ వైపు పరుగెత్తారు. మహిళను పోలీసులు వెంటనే పట్టుకోగా పురుషుడు మాత్రం సీఎం కాన్వాయ్‌కు మరింత దగ్గరగా వెళ్లగలిగాడు. దీంతో అక్కడ ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. పరిస్థితిని గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే కాన్వాయ్‌ను నిలిపివేశారు. శివగంగై జిల్లాకు చెందిన 26 ఏళ్ల దళిత యువకుడు పోలీసుల కస్టడీలో ఉండగా అస్వస్థతకు గురయ్యాడు. అనంతరం చికిత్స కోసం మదురైలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విచారణ సమయంలో పోలీసులు తన కుమారుడిని చిత్రహింసలకు గురిచేశారని అతడి కుటుంబ సభ్యులు ఆరోపించినట్లు ఏఎన్‌ఐ గతంలో నివేదించింది. మృతుడిని ఆకాష్ డెనిసన్‌గా గుర్తించారు. చిన్నపాటి దాడి కేసులో అనుమానితుడిగా మనమదురై పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కుమారుడి మృతిపై అతడి తండ్రి కన్నన్ తీవ్ర ఆరోపణలు చేశారు. పోలీసుల విచారణ సమయంలో తన కుమారుడిపై తీవ్రంగా దాడి చేశారని, కులం పేరుతో దూషించారని ఆరోపించారు. తమ కుమారుడి మరణానికి న్యాయం చేయాలని కోరుతూ కన్నన్, ఆయన భార్య తమ బంధువులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి విజయ్ కాన్వాయ్ సమీపంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది.




## స్తంభాన్ని ఢీకొన్న ఇండిగో విమానం

**శ్రీనగర్, సెప్టెంబరు 4:** శ్రీనగర్ విమానాశ్రయంలో ఇండిగో విమానం పార్కింగ్ చేస్తుండగా వీఎడీజీఎస్ పోల్‌ను తాకింది. శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నారు. ఎవరికీ గాయాలు కాలేదని విమానాశ్రయ అధికారులు తెలిపారు. ముంబై నుంచి శ్రీనగర్ వచ్చిన ఇండిగో విమానం 6ఈ 225 ఉదయం 9.02 గంటలకు బే నంబర్ 6లో పార్కింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది.

## అవినీతి కేసులో శ్రీలంక మాజీ అధ్యక్షుడి కుమారుడు నామల్ రాజపక్స అరెస్ట్

**కొలంబో, సెప్టెంబరు 4:** శ్రీలంక మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్స కుమారుడు, ఎంపీ నమల్ రాజపక్సను దేశ ప్రధాన అవినీతి నిరోధక సంస్థ శుక్రవారం అరెస్ట్ చేసింది. 2013లో జరిగిన ఎయిర్‌బస్ విమానాల కొనుగోలు వ్యవహారంలో అవినీతి ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బ్రైబరీ అండ్ కరప్షన్ ఆరోపణల దర్యాప్తు కమిషన్ ప్రకారం ఎయిర్‌బస్ విమానాల కొనుగోలు వ్యవహారంపై విచారణకు హాజరు కావాలని 40 ఏళ్ల నామల్ రాజపక్సకు సమన్లు జారీ చేశారు. విచారణ అనంతరం ఆయనను అరెస్ట్ చేసినట్లు కమిషన్ అధికారి తెలిపారు. అనంతరం ఆయనను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. అయితే నామల్ రాజపక్సపై ఏయే అభియోగాలు నమోదు చేశారన్నది వెంటనే స్పష్టంగా తెలియరాలేదు. ఆయన న్యాయవాది నిశాంత దయానంద అరెస్ట్‌ను ధ్రువీకరించారు.

వివాదాస్పదంగా మారిన 2.3 బిలియన్ డాలర్ల ఎయిర్‌బస్ ఒప్పందానికి సంబంధించి ఈ అరెస్ట్ జరిగినట్లు తెలిపారు. 2016లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందాన్ని రద్దు చేసింది. ఈ కేసులో సిఐఎబిఒసి ఇప్పటికే మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్సను కూడా మే నెలలో ప్రశ్నించింది. విమానాల కొనుగోలు వ్యవహారంలో ఆయన లంచాలు స్వీకరించారన్న ఆరోపణలపై అధికారులు విచారించారు. ఎయిర్‌బస్ విమానాల కొనుగోలులో చెల్లించిన మొత్తంలో కొంత భాగాన్ని శ్రీలంకకు చెందిన ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులకు లంచాల రూపంలో అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై ప్రస్తుతం అవినీతి నిరోధక సంస్థ దర్యాప్తు కొనసాగిస్తోంది. రాజపక్స కుటుంబం తమపై వచ్చిన లంచం, అవినీతి ఆరోపణలను ఖండించింది. తమపై వచ్చిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవని పేర్కొంది.




## నవంబరు 10న భారత్‌లో సోనియా ఆత్మకథ విడుదల

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** సోనియా గాంధీ రాసిన బిలాంగింగ్-ఏ జర్నీ ఆఫ్ లవ్ పుస్తకానికి భారత్‌లో కొత్త ప్రచురణకర్త ఖరారైంది. హార్పర్‌కాలిన్స్ ఇండియా ఈ పుస్తకాన్ని ప్రచురించనుంది. 2026 నవంబర్ 10న భారత్‌లో పుస్తకం విడుదల కానుంది. ఈ విషయాన్ని హార్పర్‌కాలిన్స్ ఇండియా శుక్రవారం ప్రకటించింది. అత్యంత ఆసక్తి రేపుతున్న రాజకీయ జ్ఞాపకాల పుస్తకాల్లో ఇదొకటని తెలిపింది. ప్రేమ, గుర్తింపు, బాధ్యత, అనుబంధం వంటి అంశాల చుట్టూ సోనియా గాంధీ వ్యక్తిగత జీవితాన్ని ఇందులో వివరించినట్లు పేర్కొంది. ఇటీవల సోనియా గాంధీ పుస్తకానికి పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ప్రచురణకర్త కాదని ప్రకటించింది. పుస్తకంలోని కొన్ని అంశాలపై రచయితతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందని సంస్థ తెలిపింది. అయితే సంపాదకీయ మార్పులకు సోనియా గాంధీ అంగీకరించకపోవడంతోనే పుస్తక ప్రచురణ నుంచి తప్పుకున్నారన్న వార్తలను పెంగ్విన్ ఖండించింది. బాహ్య ఒత్తిడి కారణం కాదని స్పష్టం చేసింది. బిలాంగింగ్ పుస్తకాన్ని అమెరికాకు చెందిన ఆల్ఫ్రెడ్ ఏ.నాఫ్ నవంబర్ 10న విడుదల చేయనున్నట్లు గతంలో ప్రకటించింది. భారత్‌లో మాత్రం ప్రచురణ బాధ్యతలు ఇప్పుడు హార్పర్‌కాలిన్స్ ఇండియాకు దక్కాయి. ఈ పుస్తకంలో సోనియా గాంధీ తన ఆరు దశాబ్దాల అనుభవాలను ప్రస్తావించారు. 1984లో అత్త ఇందిరా గాంధీ హత్యతో తన జీవితం ఎలా మారిందో వివరించారు. 1991లో భర్త రాజీవ్ గాంధీ హత్య తర్వాత ఎదురైన పరిస్థితులనూ పంచుకున్నారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన తీరాన్ని పుస్తకంలో ప్రస్తావించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సుదీర్ఘకాలం కొనసాగిన సోనియా గాంధీ ప్రధానమంత్రి పదవిని చేపట్టే అవకాశం వచ్చినా తిరస్కరించారు.

2014లో కాంగ్రెస్ అధికారం కోల్పోయి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి అధికారంలోకి వచ్చిన పరిణామాలనూ ఆమె తన పుస్తకంలో ప్రస్తావించారు.

## కొలెస్ట్రాల్ తగ్గించేందుకు జన్యు చికిత్స పరీక్షలు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) ఎక్కువైతే గుండె జబ్బులు, గుండెపోటు, స్ట్రోక్ ముప్పు పెరుగుతుంది. సాధారణంగా ఆహారంలో మార్పులు, మందులతో దీన్ని నియంత్రిస్తారు. ఇప్పుడు ఒక్కసారి మాత్రమే ఇచ్చే జన్యు చికిత్సతో ఎల్‌డీఎల్‌ను సగానికి పైగా తగ్గించే అవకాశం ఉందని తొలి మానవ పరీక్ష వెల్లడించింది. శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్న ఈ చికిత్సకు సీటీఎక్స్310 అని పేరు పెట్టారు. క్రిస్పర్ జన్యు సవరణ సాంకేతికతతో కాలేయ కణాల్లోని ఏఎన్‌జీపీటీఎల్3 ప్రొటీన్ ఉత్పత్తిని తగ్గించడం దీని లక్ష్యం. ఈ ప్రొటీన్ తక్కువగా ఉంటే రక్తంలోని కొవ్వులను శరీరం మెరుగ్గా నియంత్రించగలదు. తొలి దశ పరీక్షలో తీవ్రమైన కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ సమస్యలున్న 15 మందికి సీటీఎక్స్310ను నరాల ద్వారా అందించారు. చికిత్స కోసం క్రిస్పర్ సూచనలను మోసుకెళ్లే నానోకణాలను ఉపయోగించారు. వారిలో ఒకరు చికిత్స తర్వాత 179 రోజులకు మరణించారు. ఆ మరణానికి సీటీఎక్స్310 కారణం కాదని పరిశోధకులు నిర్ధారించారు. మిగిలిన 14 మందిలో ఏడాది తర్వాత కూడా కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయులు తగ్గినట్లే ఉన్నాయి. తీవ్రమైన కొత్త దుష్ప్రభావాలు కనిపించలేదు. అత్యధిక మోతాదు పొందిన నలుగురిలో ఏఎన్‌జీపీటీఎల్3 స్థాయులు సగటున 78.6 శాతం తగ్గాయి. వారి ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ 52.5 శాతం, ట్రైగ్లిజరైడ్లు 47.8 శాతం తగ్గాయి. అయితే ఇది చాలా చిన్న స్థాయిలో జరిగిన తొలి మానవ పరీక్ష మాత్రమే. ఎక్కువ మందిపై, ఎక్కువ కాలం పరిశోధనలు జరగాల్సి ఉంది. జన్యు సవరణలో కొన్ని ప్రమాదాలు ఉండే అవకాశం కూడా ఉంది.

## భారత్ కంపెనీతో రూ. 769 కోట్ల ఆయుధ డీల్..

### ఎస్తోనియా రక్షణ మంత్రి రాజీనామా



**టల్లిన్, సెప్టెంబరు 4:** ఆయుధాల ఒప్పందం విషయంలో బయటపడిన అవకతవకలు ఎస్తోనియా రక్షణ మంత్రి పదవికి ఎసరు తెచ్చాయి. రూ. 768.50 కోట్లతో ఫిరంగి మందుగుండు సామగ్రి కొనుగోలుకు సంబంధించిన తీవ్ర విమర్శలు వ్యక్తం కావడంతో హన్నో పెవ్కుర్ రాజీనామా చేశారు. ఈ డీల్‌కు సంబంధించి ఆడిట్‌లో తేలిన అక్రమాల ఆధారంగా నేర విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో హన్నో నైతిక బాధ్యత వహిస్తూ రక్షణమంత్రి పదవి నుంచి వైదొలిగారు. ఈ వివాదంలో భారత్‌కు చెందిన ఓ కంపెనీ కేంద్ర బిందువుగా మారడం గమనార్హం. రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో మందుగుండు సామగ్రి కొరత ఏర్పడింది. కీవ్ కోసం వాటిని సమీకరించేందుకు మరో ఐరోపా దేశం ఎస్తోనియా.. ఇటలీకి చెందిన డేటాసెల్ ఎస్‌ఆర్‌ఎల్ కంపెనీతో 2024లో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డేటాసెల్ కంపెనీని అదే యేడాది ఆరంభంలో భారత్‌కు చెందిన నెకో డిఫెన్స్ కొనుగోలు చేసింది. ఈ మొత్తం ఒప్పందం విలువ 70 మిలియన్ల యూరోలు. ఐరోపా యూనియన్‌కు చెందిన యూరోపియన్ పీస్ ఫెసిలిటీ నుంచి వచ్చిన డబ్బును ఎస్తోనియా ఈ కంపెనీకి దశల వారీగా ముందుగానే చెల్లించింది. కొన్ని నెలల్లోనే ఈ ఆర్టిల్లెరీ షెల్స్ ఉక్రెయిన్‌కు చేరుకుంటాయని అంతా భావించారు. కానీ, ఆయుధ సరఫరాలు పదేపదే ఆలస్యమయ్యాయి. 2025లో కొన్ని షెల్స్ డెలివరీ అందినా.. అవి పూర్తిగా లోపాలతో ఉన్నాయని ఎస్తోనియా ఆరోపించింది. దీంతో వాటిని ఉక్రెయిన్‌కు పంపించలేదని తెలిపింది. తాను చెల్లించిన డబ్బు తిరిగి పొందేందుకు ఎస్తోనియా ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే, ఈ ఆరోపణలను డెటాసెల్ తిప్పికొట్టింది. తాము చాలావరకు డెలివరీలు అందించామని, ఒప్పందం గడువు ముగియడానికి ముందే 59 మిలియన్ యూరోల విలువైన మందుగుండు సామగ్రిని సరఫరా చేశామని వెల్లడించింది. అలాగే నాణ్యతా సమస్యల కారణంగానే ఒప్పందం రద్దు చేసుకున్నారన్న వాదనలను ఖండించింది. ఈ వ్యవహారం నేపథ్యంలో ఎస్తోనియాపై డేటాసెల్ కంపెనీ దావా వేసింది. ఈ నేపథ్యంలోనే ఎస్తోనియా రక్షణ నిధుల నిర్వహణ, సైనిక కొనుగోళ్లకు సంబంధించిన ఆడిట్ చేపట్టగా అవకతవకలు బయటపడ్డాయి. దీనిపై విమర్శలు రావడంతో రక్షణ మంత్రి రాజీనామా చేశారు. ఈ డీల్‌కు చెల్లించిన డబ్బులు ఐరోపా యానియన్‌కు తిరిగిరాకపోతే.. ఎస్తోనియా తన సొంత బడ్జెట్ నుంచి ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఎస్తోనియా దేశం ఐరోపా యూనియన్, నాటో కూటమిలో భాగం. దీనికి రష్యాతో సరిహద్దు ఉంది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆ దేశంలో కూడా భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తాయి. అలాగే ఉక్రెయిన్‌కు ఎస్తోనియా కీలక మద్దతుదారుగా ఉంది.

## రామభక్తుల దీవెనలే నాకు ముఖ్యం

### అయోధ్య రామమందిరం కొత్త సిఇఒ జితేంద్ర



**అయోధ్య, సెప్టెంబరు 4:** అయోధ్య రామాలయం సీఈవోగా మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియమితులైన విషయం తెలిసిందే. అయితే రామభక్తుల మద్దతు, దీవెనలు తమకు ముఖ్యమని ఆయన అన్నారు. రామ ట్రస్టు వ్యూహాలు త్వరలో ఆచరణలోకి రానున్నట్లు ఆయన చెప్పారు. ట్రస్టు సభ్యులతో మీటింగ్ నిర్వహించిన తర్వాత ఇవాళ జితేంద్ర మిశ్రా మీడియాతో మాట్లాడారు. భక్తుల విశ్వాసం, దీవెనలు తమ పట్ల ఉండాలని ఆశిస్తున్నట్లు మిశ్రా తెలిపారు. రామభక్తుల ఆశీస్సులు తమకు ముఖ్యమన్నారు. మీ దీనవలు, నమ్మకంతోనే మేం ముందుకు వెళ్తామని, నాకు కొంత సమయం ఇవ్వండి అంటూ మిశ్రా అన్నారు. రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు మిశ్రాను తొలి సీఈవోగా నియమించిన విషయం తెలిసిందే. అయితే అయోధ్య రామాలయ వ్యవహార శైలిని సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. కొన్ని రోజుల్లో తమ వ్యూహాలు అమలులోకి రానున్నట్లు ఆయన చెప్పారు. వివిధ బృందాల సహకారంతో అయోధ్య ఆలయంలో చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కీలకమైన నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తామన్నారు.


# సంక్షిప్త వార్తలు

### ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి ప్రధాని మోడీ శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 4:** ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆ దేశ రాజకీయ చరిత్రలో ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. యుద్ధానంతర ఇటలీ చరిత్రలో అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధానిగా పనిచేసిన వ్యక్తిగా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. మెలోనీని నా స్నేహితురాలు అని సంబోధిస్తూ, ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ మైలురాయే నిదర్శనమని ప్రశంసించారు.

### కరాచీకి వెళ్తున్న రష్యానౌకపై డ్రోన్ దాడి




**మాస్కో, సెప్టెంబరు 4:** రష్యా నుంచి 23 మంది భారతీయులతో బయల్దేరిన ఓ నౌకపై డ్రోన్ దాడి జరిగింది. నోవోరోస్సిస్క్ నుంచి పాకిస్థాన్ నగరం కరాచీకి ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. నౌకలో సిబ్బందికి వసతి కల్పించే ప్రాంతాన్ని డ్రోన్ ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే మంటలను ఆర్పివేశారు. బుధవారం జరిగిన ఈ ప్రమాదం గురించి ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌యుఎస్‌యుఐ) ఎక్స్ వేదికగా వెల్లడించింది. నౌక సమీపంలో మరో డ్రోన్‌ను గుర్తించినట్లు తెలిపింది. ఈ ఘటన సమయంలో నౌకలో 23 మంది భారత నావికులు ఉన్నారని ఎఫ్‌యుఎస్‌యుఐ వెల్లడించింది.

### బెంగాల్ ప్రభుత్వ సలహాదారుగా మిథున్ చక్రవర్తి

**కోల్‌కత్తా, సెప్టెంబరు 4:** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సాంస్కృతిక సలహాదారు (కల్చరల్ అడ్వైజర్)గా బాలీవుడ్ ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి నియమితుడయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సువేందు అధికారి శుక్రవారం అధికారికంగా ప్రకటించారు.

కోల్‌కతా శివారులోని న్యూ టౌన్‌లో ఉత్తమ్ కుమార్ ఫిలిం సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.

### ముగ్గురు పిల్లలతో మహిళా వెయిట్ లిఫ్టర్ ఆత్మహత్య



**ముంబయి, సెప్టెంబరు 4:** మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లాలో తీవ్ర విషాదకర సంఘటన చోటు చేసుకుంది. జాతీయ స్థాయి మహిళా రెజ్లర్ అశ్విని మనోహర్ పాల్ తన ముగ్గురు పిల్లలతో సహా చారిత్రాత్మక నల్‌దుర్గ్ కోటపై నుండి దాదాపు 100 అడుగుల లోతైన లోయలోకి దూకేశారు. ఈ ఘటనలో అశ్విని మరియు ఆమె ఐదేళ్ల కుమారుడు అజింక్యా అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె రెండున్నరేళ్ల కవల కుమార్తెలలో క్రాంతి అనే చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసింది. ఈ ఘోర ప్రమాదం నుంచి మరో కుమార్తె వీరా తీవ్ర గాయాలతో బయటపడింది.

### ముడిచమురు చోరీకి యత్నం.. 37 మంది మృతి

**అబుజా, సెప్టెంబరు 4:** నైజీరియాలో పెను విషాదం చోటుచేసుకుంది. పైప్‌లైన్ నుంచి ముడిచమురును దొంగిలించేందుకు ప్రయత్నించిన 37 మంది విష వాయువులు పీల్చి మృతి చెందినట్లు సమాచారం. ఈ మృతుల సంఖ్యను అధికారులు ఇంకా ధ్రువీకరించ లేదు. రివర్స్ రాష్ట్రంలోని ఒక్రికా ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు స్థానిక పర్యావరణ సంస్థ తెలిపింది. అయితే ఎంతమంది చనిపోయారనే విషయాన్ని వెల్లడించలేదు. ఘటనపై దర్యాప్తు కొన సాగుతోందని రివర్స్ రాష్ట్ర పోలీసు ప్రతినిధి బ్లెస్సింగ్ కబోర్లో అగాబే తెలిపారు.

### చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు మూడుసార్లు గుండెపోటు

**బీజింగ్, సెప్టెంబరు 4:** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆరోగ్యంపై కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఆగస్టు నెలాఖరులో ఆయన కిర్గిజ్‌స్థాన్‌కు వెళ్లిన సమయంలో, విమానం నుంచి దిగుతూ భార్య పెంగ్ లియువాన్ చేతిని పట్టుకుని నెమ్మదిగా మెట్లు దిగుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొందరు ఆయన ముఖం ఉబ్బినట్లు కనిపించిందని, నడకలోనూ ఇబ్బంది ఉన్నట్లు భావించారు. ఆయన ఆరోగ్యంపై టిబెట్, తైవాన్, ప్రవాస చైనీస్ వర్గాల్లో చర్చ మొదలైంది.

MN 10 final:MN 10 final 01/01/2001 10:45 Page 1



# భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

## ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, సెప్టెంబర్ 4,(ప్రభాతవార్త):** కృష్ణాష్టమి అనేది భగవంతుడు భూమిపైకి వచ్చిన రోజు మాత్రమే కాదని, మనిషి తనలోని దైవత్వాన్ని గుర్తుచేసుకునే రోజని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని ములుకుదురు, నిడుబ్రోలులో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అహంకారపు కంసుణ్ని జయించి, ప్రేమక అనే యమునను దాటి, జ్ఞానమనే గోకులాన్ని చేరినప్పుడు ప్రతి హృదయంలోనూ కృష్ణుడు జన్మిస్తాడన్నారు. అందుకు కావాల్సిందల్లా పవిత్రమైన మనసు, నిర్మలమైన భక్తి అని చెప్పారు. కృష్ణాష్టమి అంటే ఉట్టికొట్టడం, పూజలు చేయడమే కాదన్నారు. అంతరంగంలో దాగి వున్న కృష్ణతత్వాన్ని మేల్కొల్పడం, అజ్ఞాన కారాగారం నుంచి ఆత్మజ్ఞాన స్వేచ్ఛా ద్వీపం వైపు ప్రయాణించడం, హృదయ వేణువులో ప్రేమ రాగం పలికించి, జీవన కురుక్షేత్రంలో ధర్మాన్ని నిలబెట్టడం అని చెప్పారు. అప్పుడు ప్రతి రోజు కృష్ణాష్టమి అవుతుందన్నారు. ప్రతి హృదయమూ బృందావనం అవుతుందన్నారు. ప్రతి శ్వాసా వేణుగానమవుతుందన్నారు. ప్రతి జీవితమూ భగవద్గీతగా భాసిస్తుందన్నారు. శ్రీకృష్ణుని పూజలో పాల్గొని స్వయంగా స్వామివారికి అభిషేకాలు, హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, బొర్రు రామారావు, యరసాని శ్రీరామమూర్తి, కత్తుల రవికిరణ్, షేక్ బాజిసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



# దాడికి యత్నించిన వారిపై కేసు నమోదు

**గుంటూరు,సెప్టెంబర్4,(ప్రభాతవార్త):** గుంటూరు నగరంలోని కాకుమానువారి తోటలో బుధవారం రాత్రి ఓ మహిళపై జరిగిన దాడి ఘటనకు సంబంధించిన వివరాలతో అరుంధతీపేట పోలీసులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.పోలీసుల కథనం ప్రకారం గుంటూరు నగరంలోని కాకుమానువారి తోట 1/5 లైనుకు చెందిన జంగా రాజామణి గృహిణి. ఆమె భర్త శివయ్య ఒక బార్ షాపులో పనిచేస్తున్నారు. శివయ్య దాదాపు 15 ఏళ్ల క్రితం కొబాల్ట్‌పేటకు చెందిన నిరాల అనే మహిళను రెండో పెళ్లి చేసుకున్నారు.ఈ క్రమంలో గత కొంతకాలంగా వీరి మధ్య కుటుంబ వివాదాలు నడుస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఈనెల 2వ తేదీ బుధవారం రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో రాజామణి, ఆమె కుమారుడు శివమణి ఇంట్లో ఉండగా.. రెండో భార్య నిరాల, ఆమె తల్లి రమణ, సోదరుడు నరేష్, మేనత్త బాలనాగమ్మ, ఆమె కుమార్తె మల్లేశ్వరి, కుమారులు పెద్దోడు, చిన్నోడు మరికొందరితో కలిసి అక్రమంగా ఇంట్లోకి చొరబడ్డారు. రాజామణిని బూతులు తిడుతూ తీవ్రంగా కొట్టారు.నిరాల, మల్లేశ్వరి కలిసి రాజామణిని కిందకు పడేసి,కళ్లలో కారంపొడి చల్లారు. అనంతరం నిరాల గ్లాస్ బౌల్ (గాజు గిన్నె)తో రాజామణి తలపై బలంగా కొట్టడంతో ఆమెకు తీవ్ర రక్తగాయమైంది. భార్యను కాపాడటానికి వచ్చిన భర్త శివయ్యను కూడా నిందితులందరూ కలిసి కొట్టి కిందకు నెట్టేశారు. ఇంట్లోని ఎల్‌జీ టీవీ, రిఫ్రిజిరేటర్ సహా ఇతర గృహోపకరణాలను పగలగొట్టి, ఇల్లంతా ధ్వంసం చేశారు.బాధితుల కేకలు విని చుట్టుపక్కల వారు వచ్చేసరికి, నిందితులు రాజామణికి చెందిన రెడ్‌మి నోట్ మొబైల్ ఫోన్, ఆమె కుమారుడి రెడ్‌మి 15 ఫోన్‌లను లాక్కుని అక్కడ నుంచి పారిపోయారు.విషయం తెలుసుకున్న రాజామణి కుమార్తె రాణి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన తల్లిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి కి తరలించారు. తలపై తీవ్ర గాయమవడంతో వైద్యులు రాజామణికి 8 కుట్లు వేశారు.చికిత్స అనంతరం బాధితురాలు గురువారం సాయంత్రం అరుంధతీపేట పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అరుంధతీపేట ఎస్ఐ పి. మహేష్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు.



# వంతెనకు మరమ్మత్తులు చేపట్టాలి

## -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, సెప్టెంబర్ 4,(ప్రభాతవార్త):** జీబీసి రోడ్డులోని పొన్నూరు-చేబ్రోలు గ్రామాల మధ్య కొమ్మమూరు కెనాల్‌పై ఉన్న వంతెనకు మరమ్మత్తులు చేసి రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. బ్రిటీష్ కాలం నాటి వంతెన కావడంతో ప్రజా రవాణతో వంతెన బలహీన పడిందని, నూతన వంతెన నిర్మాణం పూర్తయ్యేవరకు పాత వంతెనకు మరమ్మత్తులు చేసి రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నూతన వంతెన కూడా త్వరితగతిన పూర్తయ్యేవిధంగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే వెంట ఆర్‌అండ్‌బి ఏఇ శ్రీనివాసరావు, గణిపిశెట్టి రామకృష్ణ, పలువురు నాయకులున్నారు.



# ప్రారంభమైన ఉత్సవాలు

**పొన్నూరు, సెప్టెంబర్ 4,(ప్రభాతవార్త):** స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ స్వర్ణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు, విశేషార్చనలు నిర్వహించారు. స్వామివారిని పెండ్లి కుమారునిగా అలంకరించారు. ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా దేవాలయాన్ని అరటి బోదెలు, కొబ్బరి మట్టలతో అందంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం వాస్తు హోమం, అంకురారోపణ, వాస్తుపూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరిగాయి. అర్చకస్వామి రొంపిచర్ల రాజాకృష్ణమాచార్యులు ఉత్సవాలకు సంబంధించిన పూజాధికార్యక్ర మాలను నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వహణాధికారి ఆరికాటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీనియర్ అసిస్టెంట్ పట్టికాటి వారు ఏర్పాట్లు చేశారు.

**నేడు కళ్యాణోత్సవం:** శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీస్వర్ణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం రాత్రి 7గంటలకు స్వామివారి కళ్యాణోత్సవం జరుగుతుందని కార్యనిర్వహణాధికారి ఆరికాటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కళ్యాణోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



# ఘనంగా కుంకుమార్చనలు

## -దేవాలయానికి పోటెత్తిన భక్తులు -అమ్మవారి ఆశీస్సులు అందుకున్న భక్తులు



**పొన్నూరు, సెప్టెంబర్ 4,(ప్రభాతవార్త):** గుంటూరు పట్టణంలోని ఆర్ అగ్రహారంలో వేంచేసియున్న శ్రీ వాసవీ కన్యకపారమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జై వాసవి....జైజై వాసవి అనే భక్తుల నినాదాలతో దేవాలయం మార్మోగిపోయింది. మహిళాభక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమార్చనలు నిర్వహించారు. వేకువజామునే లేచి తలంటు స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి అత్యంత పవిత్రంగా అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులతో అమ్మవారి దేవాలయం పోటెత్తింది. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకుని ఆశీస్సులు అందుకున్నారు. భక్తులు తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా కార్యనిర్వణాధికారి నిడమానూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

# ఆచార్య..వాళ్ళకు ఉద్యోగ విరమణ లేదా..?



**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, సెప్టెంబరు4, ప్రభాతవార్త:** ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న వారికి నిబంధనల ప్రకారం ఉద్యోగ విరమణకు కనీస వయస్సును జిఏడిలో నిర్ణయిస్తారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే సంస్థలకు, రాష్ట్ర ప్రభుత్వాలు నడుపుతున్న సంస్థలకు వేర్వేరుగా ఉద్యోగ విరమణ వయస్సు ఉంటుంది. ఆయా రాష్ట్రాల నియమనిబంధనలు అనుసరించి ఈ విధానం కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను పరిశీలిస్తే అధ్యాపకులకు 65సంవత్సరాలు, అధ్యాపకేతర సిబ్బందికి 62సం॥లుగా ఉంది. కాగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ విధానం కొంత వింతగా కనిపిస్తుంది. ఎందుకంటే ఇక్కడ అధ్యాపకులకు (నచ్చిన వారికి), అధ్యాపకేతర ఉద్యోగులు (వీళ్ళు కూడా నచ్చిన వారైతే)కు ఉద్యోగ విరమణ నిబందన వర్తించదు. అవసరం ఉన్నా లేకున్నా నచ్చిన వారికి రెన్యువల్ విధానం అమలు చేస్తున్నారు. వర్సిటీలో 2006, 2009లలో అధ్యాపకుల నియామకాలు జరిగాయి. వాళ్ళు వయస్సు రీత్యా ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ఈక్రమంలో వర్సిటీకి కొన్ని విభాగాల్లో రెగ్యులర్ అధ్యాపకులు లేని పరిస్థితి నెలకొంది. ఆయా సమయాల్లో వర్సిటీ ఉద్యోగవిరమణ చేసిన ప్రొఫెసర్‌లను కన్సాలిడేట్ విధానంలో నియమించుకున్నారు. వారి నియామక గడువు పూర్తయిన తరువాత వెళ్ళకపోగా రెన్యువల్ చేయించుకుంటూ విభాగాల్లో కొనసాగుతున్నారు. దీంతో ఆయా విభాగాల్లో యువ అధ్యాపకులకు అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. కొన్ని విభాగాల్లో అర్హులైన యువతను పక్కనపెట్టి మరీ ఉద్యోగ విరమణ చేసిన వారిని నియమించుకోవడం ఏఎన్‌యుకే సాధ్యంగా ఉంది. అదీను యువ అధ్యాపకులకు చెల్లించే వేతనంకు రెట్టింపు వేతనం ఇస్తూ కొనసాగిస్తున్నారు. వీరికి ప్రత్యేక పనులు, అదనపు బాధ్యతలు కూడా ఏమీ ఉండవు. కేవలం బోధనకే వారిని నియమిస్తున్నారు. ప్రస్తుతం వర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్, సైన్స్, ఆర్ట్స్ కళాశాలల్లో నెలకు రూ.70వేల వేతనం ( కళాశాలల వారీగా మార్పులుండొచ్చు) తో హానరరీ ప్రొఫెసర్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి చెల్లించే వేతనంకు ఇద్దరు యువ అధ్యాపకులు వస్తారు. అలాగే నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించినట్లు ఉంటుంది. కానీ ఏఎన్‌యులో అందుకు భిన్నంగా ఉద్యోగాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఏఎన్‌యు ఇచ్చే పీహెచ్‌డి అర్హులకు అవకాశం లేకుండా ఇక్కడే ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. 2004కు ముందు చేరి ఉద్యోగ విరమణ చేసిన ప్రొఫెసర్‌లకు నెలకు ఎంత తక్కువ వేసిన రూ.1లక్షన్నర వరకు పెన్షన్ వస్తుంది. వారికి ఏఎన్‌యు రూ.70 వేల వేతనం చెల్లిస్తోంది. జీతం, జీవితం ఇచ్చిన వర్సిటీకి అధ్యాపకులుగా అలూమ్నీ కేటగిరిలో ప్రతిఫలం ఆశించకుండ ఏదో ఒక రూపంలో ఉపయోగపడితే బాగుంటుందనే చర్చ నేడు వర్సిటీలో జరుగుతుంది. ఇక అధ్యాపకేతర ఉద్యోగులు కూడా మేమేం తక్కువ కాదు. వాళ్ళకు ఇచ్చినప్పుడు తమకు కూడా ఉద్యోగాలు ఇవ్వాలనే డిమాండ్‌ను తెరమీదకు తెస్తున్నారు. దీనికి కొంతమంది ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సులు కూడా చేయిస్తామంటూ పేర్కొంటున్నట్లు తెలిసింది. వాళ్ళు లేకపోతే ఈ విభాగం పనిచేయదు. అక్కడ ఉద్యోగులకు అనుభవం లేదు. దస్త్రాలపై పట్టు లేదు. సమస్య వచ్చినప్పుడు వర్సిటీ ఇబ్బందుల్లో పడుతుందనే భావనను ఉద్యోగ విరమణ చేసిన అధ్యాపకేతర ఉద్యోగులు కల్పిస్తున్నట్లు సమాచారం. (టాలెంట్ ఎవరి సొత్తుకాదనేది వారికి తెలియదేమో) ఇదే నిజమైతే గతంలో పనిచేసిన జాయింట్ రిజిస్ట్రార్‌లు, డిప్యూటీ రిజిస్ట్రార్‌లు, ఫైనాన్స్ ఆఫీసర్‌లు ఇలా అందరు కోరుకోవాలి కదా..!. గత 4నెలల క్రితం ఒ ఉద్యోగి తనను కొనసాగించాలని అధికారులను కోరినట్లు తెలిసింది. అయితే అందుకు వారు సమ్మతించకపోవడంతో చేసేది లేక ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం కొందరు అప్లికేషన్ పరిశీలన కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే దినసరి వేతన ఉద్యోగి ఒకరు 60ఏళ్ళ వయస్సు దాటడంతో ఉద్యోగ విరమణ చేశారు. కొద్ది రోజుల గ్యాప్ తరువాత ఆయనన మళ్ళీ వర్సిటీలో ఉద్యోగం చేస్తున్నారు. అదీను కీలకమైన ఫైనాన్స్ విభాగంలో ఆడిట్ సమస్యలు పరిష్కారం కోసం అంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు వేతనం రూ.30వేలకు పైమాటే. అయితే ఆ వేతనం వర్సిటీ చెల్లిస్తుందా...? లేక ఇతర సంస్థ చెల్లింపులు చేస్తుందా అనేది తెలియాల్సి ఉంది. ఆయనను ఉదాహరణగా తీసుకుని కొందరు ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు మెల్లమెల్లగా వర్సిటీలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వారి రాకపై ఉద్యోగుల్లో వ్యతిరేకత కనిపిస్తుంది. దీనినిబట్టి చూస్తే ఏఎన్‌యు ఉద్యోగ విరమణ ఉండదనే భావన నెలకొంది. ఇప్పటికే వర్సిటీ అధికారులు తీసుకున్న పలు నిర్ణయాల వల్ల ఇబ్బందులు వస్తున్నాయి.

# సబ్ స్టేషన్‌లో నూతన పరికరం ఏర్పాటు

## మెగా వోల్ట్ యాంపియర్ సామర్థ్యాన్ని 5 నుంచి 8కి పెంపు

పొన్నూరు, సెప్టెంబర్ 4,(ప్రభాతవార్త: స్వర్ణపురి పట్టణం, మండలంలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను ఎక్కువ తక్కువలు లేకుండా(లోవోల్టేజి) అందించేందుకు విద్యుత్‌శాఖ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతనంగా పవర్ ట్రాన్స్ ఫార్మర్(పిటిఆర్)-2ను ఏర్పాటు చేసింది. సబ్ స్టేషన్‌లో మెగా వోల్ట్ యాంపియర్(ఎంవిఏ) సామర్థ్యాన్ని 5ఎంవిఏ నుంచి 8ఎంవిఏకు పెంచుతూ దీన్ని ఏర్పాటు చేశారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ప్రధాన గ్రిడ్‌ల నుంచి వచ్చే అత్యధిక వోల్టేజిని తగ్గించి అవసరమైన మేరకు పంపిణీ చేయడానికి ఈ పరికరం సహాయపడుతుందని అధికారులు చెప్పారు. వీటి సామర్థ్యాన్ని మెగా వోల్ట్ యాంపియర్లలో కొలుస్తారు. దీని వల్ల విద్యుత్ నష్టాలను తగ్గించడంతోపాటు వోల్టేజి స్థాయిలను పెంచేందుకు ఉపయోగపడు తుందన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దీన్ని ఏర్పాటు చేయడంలో అధికారులందరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎట్టకేలకు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖాధికారులు టిఆర్‌ఇ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సూర్యప్రకాష్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ చిట్టిబాబు, ఎఈ ఎర్నెస్ట్, ప్రొటక్షన్ ఏఈ విశ్వనాథ్, ఆపరేషన్ విభాగం ఈఈ అక్కల సత్యనారాయణ, డిఇ బోరుగడ్డ అశోక్‌కుమార్, ఎఈలు రావూరి విజయ శంకరరావు, నామా నాగరాజు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు

**ములుకుదురు(పొన్నూరు), సెప్టెంబర్ 4,(ప్రభాతవార్త):** మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో వేంచేసియున్న శ్రీ భూ నీళా సమేత శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. శ్రావణమాసంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ద్వారా శుభాలు, సుఖాలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం. అర్చకస్వాములు సామూహిక కుంకుమార్చనలకు సంబంధించిన పూజాధికార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు పాల్గొని స్వామి, అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. భక్తులు తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వహణాధికారి నిడమానూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీనియర్ అసిస్టెంట్ జయదేవ్ ఏర్పాట్లు చేశారు.



# పెదవడ్లపూడి గోశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**మంగళగిరి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** పెదవడ్లపూడి శ్రీ భగవాన్ సత్య షిరిడి సాయిబాబా మందిరం గోమాత గోశాలలో శుక్రవారం రాత్రి శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గోశాల ఆవరణలోని శ్రీ కృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరం చైర్మన్ పాతూరి నాగభూషణం, గోశాల కన్వీనర్ పాతూరి శ్రీనివాసరావు, శ్రీమతి రాధిక దంపతులు పూజలు నిర్వహించారు. చిన్నారుల బాలకృష్ణుని, గోపికల వేషధారణలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఉట్టి ఉత్సవం ఆనందోత్సవాల మధ్య ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ పాతూరి మాట్లాడారు. శ్రీ కృష్ణుడు చిన్నతనంలో చేసిన అల్లరి పనులు మంచికే జరిగాయన్నారు. శ్రీ కృష్ణ భగవానుడు భగవద్గీత ద్వారా 718 శ్లోకాలు బోధించారన్నారు. ప్రపంచంలో ఏ మత గ్రంథంలోనైనా భగవద్గీతలోని సారాంశమే ఉంటుందన్నారు. పిల్లలు భగవద్గీత పఠనం, కృష్ణుని జీవిత చరిత్ర తెలుసుకోవడం ద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు.



# ప్రతి ఒక్కరూ భారతీయ సంస్కృతి,సంప్రదాయాలను గౌరవించాలి

## మలినేని విద్యాసంస్థల చైర్మన్ పెరుమాళ్లు.

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** విద్యార్థులు విద్యతోపాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని వాటిని గౌరవించాలని మలినేని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు



పేర్కొన్నారు. మండలంలోని పుల్లడిగుంట గ్రామ పరిధిలో ఉన్న మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డా.పెరుమాళ్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..శ్రీకృష్ణుని జీవితం, ఆయన బోధించిన ధర్మం, కర్తవ్యనిష్ఠ, ధైర్యం, సత్యం వంటి విలువలను విద్యార్థులు తమ జీవితంలో ఆచరించాలన్నారు. ఈ వేడుకలు భక్తి, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనంగా ఉత్సాహభరిత వాతావరణంలో సాగేయని తెలిపారు. శ్రీకృష్ణుని బోధనలు నేటి యువతకు ఎంతో అవసరమని, విద్యార్థులు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహనతో పాటు ఐక్యత, ఆనందం, సృజనాత్మకతను పెంపొందించాయని పేర్కొన్నారు. అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కిశోర్ బాబు మాట్లాడుతూ..శ్రీకృష్ణుని జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయక మని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. సైన్స్ హ్యూమానిటీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఏఎస్కె చైతన్య మాట్లాడుతూ..శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, నైతిక విలువలకు ప్రతీకని వివరించారు. విద్యార్థులు తమ ప్రతిభను సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వెలికితీయడం అభినందనీయమన్నారు.

వేడుకల్లో భాగంగా విద్యార్థినులు కోలాటం, సాంస్కృతిక నృత్యాలు, స్కిట్లు, భక్తి గీతాలు, మేళం, తదితర కార్యక్రమాలను ఉత్సాహంగా ప్రదర్శించారు. విద్యార్థినుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు పాల్గొనడంతో కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. అనంతరం సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.అప్పారావు, డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు, ఎస్ హెచ్ హెచ్‌ఓడి ప్రొఫెసర్ ఏఎస్కె చైతన్య, అన్ని విభాగాల డీన్లు, హెచ్‌ఓడిలు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

# బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న పుల్లడిగుంట భక్తులు

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** ప్రత్తిపాడు నియోజకవర్గం, వట్టి చెరుకూరు మండలం, పుల్లడి గుంట గ్రామంలోని



ఉప్పుటూరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి పండుగ సందర్భంగా మహిళా భక్తులు అమ్మలగన్న అమ్మ బెజవాడ కనకదుర్గమ్మను శ్రావణమాసం నాలుగవ శుక్రవారం దర్శించుకున్నారు.అమ్మవారికి చీర, సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఉప్పుటూరి సేవా ట్రస్ట్ అధినేత, పుల్లడిగుంట గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఉప్పుటూరి చినరాములు మాట్లాడుతూ..ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టుదలతో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాశ్వత రాజధానిఅమరావతికి చట్టబద్ధత కల్పించినందుకు, ఏడాది వర్షాలు బాగా కురిసి, రైతుల పంటలకు మంచి దిగుబడులు ఇవ్వాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు, చీర, సారెలను సమర్పించిన్నట్లు వివరించారు. రాజధాని ప్రాంతం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడుతుండటం, చట్టబద్ధమైన గుర్తింపు లభించడంతో మండల వాసులు, పుల్లడిగుంట గ్రామ భక్తులు ఈ యాత్రతో అమ్మవారిని దర్శించుకున్నట్లు పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు, దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి ఇంట సుఖసంతోషాలు, శాంతి, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నిండాలని, ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు, ఆనందం వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలియజేశారు. ఈ యాత్ర కోసం ఉప్పుటూరి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత బస్సు, భోజనం, త్రాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మండలంలోని అనేకమంది భక్తులు దుర్గమ్మ తల్లిని దర్శించుకునేందుకు ఈ యాత్రలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులందరూ ఉప్పుకూరి సేవా ట్రస్ట్ అధినేతకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎస్‌జిటి పుల్లగూర సాయి విశ్వనాథ్ ఎంపిక

**గుంటూరు విద్య సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** ఎంసిపిఎస్ నెంబర్ 91 నేతాజీ నగర్, ఏటి అగ్రహారం, గుంటూరు స్కూలు నందు ఎస్ జి టి గా పనిచేస్తున్న పుల్లగూర సాయి విశ్వనాథ్ గుంటూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని శంకర్ హాల్లో జరిగే జిల్లా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ ఇతర ప్రముఖుల చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సాయి విశ్వనాథ్ అందుకోనున్నారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడం, ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపించడం, చదువుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించడం, విద్యార్థుల్లో సృజనాత్మకత మరియు ఆసక్తిని పెంపొందించడం వంటి అనేక అంశాలు ఆయనకు అవార్డు రావడానికి దోహదపడ్డాయి. బోధనలో వినూత్న పద్ధతులను అవలంబిస్తూ, తక్కువ ఖర్చుతో తయారు చేసిన బోధనా అభ్యసన సామగ్రిని ఉపయోగించడం, ఐ సి టి ఆధారిత బోధనను ప్రోత్సహించడం, విద్యార్థులను సహపాఠ్య మరియు సృజనాత్మక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం వంటి అనేక కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాను.అదేవిధంగా పాఠశాల అభివృద్ధి, తల్లిదండ్రుల భాగస్వామ్యం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, పాఠశాల పట్ల సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించడం కోసం విద్యార్థి కేంద్రీకృత అభ్యాసన కార్యక్రమాలలో చేసిన విశేష కృషి కూడా ఈ అవార్డుకు ఎంపిక కావడానికి సాయి విశ్వనాథ్ కు దోహదపడ్డాయి.



# జనసేన కార్యకర్తల పై భౌతిక దాడులు

## -తీవ్ర ఇబ్బందులు పడుతున్న జనసేన శ్రేణులు - చర్యలు తీసుకోవాలని డిమాండ్.

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గం, వట్టిచెరుకూరు మండలం, ముట్లూరు గ్రామంలో కూటమి పార్టీలైన టీడీపీ-జనసేన మధ్య వివాదం తారాస్థాయికి చేరిందని జనసేన సీనియర్ నాయకుడు ప్రత్తి పాపారావు ఆరోపించారు. దీనికి సంబంధించి ముట్లూరు గ్రామంలో జనసేన పార్టీ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ సీనియర్ నేత ప్రత్తి పాపారావు ఆ పార్టీ నేతలతో కలిసి మాట్లాడుతూ.. మండలంలో అతి పెద్ద మేజర్ పంచాయతీ గ్రామం ముట్లూరులో కూటమి పార్టీలోని టీడీపీ వర్గీయులు జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులపై భౌతిక దాడులు చేస్తున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులతో జనసేన పార్టీ శ్రేణులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నా యని తెలిపారు. . ముట్లూరు, కారంపూడిపాడు, కోవెలమూడి గ్రామాల్లో జనసేన కార్యకర్తలతో, సానుభూతిపరులతో వివాదాలకు దిగుతూ భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గత నెల 31వ తేదిన గుంటూరు నుంచి ముట్లూరు వైపు వస్తున్న జనసేన కార్యకర్తపై లేమల్లెపాడు సమీపంలోని హిందూ స్మశానవాటిక వద్ద కల్యాణ్ చక్రవర్తితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని చెప్పారు. గతంలో కూడా ఆయా గ్రామాల్లో ఇలాంటి ఘటనలు అనేకం జరిగినట్లు తెలిపారు. వాటిపై కుడా సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. కల్యాణ్ చక్రవర్తిపై వట్టిచెరుకూరు పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదై ఉన్నట్లు సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన పోలీసు పత్రాలను బహిరంగంగా చూపించారు. జనసేన పార్టీ కట్టుబాట్లను గౌరవిస్తూ తాము సంయమనం పాటిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి కూటమి నాయకత్వం వెంటనే స్పందించి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని, కల్యాణ్ పై పార్టీ పరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిస్థితి మరింత చేయిదాటకముందే జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఈ విషయంపై దృష్టి సారించి పార్టీ శ్రేణులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చూస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు ఎనుముల రాంబాబు, ప్రత్తి తంబి, యానాదయ్య, అల్లం రంగారావు, తదితర జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రిజర్వేషన్ వర్గాల విద్యార్థులకు ఎంబిబిఎస్ అడ్మిషన్స్‌లో అన్యాయం

## మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

**గుంటూరు విద్య సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసిన మెడికల్ అడ్మిషన్లలో రిజర్వేషన్ వర్గాల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానికంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఆయా విషయాలను వెల్లడించారు. 2026 లో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన మెడికల్ అడ్మిషన్స్ లో ఏ యూ రీజియన్ లో ఓపెన్ కాంపిటిషన్ కట్ ఆఫ్ ర్యాంక్ 71547 అని తెలిపారు.ఓపెన్ కాంపిటీషన్ కట్ ఆఫ్ ర్యాంకు కన్నా బెటర్ ర్యాంకు సాధించిన 43 మంది రేజర్వేషన్ క్యాటగిరి విద్యార్థులకు నిబంధనల ప్రకారం ఓపెన్ క్యాటగిరిలో సీటు కేటాయించవలసి ఉండగా రిజర్వేషన్ల సీట్లు కేటాయించారనీ వెల్లడించారు.అదేవిధంగా ఎస్ వి యు రీజియన్ లో ఓపెన్ కాంపిటీషన్ కట్ ఆఫ్ ర్యాంకు 94966 అనిఓపెన్



కాంపిటీషన్ కట్ ఆఫ్ ర్యాంకు కన్నా బెటర్ ర్యాంకు సాధించిన 27 మంది రిజర్వేషన్ క్యాటగిరి విద్యార్థులకు నిబందనల ప్రకారం ఓపెన్ క్యాటగిరిలో సీటు కేటాయించవలసి ఉండగా రిజర్వేషన్ల సీట్లు కేటాయించారనీ ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో సుప్రీంకోర్టు ఓపెన్ కాంపిటీషన్ కన్నా బెటర్ మార్కులు సాధించిన రిజర్వేషన్ కేటగిరి అభ్యర్థులను ఓపెన్ క్యాటగిరి గానే పరిగణించాలని అనేకసార్లు చెప్పింది. గతంలో ఉన్న జీవో నెంబర్ 151 అమలు చేసినట్లయితే ఓపెన్ కాంపిటీషన్ కటాఫ్ ర్యాంకు కన్నా బెటర్ ర్యాంకు వచ్చిన ప్రతి రిజర్వేషన్ అభ్యర్థి ఓపెన్ కాంపిటీషన్ లోనే ఉండేవాడు. కానీ మన రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ కేటగిరి విద్యార్థులకు హాని చేయటం కొరకు కొత్తగా తెచ్చిన జీవో నెంబర్ 102 వలన సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అతిక్రమించినట్లు అయ్యిందనీ ఆరోపించారు.జీవో నంబర్ 102 ప్రకారం మెడికల్ అడ్మిషన్లు జరిగినట్లయితే రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ ముందే ప్రభుత్వ అధికారులకు తెలియజేసిందనీ స్పష్టం చేశారు.అయినా మా సూచనలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకపోవడం వల్ల ఈరోజు ఇంతమంది రిజర్వేషన్ వర్గాల విద్యార్థులు నష్టపోయారు. కనుక తక్షణమే జీవో నంబరు 102 ను రద్దు చేయాలి. రిజర్వేషన్ వర్గాలకు నష్టం లేకుండా జీవో నెంబర్ 151 లో ఎటువంటి మార్పులు చేసిన మాకు అభ్యంతరం లేదు. నిబందనలకు విరుద్ధంగా జరిగిన ఎంబిబిఎస్సీ అడ్మిషన్లు తక్షణమే రద్దుచేసి జీవో నెంబర్ 151 ప్రకారము అడ్మిషన్ జరపవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు.

# ఘనంగా కాసుల పురుషోత్తమ కవి జయంతి మహోత్సవాలు

**గుంటూరు విద్య సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** గుంటూరు సంపత్‌నగర్‌లోని శృంగేరి శారదాపీఠంలో దివ్యశ్రీ కాసుల పురుషోత్తమ కవి జయంతి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, సాహితీ సాంస్కృతిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యులు బోడేపూడి వెంకట సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారుఈ సందర్భంగా పురుషోత్తమ కవి సాహిత్య, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సేవలను పలువురు స్మరించుకున్నారు. తెలుగు సాహిత్యం, సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించడంలో కవులు, సాహితీవేత్తలు అందించిన సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు.జయంతి మహోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు కవి సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. బోడేపూడి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, తెలుగు భాషా సాహిత్య పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. కవులు, సాహితీవేత్తల రచనలు సమాజానికి నైతిక విలువలను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని అందిస్తాయని



తెలిపారు.కాసుల పురుషోత్తమ కవి రచించిన అంధనాయక శతకం పద్యాలను 108 మంది పిల్లలచే గానం చేయించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు సంప్రదాయ సాహిత్యాన్ని, పద్యాలను ఆలపించడం అభినందనీయమని బోడేపూడి వెంకట సుబ్బారావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండూరువెంకటరమణ, సిఎస్ఆర్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగార్జున యూనివర్సిటీ, అనిల్ కుమార్, కొత్తపేట శివాలయం డైరెక్టర్, కత్తి వెంకటేశ్వరరావు అధికార భాషా ప్రతినిధి, వెంకటరమణారావు,శిల్పిశ్రీనాథ్, శిశు విద్యా మందిర్ డైరెక్టర్, దివ్యశ్రీ కాసుల పురుషోత్తమ కవి నిర్వాహకులు కాసుల కృష్ణంరాజు , సాహితీవేత్తలు, ఆధ్యాత్మిక ప్రముఖులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో విజయవంతంగా ముగిసింది.

# ఈనెల 6న ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఉపాధ్యాయ దినోత్సవం

**గుంటూరు విద్యా సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ గుంటూరు కరస్పాండెంట్స్ అందరూ కలిసి ఐక్యంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు సెప్టెంబర్ 6వ తేదీ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి ఎస్ ఎస్ ఫంక్షన్ హాల్ ఏటి అగ్రహారం ఎస్‌కేబిఎం స్కూల్ పక్కన జరుగుననీ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో అసోసియేషన్ కో చైర్మన్ మేకల రవీంద్రబాబు ,రాష్ట్ర కోశాధికారి చెరుకూరి



శ్రీహరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వంగా శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షులు నర్రా రాజేష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేకల రవీంద్రబాబు మాట్లాడుతూ శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన వేడుకలలో భాగంగా ఉపాధ్యాయులను స్కూల్ డైరెక్టర్స్ ను సన్మానించడం జరుగుతుందన్నారు. సాయంత్రం ఏడు గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అసోసియేషన్ లోని అన్ని ప్రైవేట్ స్కూల్స్ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని మేకల రవీంద్రబాబు తదితర అసోసియేషన్ నాయకులు కోరారు.

# శ్రీ వికాస్ విద్యాసంస్థలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**గుంటూరు విద్య సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

నెహ్రూనగర్‌లోని శ్రీవికాస్ స్కూల్ ఆవరణలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఘనంగా వేడుకలను నిర్వహించారు. కృష్ణుని భోదనలు, మహాభారతం,భగవద్గీతలలో కృష్ణుని చర్యలు,ప్రతి చర్యలు,



సందర్భాను సారం ఆయన స్పందనలు మానవాళికి మార్గదర్శకాలని శ్రీవికాస్ స్కూల్స్ "డీన్ శ్రీదేవి రాజామాష్టారు"అన్నారు ఈ సందర్భముగా శ్రీకృష్ణ భగవానుని గురించి,భగవద్గీత గురించి విద్యార్థినీ, విద్యార్థులకు వివరించారు..శ్రీకృష్ణ,రాధ ల విగ్రహానికి చిన్నారులు పూజలు చేశారు,పూలమాలలు వేశారు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ భాస్కర రావు, బిందు టీచర్,మహాలక్ష్మి, తేజ,పుష్పలత తదితరులు పాల్గొన్నారు..

# శ్రీ మేధ విద్యా సంస్థలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**గుంటూరు విద్య సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శ్రీమేధ బ్రాడీపేట క్యాంపస్ లో అంగరంగ వైభవంగా విద్యార్థుల కోలాహలం మధ్య శుక్రవారం నాడు నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ అన్నా నంద కిషోర్ , కరెస్పాండెంట్ అన్నా శ్రీలక్ష్మిలు ముందుగా శ్రీకృష్ణుని చిత్ర పటానికి పూజలు చేసి క్యాంపస్ ముందు ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధర్మం వృద్ధి చెందినపుడు ధర్మసంస్థాపన కొరకు దాల్చిన అవతారమే శ్రీకృష్ణ పరమాత్ముడని అన్నారు. వెన్న దొంగగా బాల్యం లో గోపికల ఇళ్లలోని



ఉట్టి లో వున్న వెన్న మీగడలు దొంగిలించి వారి పాపాలను హరించాడన్నారు. భగవద్గీత ద్వారా, సామాన్య జీవితాన్ని ఎలా జీవించాలో, ధర్మం ఎలా పాటించాలో, సంక్లిష్ట పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడానికి కావలిసిన ధైర్యాన్ని బోధించారన్నారు. అనంతరం విద్యార్థులు ఉట్టి కొట్టు కార్యక్రమాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, శ్రీమేధ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన ఓగిబోయిన నాగార్జున


**గుంటూరు విద్య సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా నుండి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కాబడి, ఉపాధ్యాయ దినోత్సవం సెప్టెంబర్ 5న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుని పురస్కారం అందుకోబోతున్న మంగళగిరి పట్టణంలోని



కాంద్రుకమల మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 జిల్లా అదనపు కార్యదర్శి ఓగిబోయిన నాగార్జున కి ఏపీటీఎఫ్ 1938 గుంటూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మేకల సుబ్బారావు కె. నరసింహారావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన నాగార్జున 2000 డీఎస్సీ లో స్కూల్ అసిస్టెంట్ సోషల్‌గా ఎన్నిక కాబడి, 2025 జూన్ నుండి ప్రధాన ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. ఆయన ఉద్యోగంలో చేరిన రోజు నుండి నేటి వరకు నిరంతరం విద్యార్థులకు బోధన మరియు పాఠశాల అభివృద్ధి కొరకు శక్తివంచన లేకుండా కష్టపడి పనిచేసేవారని ఆయనతో కలిసి పనిచేసిన ఆయన సహచర్లు తెలియజేశారు. గడచిన 26 సంవత్సరాలలో అత్యవసరమైతే తప్ప పాఠశాలకు సెలవు పెట్టిన సందర్భాలు చాలా తక్కువ అని వారు తెలియజేశారు. లీప్ యాప్ ద్వారా ఇటువంటి విలువలు కలిగి అంకితభావంతో పనిచేసే వారికి వినూత్న పద్ధతిలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నిక చేయడం మంచి నిర్ణయమని ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి ధన్యవాదాలు తెలిపారు

# మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** ఈరోజు రోటరీ క్లబ్ పండరీపురం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ లో భాగంగా స్థానిక మద్ది నగర్, జాకీర్ హుస్సేన్



కాలనీ నందు కాలనీవాసుల కోరిక మేరకు 50 జామ మొక్కలను నాటడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ గవర్నర్ శ్రీ కాపు వెంకట్రావు గారు పాల్గొనడం జరిగినది. మరియు అధ్యక్ష కార్యదర్శులు లంకా ఆదినారాయణ రెడ్డి, పోపూరి వెంకటరమణ, దాసునాయనా, భాస్కర్ రెడ్డి ,సుధాకర్ రెడ్డి, తోట శ్రీనివాసరావు, అలంగా ర్ మోహన్ మరియు కాలనీ సభ్యులు పాల్గొన్నారు

# మార్కాపురంలో నేడు ఘనంగా ఉట్ల పండుగ

## ఆలయ కార్య నిర్వాహణధికారి గొలమారి శ్రీనివాసరెడ్డి

మార్కాపురం, సెప్టెంబర్ 4,ప్రభాతవార్త : పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఉట్ల పండుగను శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉట్ల పండుగ సందర్భంగా సెప్టెంబర్ 5న సాయంత్రం 5 గంటలకు దేవస్థానం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉట్ల మండపంలో ఉట్లు కొట్టు కార్యక్రమంనిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో స్వామివారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉట్ల కొట్టు వేడుకలను తిలకించి స్వామివారి ఆశీస్సులు పొందాలని దేవస్థానం కార్య నిర్వహణాధికారి గొలమారి శ్రీనివాసరెడ్డి కోరారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయనున్నట్లు తెలిపారు. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై ఉట్ల పండుగ వేడుకల్లో పాల్గొనాలని దేవస్థానం నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# 6న అవగాహనలో ఆరోగ్యసభ

**గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 4,ప్రభాతవార్త :** స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఈఆదివారం గుండె జబ్బులపై సమగ్ర అవగాహన సభ ఏర్పాటు చేయబడింది.అవగాహన సంస్థ గత 18సంవత్సరాలుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న సెప్టెంబర్ 6వ తేది ఆదివారం ఉదయం 11గంటలకు జరిగే ఆరోగ్యసభలో సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ జి.ఎస్.శ్రీనివాసరెడ్డి ప్రధానవక్తగా పాల్గొని ప్రసంగిస్తారు .ఆరోగ్యసభలో బిపి,షుగర్,థైరాయిడ్ వ్యాధులు,గుండెజబ్బులపై వచ్చిన ఆధునిక చికిత్సల గురించి వివరిస్తారని ఆరోగ్యసభ నిర్వాహకులు,సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. ఆరోగ్యాభిలాషులందరూ ఈ ఆరోగ్యసభకు హాజరు కావాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.


# వెలిగండ్లలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**కొనకనమిట్ల, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** మండలంలోని వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలతో అలరించారు. శ్రీకృష్ణుని బాల్య ఘట్టాలను ప్రతిబింబించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్16 అభివృద్ధి పనుల నిధుల కేటాయింపు,పనుల అప్పగింత పై ప్రత్తిపాటి హర్షం

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** చిలకలూరిపేట అడ్డరోడ్డు (రామచంద్రాపురం) నుంచి పట్టణం మధ్య నుంచి తిమ్మాపురం వరకు ఉన్న పాత ఎన్.హెచ్16 అభివృద్ధి నిమిత్తం నిధుల కేటాయింపుపై హర్షం వ్యక్తం చేస్తున్నాను. రహదారి అభివృద్ధికి రూ.27.82 కోట్ల నిధుల మంజూరు, పనుల ప్రారంభం దిశగా టెండర్లు పిలవడాన్ని నేను, ఎంపీ లావు స్వాగతిస్తున్నాం. రహదారి సమస్యలు, తద్వారా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గురించి ఇరువురం పలుమార్లు జాతీయ రహదారి ప్రాధికార సంస్థ అధికారులతో మాట్లాడటం జరిగింది. ఎట్టకేలకు సమస్య పరిష్కారం దిశగా ఎన్. హెచ్.ఏ.ఐ చొరవ చూపడం నిజంగా అభినందనీయం. వన్ టైమ్ ఇంప్రూవ్ మెంట్ కింద చేపట్టే రహదారి అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి ఇకపై ఆ మార్గంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని నేషనల్ హైవేస్ అధికారులకు సూచిస్తున్నాం.

రహదారి మరమ్మతులు, నిర్వహణ లోపాలవల్ల తరచూ జరిగే ప్రమాదాలతో అధిక ప్రాణ నష్టం జరగడం.. అనేక కుటుంబాలు తమవారిని కోల్పోయి రోడ్డున పడటం జరిగింది. అతి ప్రధాన సమస్య పరిష్కారం దిశగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, నేను పలుమార్లు జాతీయ రహదారుల విభాగంతో మాట్లాడటం జరిగింది. గత నెల 26న స్థానిక అడ్డరోడ్డు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 8 మంది మరణించడం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు ఎంత కృషి చేశామో, జాతీయ రహదారి సమస్య సమస్య పరిష్కారానికి అంతే కృషి చేశాము. ప్రమాదం అనంతరం పలుమార్లు హైవేస్ అథారిటీతో చర్చించాం. దుర్ఘటన జరిగిన తీరును గమనించి, భవిష్యత్ లో మరిన్ని



ప్రమాదాలకి ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలన్న తమ సూచనను ఎట్టకేలకు అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. ప్రజాక్షేమం దృష్ట్యా జాతీయ రహదారుల సంస్థ త్వరలో ప్రారంభించే అభివృద్ధి పనుల్ని నిర్దేశిత కాలపరిమితి లోగా పూర్తయ్యేలా చూడాలి. తరచూ జరుగుతున్న ప్రమాదాలు, వాహనదారుల సమస్యల పరిష్కారానికి శాశ్వత ముగింపు పలకాలి. 13 కిలోమీటర్ల మేర పాత ఎన్. హెచ్ 16 ఆధునీకరణ పనుల ప్రారంభానికి మార్గం సుగమమైనందుకు నియోజకవర్గ ప్రజల తరుపున ఎన్. హెచ్ ఏ.ఐ యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.అని ప్రత్తిపాటి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# సామాజిక పింఛన్లు ప్రజలకు జీవనాధారంగా మారాయి : ప్రత్తిపాటి

- పింఛన్ల పంపిణీని ముఖ్యమంత్రి ఒక ఉద్యమంలా కొనసాగిస్తున్నారు...
- కొత్త పింఛన్ల మంజూరులో వితంతువులకే తొలి ప్రాధాన్యత...
- తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడండి...
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక గొప్ప ఆశయంతో పేదల సేవలో కార్యక్రమానికి మెరుగులు దిద్దారని, సామాజిక పింఛన్ల పంపిణీని ఒక ఉద్యమంలా కొనసాగిస్తున్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ప్రభుత్వం 3 లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేసిందని, వాటిలో తొలి ప్రాధాన్యత వితంతువులకే



ఉంటుందని ఆయన చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక నివాసం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి స్వీకరించిన వినతుల్ని క్షుణ్ణంగా పరిశీలించిన ప్రత్తిపాటి, వాటి పరిష్కారంపై అర్జీదారుల ఎదుటే అధికారులతో మాట్లాడారు. ఆగస్ట్ నెలలో గ్రీవెన్స్ పరంగా వచ్చిన అర్జీల్లో ఎన్ని పరిష్కరించారని వారిని ప్రశ్నించిన ప్రత్తిపాటి.. మౌలిక వసతుల కల్పన సమస్యల అర్జీలను 2, 3 రోజుల్లోనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన అర్జీదారులను ఉద్దేశించి మాట్లాడారు.

**40 రోజుల్లో కోటికిపైగా ఇళ్లకు వెళ్లడం.. సరికొత్త రికార్డు**

చంద్రబాబు నాయకత్వంపై ప్రజలకు అపారమైన నమ్మకం ఏర్పడిందని, ప్రజాప్రభుత్వాన్ని వారు ఆదరిస్తున్న తీరు, అభిమానిస్తున్న విధానానికి ఇంటింటికీ తెలుగుదేశం విజయవంతమే నిదర్శనమని ప్రత్తిపాటి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణులు 40 రోజుల్లోనే కోటికిపైగా ఇళ్లకు వెళ్లి, ప్రజలతో నేరుగా మమేకం అవ్వడం ఒక సరికొత్త రికార్డు అని ఆయన అభిప్రాయపడ్డారు. స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల సాధించబోయే ఘన విజయానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు.

**సామాజిక పింఛన్లు జీవనాధారంగా మారాయి..**

కూటమి ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్లు గ్రామీణ ప్రజలకు ప్రధాన జీవనాధారంగా మారాయని, ముఖ్యంగా గిరిజనులకు ప్రతినెలా 1న అందే ప్రభుత్వ సాయం వారికి ఎనలేని మేలు చేస్తోందన్నారు. ప్రజల ఆదరాభిమానాలు, మద్దతే కూటమి ప్రభుత్వానికి నిజమైన బలమన్న ప్రత్తిపాటి, ప్రజా సంక్షేమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పాలనా విధానాల్ని అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. రోడ్లు, డ్రైన్లు, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారంలో మున్సిపల్ యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. నియోజకవర్గానికి తాగునీరు అందించే ప్రధాన చెరువులన్నింటినీ పూర్తిగా నీటితో నింపాలని, నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందుల లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆయన ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు, ఎస్.ఎస్. సుభాని, గట్టినేని రమేష్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ బాధితురాలికు రూ.25,122 నగదు సాయం

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** చిలకలూరిపేట పట్టణానికి చెందిన షేక్ షఫీ కుమార్తె షబీనా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స అనంతరం నిరంతరం మందులు, వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది. ఇందుకు ప్రతి నెలా వేలాది రూపాయలు ఖర్చవుతుండటంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న సామాజికవేత్త, అడ్వకేట్ మాదాసు భాను ప్రసాద్ స్పందించారు.షబీనా వైద్య ఖర్చులకు తన వంతు సహాయం అందించడంతో పాటు, వాట్సాప్ గ్రూప్ ద్వారా పలువురి సహకారంతో రూ.25,122/ నగదును సేకరించారు. అనంతరం గుంటూరులో చికిత్స పొందుతున్న షబీనాను పరామర్శించి, ఆమె తండ్రి షేక్ షఫీకి ఆ నగదును అందజేశారు.ఈ సందర్భంగా భాను ప్రసాద్ మాట్లాడుతూ, షబీనా వైద్య చికిత్సకు స్పందించి విరాళాలు అందించిన ప్రతి



ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దాతలు అందించిన సహాయం షబీనా వైద్య ఖర్చులకు ఎంతో ఉపయోగపడుతుందని, ఆమె త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ధైర్యంగా జీవితంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఆపదలో ఉన్న వారికి తమకు తోచిన విధంగా సహాయం చేయడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని భాను ప్రసాద్ పేర్కొన్నారు.

# జేపీసీ సమావేశంలో ఉద్యోగులు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : ఎస్టియు

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** ఉపాధ్యాయులు ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సమయం ఆసన్నమైందని ఈ సమావేశంలో



ముఖ్యమంత్రి ఉద్యోగులు ఉపాధ్యాయుల దీర్ఘకాల సమస్యలపై పరిష్కారం చూపాలని ఎస్టియు కోరుతుందని రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు తెలిపారు చిలకలూరిపేట పట్టణంలోని ఎస్టియు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రేపు అనగా ఐదవ తేదీ ముఖ్యమంత్రి గారితో ఏర్పాటు చేసిన ఏపీ జేఏసీ ఉద్యోగ ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్యంగా పెండింగ్ బకాయిలు చెల్లించాలని, 12వ పిఆర్సి కమిషన్ వేసి ఐఆర్ 30 ప్రకటించాలని, పెండింగ్లో ఉన్న 5డిఏల్లో రెండు డిఏలు ప్రకటించాలని, ఉపాధ్యాయుల హెల్త్ కార్డులు అమల్లోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని ఉద్యోగుల ఉపాధ్యాయుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా పాలనాపరంగా ఎటువంటి ఒత్తిడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎస్టియు కోరుతుందని తెలిపారు,ఈ సమావేశంలో ఎస్టియూ జిల్లా నాయకులు బొంత రవికుమార్, షేక్ జమీర్ భాష,యం,శారద,పట్టణ, మండల నాయకులు మేకల, కోటేశ్వరరావు, వడ్లన,జయప్రకాష్, షేక్ మక్బూల్ బాషా, డి.దుర్గాప్రసాద్, జి,కోటేశ్వరరావు,జి సతీష్ కుమార్,షేక్ మస్తాన్‌వలి,వి రమణ నాయక్, సిహెచ్ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

**యడ్లపాడు,సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని యడ్లపాడు మండలం చెంగిస్‌ఖాన్‌పేటలోని శ్రీ నవనీత బాలకృష్ణస్వామి (వెన్నముద్ద గోపాలకృష్ణస్వామి) ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు.కృష్ణాష్టమి సందర్భంగా విస్తారంగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శ్రీ వేణుగోపాలస్వామివారిని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు ప్రత్తిపాటి తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలను ఆయన తిలకించారు. అనంతరం



స్వామివారి ఊరేగింపును కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


# చెంగీజ్‌ఖాన్‌పేటలో శ్రీకృష్ణ స్వామివారిని దర్శించుకున్న అదనపు ఎస్పీ

**యడ్లపాడు,సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ శ్రీ రోహిత్ కుమార్ చౌదరి, ఐపీఎస్ ఎడ్లపాడు మండలం చెంగీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని శ్రీకృష్ణ స్వామివారి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అదనపు ఎస్పీకి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలను అందజేశారు. ప్రజలందరికీ శాంతి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు అదనపు ఎస్పీ తెలిపారు.కృష్ణాష్టమి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరిగేలా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానిక పోలీసు అధికారులకు సూచించారు.కార్యక్రమంలో ఎడ్లపాడు ఎస్ఐ శివరామకృష్ణ, పోలీసు సిబ్బంది, ఆలయ అర్చకులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.



# స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ప్రక్కన ఉన్నటువంటి రూత్ డైక్ మ్యాన్ కాలనీ నందు ఏ ఎం జి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్నటువంటి ప్రాథమిక పాఠశాల గడువు పూర్తి కావడంతో ఆ




పాఠశాల భవనాన్ని సదరు స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు పడి వేయడం జరిగింది.దానిలో భాగంగా ఆ స్థలం మున్సిపాలిటీది కావడంతో మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరి బాబు ఆదేశాల మేరకు ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా సీలు వేయడం జరిగింది. పట్టణ పుర ప్రజలు ఈ విషయాన్ని గమనించగలరని, అధికారులు తెలియపరచడం జరిగింది.

# న్యాయవాది రమేష్ పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ మర్రి

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** చిలకలూరిపేట పట్టణ ప్రముఖ న్యాయవాది నక్కా రమేష్ అనారోగ్య సమస్యతో బాధపడుతూ హాస్పటల్ నందు చికిత్స పొందుతూ నిన్న స్వర్గస్తులైనారు. ఈ విషయం తెలుసుకొని వారి స్వగృహం వద్ద ఉన్న వారి పార్దేవ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ



సానుభూతిని సంతాపాన్ని తెలియజేసిన శాసనమండలి సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్. ఈ కార్యక్రమంలో వారివెంట కట్టా జవహర్ గారు, ఆరె కోటి నర్సా రెడ్డి, బండారుపల్లి శ్రీనివాసరావు, పోలిశెట్టి నాగేశ్వరరావు, శివారెడ్డి, ఆదినారాయణ తదితరులున్నారు.

# మహిళల టి20.. నేడే హై ఓల్టేజ్ మ్యాచ్





## చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ ఢీ

**దుబాయ్:** 2026 మహిళల ఆసియా కప్‌లో సెమీ ఫైనల్ స్థానాన్ని ఇప్పటికే ఖరారు చేసుకున్న ఏడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్ జట్టుకు, తమ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో నేడు హై ఓల్టేజ్ మ్యాచ్ జరగనుంది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పాక్‌తో జరిగే గ్రూప్ ఎ చివరి పోరులో తమ విధానాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని టీమిండియా చూస్తోంది. దుబాయ్‌లోని నెమ్మదైన పిచ్‌లపై అసోసియేట్ జట్లు మరోసారి ఆ బలహీనతలను బయటపెట్టడంతో, భారత మిడిల్ ఆర్డర్ ఆశించిన స్థాయిలో రాణించకపోవడం అనే అంశం పరిశీలనకు గురైనప్పటికీ, హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు పాకిస్థాన్‌పై గెలవడానికి స్పష్టమైన ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, ఆమె ఓపెనింగ్ భాగస్వామి షఫాలీ వర్మ, వరుసగా హాంకాంగ్ చైనా, థాయ్‌లాండ్‌లపై 124 మరియు 64 పరుగులు చేసి అద్భుతమైన ఫామ్‌లో ఈ మ్యాచ్‌లోకి వస్తున్నారు. ముఖ్యంగా స్మృతి, గురు వారం రాత్రి పలు రికార్డులు సృష్టించిన తర్వాత బరిలోకి దిగుతోంది. బౌలింగ్ విభాగంలో, పేసర్ నందినీ శర్మ క్రాంతి గౌడ్‌తో కలిసి వికెట్లు తీస్తూ ఆశాజనకంగా కనిపిస్తుండగా, దీప్తి శర్మ వికెట్ల వర్షం కురిపిస్తూనే ఉంది.

ఇదిలా ఉండగా, థాయ్‌లాండ్‌పై తొలి విజయం సాధించడంతో పాకిస్తాన్ సెమీఫైనల్స్ రేసులో నిలిచింది. కానీ వారి బ్యాటింగ్ బలహీనతలు ప్రధాన ఆందోళనగా మిగిలిపోయాయి. ఆట వేగాన్ని నిర్దేశించడానికి పాకిస్థాన్ ఇప్పటికీ టాప్ ఆర్డర్ వికెట్ కీపర్‌బ్యాటర్ మునీబా అలీ, కెప్టెన్ ఫాతిమా సనాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. కానీ, మరింత పటిష్టమైన భారత జట్టుతో పోటీపడాలంటే పాకిస్థాన్ తమ బ్యాటింగ్‌లో గణనీయమైన మెరుగుదల సాధించాల్సి ఉంటుంది. భారత్ జట్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, భారతీ ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్‌కీపర్), జి కమలిని (వికెట్‌కీపర్), అరుంధతి రెడ్డి, ప్రేమ రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని గవాల్, ప్రరంతి గవాల్ శర్మ, పాకిస్థాన్ జట్టులో ఫాతిమా సనా (కెప్టెన్), అయేషా జాఫర్, ఎమాన్ నసీర్, ఈమాన్ ఫాతిమా, గుల్ ఫిరోజా, మొమినా రియాసత్, మునీబా అలీ సిద్దిఖీ (వికెట్‌కీపర్), సదాఫ్ షమాస్, నష్రా సుంధు, సాదియా ఇక్బాల్, సైరా జబీన్, షావాల్ జుల్ఫికర్, ఉమ్మహస్సాని, తుబాహసానా హస్సాన్ ఉన్నారు.





# క్రికెట్ చరిత్రలో తొలిసారి జపాన్‌తో టీమిండియా టి20

**న్యూఢిల్లీ:** ఏషియన్ గేమ్స్-2026 ప్రారంభానికి ముందే భారత్ క్రికెట్ జట్టు చారిత్రాత్మక మ్యాచ్ ఆడనుంది. భారత్, జపాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకల ప్రారంభానికి గుర్తుగా, భారత పురుషుల క్రికెట్ జట్టు ఈ నెల 22న జపాన్‌తో తమ మొట్టమొదటి టి20 అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా జపాన్‌తో ఏకైక టి20లో టీమిండియా తలపడనుంది. భారత్, జపాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవడంలో భాగంగా ఈ ప్రత్యేక మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) ప్రకటించింది. జపాన్ ప్రధాని సనాయె తకైచి, భారత్ ప్రధాని నరేంద్రమోడీల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఇండియా, జపాన్ మధ్య క్రీడల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించడమే దీని లక్ష్యమని బిసిసిఐ ఆ ప్రకటనలో తెలిపింది. కాగా జపాన్‌తో ఆడే భారత జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహించనుండగా, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ, సంజు సామ్సన్, జస్ప్రిత్ బుమ్రా వంటి స్టార్ ప్లేయర్లతో పాటు, వైభవ్ సూర్యవంశీ తదితరులు ఈ మ్యాచ్‌లో ఆడనున్నారు.

## ఇండొనేసియా మాస్టర్స్..

# సెమీస్‌కు అన్మోల్

## అశ్మిత ఓటమి



**పాంటియానాక్:** ఇండోనేషియా మాస్టర్స్ 2026 సెమీస్‌కు భారత్ షట్లర్ అన్మోల్ ఖర్బ్ చేరుకోగా, ప్రపంచ 81వ ర్యాంకర్‌తో అశ్మితా చలిహా ఓటమిపాలైంది. శుక్రవారం నాడు కాలిమంటన్‌లోని పొంటియానాక్‌లో జరిగిన ఇండోనేషియా మాస్టర్స్ 2026 సెమీఫైనల్స్‌కు చేరుకోవడానికి, మూడవ సీడ్ అన్మోల్ ఖర్బ్, చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ చింగ్ పింగ్‌తో మూడు గేమ్‌ల తేడాతో పోరాడి, చివరికి 21-121, 121-14 గెలుపొందింది. అన్మోల్, హువాంగ్‌ల మధ్య జరిగిన తొలి గేమ్ హోరాహోరీగా సాగింది. సగం గేమ్ పూర్తయ్యేసరికి ఆ ఇద్దరు షట్లర్ల మధ్య కేవలం ఒక్క పాయింట్ తేడా మాత్రమే ఉంది. ఆ తర్వాత అన్మోల్, తర్వాతి 14 పాయింట్లలో 10 పాయింట్లు గెలుచుకుని, గేమ్‌ను 21-14 తేడాతో కైవసం చేసుకుని ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. గేమ్ 2 కూడా ప్రారంభంలో అదే రీతిలో సాగింది. కానీ ఈసారి విరామం తర్వాత హువాంగ్ పట్టు సాధించి మ్యాచ్‌ను 1-1తో సమం చేసింది. కాగా క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ 38వ ర్యాంకర్, టాప్ సీడ్ అయిన అష్మిత చలిహాను 21-10, 21-18 తేడాతో ఓడించిన చైనాకు చెందిన ప్రపంచ 81వ ర్యాంకర్ జు వెన్ జింగ్‌తో అన్మోల్ తలపడనుంది.





ఆట


## చైనా మాస్టర్స్.. శ్రీకాంత్ నిష్క్రమణ

# సెమీ ఫైనల్స్‌కు సాత్విక్-చిరాగ్ జోడీ

**షెన్‌జెన్ (చైనా):** మాజీ ప్రపంచ నంబర్ 1, భారత్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్, హాంకాంగ్‌కు చెందిన లీ చెక్ యియు చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపోవడంతో, శుక్రవారం క్వార్టర్ ఫైనల్స్‌లో అతని చైనా మాస్టర్స్ సూపర్ 750 ప్రయాణం ముగిసింది. మరోపక్క భారత్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి విజయంతో సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నారు. శ్రీకాంత్ గట్టిగా పోరాడినా 16-21, 16-21 తేడాతో ఓడిపోవడంతో, ఈ టోర్నమెంట్‌లో భారత్ సింగిల్స్ ప్రస్థానం ముగిసింది. లీతో జరిగిన మ్యాచ్‌లో, శ్రీకాంత్ దూకుడుగా ప్రారంభించినప్పటికీ, ప్రత్యర్థిని ఎదుర్కొలేకపోయాడు. దీంతో లీ తొలి గేమ్‌పై పట్టు సాధించి, 21-16 తేడాతో ముగించాడు. రెండవ గేమ్ మరింత హోరాహోరీగా సాగింది, శ్రీకాంత్ గెలుపుకు చేరువలోనే నిలిచినా ఆట ముగింపు దశలో లీ 14-14తో స్కోరును సమం చేశారు. ఆ తర్వాత జరిగిన తొమ్మిది పాయింట్లలో ఏడింటిని హాంగ్ కాంగ్ షట్లర్ గెలుచుకోవడంతో, శ్రీకాంత్ కేవలం మరో రెండు పాయింట్లు మాత్రమే సాధించగలిగాడు. ఇక భారత పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి శుక్రవారం డెన్మార్క్‌కు చెందిన కిమ్ ఆస్ట్రాప్-ఆండర్స్ స్కారుప్ రాస్ముస్సెన్‌లోకి 21-13, 16-21, 21-21, ప్రవేశించారు. ఆట ప్రారంభమైన మొదటి ఐదు నిమిషాల్లోనే ఇండియన్స్ 11-4తో ఏడు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించారు. ఆట రెండవ భాగంలో డేన్స్ కొంత ప్రతిఘటన చూపి, తమ స్కోరును రెండంకెల సంఖ్యకు పెంచుకున్నప్పటికీ వాటిని అధిగమించి భారత్ జోడీ 16 నిమిషాల్లోనే ఆటను ముగించారు.

## యుఎస్ ఓపెన్..

# ముందంజలో జ్వెరెవ్



**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్‌లో టాప్ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ మరో కఠినమైన ఐదు సెట్ల పోరులో ఫ్రాన్స్‌కు చెందిన క్వెంటిన్ హాలిస్‌ను 6-4, 4-6, 7-6(3), 6-7(3), 6-3 తేడాతో ఓడించి, ఆర్థర్ ఆషే స్టేడియంలో మూడవ రౌండ్‌కు చేరుకున్నాడు. తన తొలి రౌండ్ విజయంలో నాలుగు గంటల 53 నిమిషాల పాటు కోర్టులో గడిపిన కేవలం రెండు రోజుల తర్వాత, నాలుగు గంటల 33 నిమిషాల పాటు సాగిన మరో అర్ధరాత్రి ఉత్కంఠభరితమైన పోరులో జ్వెరెవ్ మళ్లీ తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. ప్రపంచ 52వ ర్యాంకర్ అయిన హాలిస్‌తో తలపడటానికి జర్మన్ ఆటగాడు కుదురుకోవడానికి సమయం తీసుకున్నాడు. కీలకమైన క్షణాల్లో జ్వెరెవ్ తన ఆట స్థాయిని పెంచుకోగా, హాలిస్ మాత్రం ఆ సందర్భాన్ని ఎదుర్కోవడంలో ఇబ్బంది పడాల్సి వచ్చింది. 28 యేళ్ల జ్వెరెవ్ తదుపరి ప్రత్యర్థి చిలీకి చెందిన 25వ సీడ్ అలెజాండ్రో టబిలో. గత ఏడాది జరిగిన యూఎస్ ఓపెన్‌లో జ్వెరెవ్ మొదటి రౌండ్‌లో టబిలోను ఓడించాడు. ఎటిపి హెడ్‌టుహెడ్ రికార్డులో 2-0 ఆధిక్యంలో ఉన్నాడు. జ్వెరెవ్ ఈ సీజన్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్స్‌కు చేరుకోవడం, ఫ్రెంచ్ ఓపెన్ గెలవడం, వింబుల్డన్ ఫైనల్‌కు దూసుకెళ్లడం వంటివి చేశాడు. హాలిస్‌పై సాధించిన విజయంతో, ఈ ఏడాది 20 గ్రాండ్ స్లామ్ మ్యాచ్ విజయాలు నమోదు చేసిన తొలి పురుష ఆటగాడిగా నిలిచాడు. దీంతో 2026లో అతని మేజర్ రికార్డ్ 202కు చేరింది.



## ఆల్‌టైమ్ గరిష్ఠానికి భారత్ ఫారెక్స్ నిల్వలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** భారత్ విదేశీ మారకద్రవ్య నిల్వలు ఆగస్టు 28తో ముగిసిన వారంలో 11.475 బిలియన్ డాలర్లు పెరిగి ఆల్‌టైమ్ గరిష్ఠం 740.803 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. శుక్రవారం ఆర్బీఐ వెల్లడించిన వివరాలప్రకారం అంతకుముందు వారంలోనూ ఫారెక్స్ నిల్వలు 12.422 బిలియన్ డాలర్లు పెరిగి 729.328 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇదే అప్పటివరకు రికార్డు గరిష్ఠంగా ఉంది. అంతకుముందు అత్యధికంగా 728.494 బిలియన్ డాలర్లు ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో నమోదయ్యాయి. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు ప్రారంభం కావడానికి ముందు ఈ రికార్డు నమోదైన తర్వాత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా రూపాయి విలువపై ఒత్తిడి పెరగడంతో పాటు, రూపాయిని స్థిరీకరించేందుకు ఆర్‌బీఐ ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ల విక్రయాలు చేపట్టింది. దీంతో వరుసగా కొన్ని వారాల పాటు దేశ విదేశీ మారకద్రవ్య నిల్వలు తగ్గాయి. దేశీయ కరెన్సీపై తీవ్ర ఒత్తిడి నెలకొన్న నేపథ్యంలో జూన్‌లో ఆర్‌బీఐ రాయితీతో కూడిన ఫారెక్స్ స్వాప్ చర్యలను ప్రకటించిన తర్వాత నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ చర్యల ద్వారా 132 బిలియన్ డాలర్లకు పైగా కొత్త నిధుల ప్రవాహం వచ్చినట్లు సమాచారం. ఆగస్టు 28తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన ఫారెక్స్ కరెన్సీ ఆస్తులు 9.337 బిలియన్ డాలర్లు పెరిగి 600.67 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. డాలర్లలో లెక్కించిన ఫారెక్స్ కరెన్సీ ఆస్తుల విలువలో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికా డాలర్‌యేతర కరెన్సీల విలువల్లో చోటుచేసుకునే పెరుగుదల, తగ్గుదల ప్రభావాలు కూడా ఉంటాయి. ఇదే సమయంలో దేశ బంగారం నిల్వల విలువ 2.191 బిలియన్ డాలర్లు పెరిగి 116.409 బిలియన్ డాలర్లకు చేరుకుంది. మరోవైపు, ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు అంటే ఎస్డీఆర్‌లు 43 మిలియన్ డాలర్లు తగ్గి 18.81 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిదిసంస్థ ఐఎంఎఫ్‌లో భారత్ రిజర్వ్ పొజిషన్ కూడా 11 మిలియన్ డాలర్లు తగ్గి 4.914 బిలియన్ డాల ర్లకు చేరుకున్నట్లు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి.

## అడోబ్ సిఇఒగా అనిల్ చక్రవర్తి



**ముంబయి, సెప్టెంబరు 4:** టెక్ దిగ్గజం అడోబ్‌కు కొత్త సీఈవో రానున్నారు. భారత సంతతికి చెందిన అనిల్ చక్రవర్తి సంస్థ అధ్యక్షుడు, సీఈవోగా బాధ్య తలు చేపట్టనున్నారు. ప్రస్తుత సీఈవో శంతను నారాయణ్ 18 ఏళ్ల తర్వాత పదవి నుంచి తప్పుకోనున్నారు. డిసెంబర్ 1న అనిల్ చక్రవర్తి కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. అదే సమయంలో అడోబ్ బోర్డులోనూ చేరనున్నారు. శంతను నారాయణ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కొనసాగుతారు. మార్పిడి ప్రక్రియలో అనిల్ చక్రవర్తితో కలిసి పనిచేయనున్నారు. అనిల్ చక్రవర్తి అనుభవజ్ఞుడైన నాయకుడని, విలువలు, నిజాయతీతో పనిచేస్తారని శంతను నారాయణ్ ప్రశంసించారు. అడోబ్ వ్యాపారంపై ఆయనకు లోతైన అవగాహన ఉందని తెలిపారు. అనిల్ చక్రవర్తి 2020జనవరిలో అడోబ్‌లో చేరారు. అంతకు ముందు 2015 నుంచి 2020 వరకు ఇన్ఫర్మాటికా సీఈవోగా పనిచేశారు. అడోబ్‌లో చేరిన తర్వాత డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత పలు కీలక పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ ఆర్కెస్ట్రేషన్, వరల్డ్‌వైడ్ ఫీల్డ్ ఆపరేషన్స్‌కు అధ్యక్షుడిగా ఉన్నారు. అనిల్ చక్రవర్తి ఐఐటీ బనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశారు. అనంతరంఅమెరికాలోని ఎంఐటీ నుంచిఎంఎస్, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. సిమాంటెక్, వెరిసైన్, మెకిన్సీ వంటి సంస్థల్లోనూ బాధ్యతలు నిర్వహించారు.

# రూ.40వేల కోట్లమేరకు జియో ఐపిఒ




**ముంబయి, సెప్టెంబరు 4:** భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓకు రంగం సిద్ధమవుతోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్, టెలికాం విభాగం రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ భారీ పబ్లిక్ ఇష్యూకు సన్నాహాలు చేస్తోంది. నవరాత్రి, దీపావళి పండుగల సీజన్‌లో సుమారు రూ.37,000-40,000 కోటు విలువైన మెగా ఐపీఓను తీసుకురావాలని కంపెనీ భావిస్తున్నది. ఇప్పటికే సెబీ నుంచి డ్రాఫ్ట్ పేపర్లకు అనుమతి లభించడంతో జియో ప్లాట్‌ఫామ్స్ తుది తేదీలను ఖరారు చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. తర్వాత దేశీయ, విదేశీ ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు భారీ స్థాయిలో రోడ్‌షోలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ ఐపీఓ పూర్తయితే ఇప్పటి వరకు భారత్‌లో లిస్ట్ అయిన అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా రికార్డు సృష్టించే అవకాశం ఉంది. ఇక జియో ఐపీఓను అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబర్ తొలి వారంలో తీసుకురావచ్చని మార్కెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా నవరాత్రి పండుగ రోజుల్లోనే ఐపీఓను ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం. ఒకవేళ ఆ సమయంలో సాధ్యం కాకపోతే దీపావళి పండుగను టార్గెట్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. జియో ప్లాట్‌ఫామ్స్ ముందుగా అంతర్జాతీయ రోడ్‌షోలు, ఆ తర్వాత దేశీయ రోడ్‌షోలను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దాదాపు మూడు వారాల పాటు విదేశాల్లో, రెండు వారాల పాటు దేశీయంగా రోడ్‌షోలు నిర్వహించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ ద్వారా సుమారు రూ.37,800 కోట్లు సమీకరించే అవకాశం ఉందని బ్యాంకర్లు అంచనా వేస్తున్నారు. భారత ప్రైమరీ మార్కెట్‌లో సరికొత్త రికార్డుగా నిలవనుందని చెబుతున్నారు. ప్రస్తుతం హ్యుందాయ్ మోటార్ ఇండియా 2024లో తీసుకొచ్చిన సుమారు రూ.27,000 కోట్ల ఐపీఓ దేశంలో పూర్తయిన అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా ఉంది. అంతకంటే పెద్దగా జియో ఐపీఓ నిలుస్తోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఐపీఓ విలువ కంటే కూడా జియో ఇష్యూ పెద్దదిగా ఉండొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ప్రకారం జియో ప్లాట్‌ఫామ్స్ 270 మిలియన్ల వరకు కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయాలని ప్రతిపాదించింది. ఇవి ఐపీఓ అనంతరం కంపెనీ ఈక్విటీ క్యాపిటల్‌లో సుమారు 2.9 శాతం వాటాను సూచిస్తాయి. ఈ ప్రతిపాదిత ఐపీఓలో ఆఫర్ ఫర్ సేల్ ఉండదని సమాచారం. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత రిలయన్స్ గ్రూప్ నుంచి వస్తున్న తొలి ఐపీఓ ఇదే కావడం మరో ప్రత్యేకత. జియో ఐపీఓ తో వచ్చే నిధుల్లో కొంత మొత్తాన్ని దాని ఆపరేటింగ్ సబ్సిడియరీ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రుణాన్ని ముందుగానే తీర్చేందుకు వినియోగించనున్నట్లు డిఆర్‌హెచ్‌పిలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలో రూ.27,500 కోట్ల వరకు రుణాన్ని చెల్లించి మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియో గించనున్నట్లు తెలుస్తోంది. రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్‌లో ఇప్పటికే పలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. పెద్ద ఇన్వెస్టర్ల వద్ద కలిపి సుమారు 30.9 శాతం వాటా ఉన్నట్లు సమాచారం. మెటా ప్లాట్‌ఫామ్స్‌కు చెందిన జాదూ హోల్డింగ్స్ వద్ద సుమారు 9.98 శాతం, గూగుల్ ఇంటర్నేషనల్ వద్ద 7.73 శాతం వాటా ఉన్నట్లు డిఆర్‌హెచ్‌పిలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. సౌదీ అరేబియా పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, సిల్వర్ లేక్, విస్టా ఈక్విటీ, జనరల్ అట్లాంటిక్, కెకెఆర్ అనుబంధ సంస్థలు, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీకి చెందిన సంస్థలు కూడా జియోలో పెట్టుబడిదారులుగా ఉన్నాయి.

# ప్రైమరీ మార్కెట్‌కు ఆరు ఐపిఒలు





**ముంబయి,సెప్టెంబరు 4:** భారత ప్రైమరీ మార్కెట్లో కొత్త ఉత్సాహం నెలకొంది. అమెరికాఇరాన్ యుద్ధ పరిణామాల కారణంగా 2026 ప్రారంభంలో నెమ్మదించిన నిధుల సేకరణ ప్రక్రియ మళ్లీ వేగం పుంజుకుంది. ఈనెల 9న ఒకే రోజున రికార్డు స్థాయిలో ఆరు ఐపీఓలు మార్కెట్లో ప్రారంభం కానున్నాయి. ఫర్నీచర్ రెంటల్ వేదిక రెంట్ ఒమోజో, అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా), మణిపాల్ పేమెంట్ ఐడెంటిటీ సొల్యూషన్స్ వంటి ప్రముఖ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ ఆరు కంపెనీలు కలిపి సుమారు 45.11 బిలియన్ రూపాయలు (477.46 మిలియన్ డాలర్లు) సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. వచ్చే వారంలోనే మరికొన్ని ఇతర కంపెనీలతో కలిపి కనీసం 11 ఐపీఓలు మార్కెట్లోకి అడుగుపెడుతుండటంతో ఈ ఏడాదిలోనే ఇది అత్యంత రద్దీగా ఉండే వారంగా నిలవనుంది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల అంచనాల ప్రకారం సెప్టెంబర్ నెలలో మొత్తం మీద దాదాపు 4 బిలియన్ డాలర్ల విలువైన ఐపీఓలు రానున్నాయి. ఆటోమోటివ్ టెక్నాలజీ సంస్థ హీరో మోటార్స్, ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్‌ఎస్‌ఇలతో పాటు ముకేష్ అంబానీ మద్దతు ఉన్న జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ కూడా త్వరలోనే రాబోతోంది. అధిక వృద్ధి అవకాశాలు ఉన్న కంపెనీలకు భారత మార్కెట్లో మంచి డిమాండ్ కనిపిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు 26 నాటికి భారత్‌లో 165 ఐపీఓల ద్వారా 8.61 బిలియన్ డాలర్లు సమీకృతమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఐపీఓ నిధుల సేకరణలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. మార్కెట్ నియంత్రణ సంస్థ ఇచ్చే ఐపీఓ అనుమతుల గడువు ఈనెల 30తో ముగియనుండటంతో కంపెనీలు మార్కెట్లోకి వచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తున్నాయి. గడిచిన ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో సగటున 24.5 రెట్లు ఉన్న ఐపీఓ సబ్‌స్క్రిప్షన్లు, జూలై ఆగస్టు నాటికి 59.1 రెట్లకు పెరిగాయి. అలాగే లిస్టింగ్ లాభాలు కూడా 5.7 శాతం నుంచి 19.5 శాతానికి పైగా పుంజుకున్నాయి. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం పెట్టుబడిదారులు ప్రతి ఐపీఓలోనూ కాకుండా నాణ్యమైన, మంచి వృద్ధి సామర్థ్యం ఉన్న కంపెనీల్లో మాత్రమే జాగ్రత్తగా పెట్టుబడులు పెడుతున్నారు.

## వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలకు లాభాలు



**ముంబయి, సెప్టెంబరు 4:** భారత స్టాక్ మార్కెట్ ఈ వారాంతం లాభాల్లో ముగిసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 362 పాయింట్లు పెరగగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 24 పాయింట్లు పెరిగింది. దీంతో నాలుగు రోజులుగా సాగిన నష్టాలకు శుక్రవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 531.88 పాయింట్ల పెరుగుదలతో 76,684.74 వద్ద ప్రారంభమైంది. నిఫ్టీ 78.25 పాయింట్ల పెరుగుదలతో 23,951.70 వద్ద ప్రారంభమైంది. చివరకు సెన్సెక్స్ 362.57 పాయింట్ల లాభంతో 76,515.43 వద్ద, నిఫ్టీ 24.25 పాయింట్ల లాభంతో 23,897.70 వద్ద ముగిసింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 విలువ 0.25 శాతం నష్టపోగా, నిఫ్టీ మైక్రోక్యాప్ 250 కూడా 0.67 శాతం నష్టపోయింది. నిఫ్టీ రియాల్టీ ఇండెక్స్ 0.90 శాతం పడిపోగా, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 1.07 శాతం పెరిగింది. 30 షేర్ బీఎస్ఈ ఇండెక్స్‌లో రిలయన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, ట్రెంట్ లాభాల్లో ముగిశాయి. మరోవైపు ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, ఎటర్నల్, సన్‌ఫార్మా, టెక్ మహీంద్రా, భారత్ ఎలక్ట్రానిక్స్, మారుతి నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 95.18 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర అంతర్జాతీయ మార్కెట్‌లో 4,472 డాలర్ల వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.45 వద్ద ఉంది. అలాగే బిఎస్ఇ మిడ్‌క్యాప్ 0.01శాతంక్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ 0.24శాతం ఎరిగింది. మార్కెట్లపరంగా ఎన్ఎస్ఇలో 2016 షేర్లుపెరిగితే 1517 షేర్లు క్షీణించగా మరో 115 షేర్లుస్థిరంగా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో అక్టోబరునాటి ఫ్యూచర్ పసిడి ధరలు పదినరగాములకు రూ.1,56,837గా కొనసాగాయి. లిస్టింగ్ అయిన షేర్లలో ఇఎస్‌డిఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ రూ.895.55 చొప్పున ముగిసింది. 108.75శాతం ప్రీమియంతో కొనసాగింది. ప్రయారిటీ జ్యూయెల్స్ 234.45 వద్ద కొనసాగింది. ఇష్యూ ధర కంటే బిఎస్ఇలో 12.6 శాతం ఈ సంస్థ షేర్‌ధరలు కొనసాగాయి.

## 11న ఎన్ఎస్ఇ ఐపిఒ ఇష్యూ ధరల ప్రకటన




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ భారీ ఐపిఒకు సంబంధించి కీలక ప్రకటనకు సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 11న ఐపిఒ ధరల శ్రేణిని ప్రకటించే అవకాశం ఉందని, సెప్టెంబర్ మూడో వారంలో ఎన్ఎస్ఇ షేర్లను లిస్ట్ చేయాలని యోచిస్తున్నట్లు వెల్లడించింది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఎన్ఎస్ఇ ఐపిఒకు ఆగస్టు 2026లోనే నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ లభించింది. సెప్టెంబర్ 2026లో ఎన్ఎస్ఇ షేర్లు బీఎస్ఈలో లిస్టయ్యే అవకాశం ఉందని జులైలోనే వెల్లడి అయింది. ప్రపంచంలో ట్రేడింగ్ పరిమాణం పరంగా అతిపెద్ద డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్‌గా ఉన్న ఎన్ఎస్ఇ ఐపిఒ కోసం జూన్ 17న సెబీకి డ్రాఫ్ట్ పేపర్లను దాఖలు చేసింది. స్ట్రీట్ అంచనాల ప్రకారం ఐపిఒ విలువ రూ.30వేల కోట్లకు పైగా ఉండే అవకాశం ఉంది. అదే జరిగితే భారత స్టాక్ మార్కెట్‌లో ఇప్పటివరకు వచ్చిన అతిపెద్దఐపిఒగా నిలుస్తుంది. ప్రస్తుతం ఈ రికార్డు హ్యుందాయ్ మోటార్ ఇండియా రూ.27,870 కోట్లఐపిఒ పేరిట ఉంది. ఎన్ఎస్ఇ ఐపిఒద్వారా గరిష్ఠంగా రూ.5.26 లక్షల కోట్ల విలువను సంస్థ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. డిఆర్‌హెచ్‌పి ప్రకారం, ఐపిఒ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉంటుంది. ఇందులో ప్రస్తుత వాటాదారులు సుమారు 14.89 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. ఇవి ఎన్ఎస్ఇ చెల్లించిన ఈక్విటీ మూలధనంలో దాదాపు 6 శాతానికి సమానం. ఐపిఒ ప్రక్రియ కోసం ఎన్ఎస్ఇ మొత్తం 20 బ్యాంకులను నియమించింది. కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ, జేఎం ఫైనాన్షియల్, మోర్గాన్ స్టాన్లీ, హెచ్ఎస్‌బీసీ హోల్డింగ్స్, సిటీగ్రూప్ తదితర ప్రముఖ సంస్థలు ఉన్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14